

'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 81

సోమవారం 12-6-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సన్నిధి



మంచి మాట

దాతృత్వం లేదా ఈవి అన్నది ఉద్గుణాలు అన్నిటిలోకెల్లా ఉద్గుణం; సద్గుణాలు అన్నిటిలోకెల్లా సద్గుణం. అవసరమైంది లేనివాళ్లకు తగిన విధంగా అందించడానికి తన శక్తిమేరకు ప్రయత్నించడం ప్రతి మనిషికీ తప్పకుండా ఉండాల్సిన లక్షణం. అది లక్షణంగా మాత్రమే కాకుండా అంతకుమించి ప్రతివ్యక్తికీ ఉండాల్సిన ప్రధాన లక్ష్యంగా కూడా ఉండాలి.



సద్గుణాల్లో ఉద్గుణం దాతృత్వం

వేదవాఙ్మయంలో భాగంగా మనకు అందుబాటులో ఉన్న భిక్షుసూక్తం కమ్యూనిజం కన్నా ఎంతో ముందే అన్నార్తులకు అన్నం పెట్టడం, దీనులకు దానం చెయ్యడం గురించి ప్రగాఢంగా ప్రపంచానికి తెలియజెప్పింది. 'దేవతలు ఆకలిని మరణానికి కారణంగా విధించలేదు. బాగా ఆహారం తిన్న వాళ్లకు కూడా మరణం వచ్చి తీరుతుంది. దానశీలికి సంపద తగ్గదు. ఇవ్వని లేదా పెట్టని వాడిని ఓదార్చే వారు కూడా ఉండరు' అంటూ భిక్షుసూక్తం తొలి శ్లోకం అర్థం చేసుకుని ఆచరించాల్సినదాన్ని ఆవిష్కృతం చేసింది.

ఆకలికి ఆహారం కూడా కరువై అలమటిస్తున్న వాళ్లు ప్రపంచంలో ఇంకా ఉన్నారు. వాళ్లు ఎక్కడో, అక్కడక్కడో మాత్రమే కాదు మన చుట్టుపక్కల కూడా ఉన్నారు. వాళ్లను మనం చూడకపోవడం, చూడలేకపోవడం కాదు చూసినా చూడనట్టు ఉన్నాం, ఉంటున్నాం. మనకు ఎందుకులే అనుకుంటూ,

> పూవుకే కాదు ఈవికి కూడా తావి ఉంటుంది! ఆ తావి పేరు కీర్తి!! ఈవివల్ల మనం కీర్తిమంతులం అవుదాం. బతికి ఉండగానే కాదు, మరలిపోయాక కూడా మనం పరిమళిద్దాం. ఈవితో మనకు మనం తావిని అద్దుకుందాం.

అంటూ మనం వాళ్ల పక్కనే నివసిస్తున్నాం. ఇది అమానవీయం. ఈ అమానవీయత మనలో కొత్తగా చోటు చేసుకున్న అవలక్షణం కాదు. అది మనలో ఎప్పటి నుంచో గూడుకట్టుకుని లేదా పేరుకుపోయి ఉంది. ఆ లక్షణం మనలో ఉండకూడదు అని తెలియజేస్తూ, మనకు తగిన స్ఫూర్తిని ఇస్తూ ఎప్పటి నుంచో ఎంతో చెప్పబడింది; ఎందరో మహనీయులు మనకు ఈ విషయంలో ఆదర్శంగా నిలిచారు. అయినా కూడా ఆ అవలక్షణం అవనిలో అంతరించిపోలేదు.

ప్రపంచం పరిణామాల్ని పొందుతూ ఇవాళ ఉన్న స్థితికి వచ్చాక కూడా ఆకలి అన్నది ప్రపంచంలో ఇంకా ఎందరినో బాధిస్తోంది. ఆకలి తన ఆకలిని తీర్చుకోలేకపోతోందేమో? అందువల్ల అది ఇంకా మనుషుల ప్రాణాల్ని తింటూనే ఉందేమో? ఎప్పటినుంచో ప్రపంచంలో ఆకలి అగ్నికి మనుషుల ప్రాణాలు ఆహుతి అవుతూనే ఉన్నాయి.

'అన్నం కలిగిన వాడై ఉండీ, అవసరమైన దీనులకి ఆహారం పెట్టకుండా మనసును చంపుకుని ఆ దీనుల ముందే ఎవడయితే తాను అనుభవిస్తూ తింటాడో వాడికి అనునయించే వాళ్లు దొరకరు' అన్న విషయాన్ని ఒక హెచ్చరికగా భిక్షుసూక్తం మనకు తెలియజెప్పింది. ఈ సూక్తంలో చెప్పబడినట్టుగా ఆకలి కారణంగా మన సమాజంలో దాడులు జరుగుతూనే ఉన్నాయి.

'ధనవంతుడు పేదలకు తప్పకుండా ఇవ్వాలి. దూరదృష్టితో మార్గాల్ని ఆలోచించి ధనాన్ని పెంచుకునే ప్రయత్నం చెయ్యాలి. ఎందుకంటే రథచక్రాలు తిరుతున్నట్టుగా సంపద ఒకరి నుంచి మఱొకరికి వెళుతూ ఉంటుంది' అనీ,'మూర్ఖుడు అహారాన్ని ఇతరులకి పెట్టకుండా ఆశగా సేకరించి నిల్వ ఉంచుకుంటాడు. నిజం చెబుతున్నాను అది వాడికి చావునే ఇస్తుంది. దేవుడికో, స్నేహితుడికో ఇవ్వకుండా తాను తినే వాడు ఒట్టి పాపి అవుతాడు' అనీ భిక్షుసూక్తం ఎప్పటి నుంచో చెబుతూనే ఉంది. కానీ మానవులు దాన్ని పెద్దగా పట్టించుకోకుండా పాపులుగా లేదా దోషులుగా మనుగడ చేస్తున్నారు.

'ఆహారాన్ని వెతుక్కుంటూ తిరిగే బలహీనులకు ఎవరు వెంటనే ఆహారాన్ని ఇస్తారో వారి కోసం విలువైనవి వేచి ఉన్నాయి. వారు విరోధులతో కూడా స్నేహాన్ని పొందుతారు' అని భిక్షుసూక్తం ఉపదేశించి దాన్ని మనం మనసుతోనూ, మెదడుతోనూ అందుకుని ఆచరణలోకి తీసుకురావాలి. ఆ పని చేస్తూ మనల్ని మనం మనుషులుగా మలుచుకోవాలి; తథాస్తు.

– రోచిష్మాన్


గురువాణి

భగవంతుడు మనకు మాట ఇచ్చాడు, బుద్ధి ఇచ్చాడు, ఇంత గొప్ప శరీరాన్ని ఇచ్చాడు... అన్న విశ్వాసం మనకు ఉండాలి. నేను ఏదో సాధించాలన్న ఉద్దేశంతోనే నాకు ఇవి బహూకరించాడు... ఎన్ని ప్రతిబంధకాలు ఎదురయినా సరే... నేను అనుకున్నది సాధించితీరతాను... అన్న పట్టుదల ఉంటే ఎంతటి నిరాశానిస్పృహలు ఎదురయినా సరే... సునాయాసంగా వాటిని దాటి... లక్ష్యాలను సాధించవచ్చు... అనడానికి – ఆత్మహత్య ఆలోచనలను వెనక్కి తీసుకుని, కష్టాలతోనే కడుపు నింపుకుని, ఒకటి కాదు, రెండు నోబెల్ బహుమతులు గెలుచుకున్న ధీర వనిత మేరీ క్యూరీ గొప్ప ఉదాహరణ.

ఇంచుమించు తనలాగే అనేక కష్టాలను ఓర్చుకుంటూ పరిశోధనలు సాగిస్తున్న పీరే క్యూరీతో పరిచయం, సాహచర్యం తరువాత పెళ్ళికి దారితీసాయి. అయినా కష్టాలు తీరకపోగా కలిసి అనుభవించడం అలవాటు చేసుకున్నారు.

భయంకరమైన కాన్సర్ వ్యాధి చికిత్సకు తోడ్పడగల కారకాల కోసం పరిశోధనలు ముమ్మరంగా సాగుతుండేవి. రేడియోయాక్టివిటీ సిద్ధాంత అభివృద్ధికి, దానితాలూకు పరిశోధనలకు ఆమె గురువుకి, భర్తకి, ఆమెకు కలిపి నోబెల్ బహుమతి లభించింది. ఆ తరువాత ఒక చిన్న రోడ్డు ప్రమాదంలో ఆమె భర్త మరణించారు. తరువాత కాలంలో పొలోనియం, రేడియం మూల పదార్థాల అన్వేషణకు ఈసారి రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి ఆమెను వరించింది. ఒక స్త్రీకి రెండుసార్లు,

ప్రకృతికి పేటెంట్ తీసుకోవచ్చా!!!



మేరీ క్యూరీ

మేరీ అసలు పేరు మరియా. 1867 నవంబరు 7న జన్మించారు. పోలండ్ దేశస్థురాలు. తల్లిదండ్రులు టీచర్లు. 11వ ఏట తల్లి మరణించింది. పోలండ్ లోని రాజకీయ అనిశ్చితి వాతావరణంలో తండ్రి ఉద్యోగం పోయింది. అక్కడినుంచి కష్టాలను ఈదుకుంటూ పారిస్ చేరుకుంది. ఆ రోజుల్లో సైన్స్ చదవడానికి స్త్రీలు ముందుకు రాకుండా సంప్రదాయవాదులనుండి అనేక అవరోధాలుండేవి. ఆమెకు సైన్సంటే మక్కువ, పరిశోధనలంటే ప్రాణం. ఇంటిపట్టునే ఉన్నవనరులతోనే ప్రయోగశాల పెట్టుకుంది. ప్రొఫెసర్ హెన్నీ బెకెరెల్ సాయంతో పరిశోధనలు చేసేది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అదీ రెండు వేర్వేరు సబ్జెక్ట్ లలో నోబెల్ రావడం విశేషం, అపూర్వం.

ఆమె సాధించిన ఫలితాలకు ఆమె కానీ, ఆమె భర్త కానీ పేటెంట్ తీసుకుని ఉంటే.... వారి వారసులు ఇప్పటి లెక్కల ప్రకారం ప్రపంచంలో అత్యంత సంపన్నులుగా ఉండేవారు. కానీ ఆమె నిజ జీవిత సిద్ధాంతం ఏమిటో తెలుసా... ''అవి (ఖనిజాలు) ప్రకృతి ఇచ్చిన వరం. అది ప్రజలది. వాటి మీద నాకేం హక్కు ఉందని పేటెంట్ తీసుకోవాలి. అందరి మేలుకోసం వాటిని నేను ఉపయోగించగలగడం నాకు జీవితంలో దక్కిన అదృష్టం... అందుకే వాటికోసం తాపత్రయపడలేదు. నిజానికి దంపతులిద్దరికీ అవార్డులు, రివార్డుల మీద ధ్యాస ఉండేది కాదు... నిరంతరం పరిశోధనలే... అవికూడా ఇంటిపట్టున ఏర్పాటు చేసుకున్న అరాకొరా సౌకర్యాలతో... సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో ... ధార్మిక ప్రభావానికి ఆమె శరీరం గురయింది... చివరకు ఆమెకు కూడా కాన్సర్ సోకి, మరణానికి దారితీసింది... ఆమె పారిస్ (ఫ్రాన్స్ దేశం)లో స్థిరపడినా, మాతృదేశం పట్ల ఆమెకు ఎంత గాఢమైన ప్రేమంటే... తాను కనుగొన్న పదార్థాలలో ఒకదానికి తన దేశం పేరు ధ్వనించేలా పొలోనియం అని పేరు పెట్టింది. చివరకు తన మరణానంతరం ఖననానికి ముందు.. శవపేటిక తెరచి.. జన్మభూమి పోలండ్ నుంచి తెచ్చిన మట్టి చల్లాలని కోరింది. మానవాళి శ్రేయస్సుకు తపించడం తప్ప ఆమె సర్వసుఖాలను, సంపదలను దూరంగా పెట్టింది.. చివరకు కీర్తి కాంక్షను కూడా.

బౌద్ధవాణి

మేఘ సందేశం

కొండ దారి పక్క కొందరు పిల్లలు ఆడుకుంటూ ఉన్నారు. ఇద్దరు పెద్దవారు ఆ దారిగుండా పోతున్నారు. ఆ పిల్లలు ఆకాశంలో ఉన్న పెద్ద మేఘాన్ని చూస్తూ వాదులాడుకుంటున్నారు.

''అది తోడేలులా ఉంది'' అన్నాడు ఒక పిల్లాడు.



''కాదు... అది ఏనుగులా ఉంది'' అన్నాడు మరొకడు.''లేదు లేదు అది పడుకున్న తోడేలులా ఉంది'' అన్నాడు ఇంకొకడు. ''మంచుకొండలా ఉంది'' అన్నాడు వేరొకడు.

ఈ ఇద్దరు పెద్దలు అక్కడికి వెళ్లారు. పిల్లలు వారిని ఆపి ''ఎవరు సరిగా చెప్పారు?'' అని అడిగారు. వారిద్దరూ ఆ మేఘం కేసి చూశారు. వారిద్దరికీ మరో విధంగా వేరు వేరుగా కనిపించింది. వారు ఏమీ చెప్పలేక ముందుకు సాగారు. పిల్లలు ఆటల్లో పడిపోయారు.

వారు బుద్ధుని ప్రవచనం వినడానికి వెళ్తున్నారు. వారు బుద్ధుని దగ్గరకు వెళ్ళి, నమస్కరించి, దారిలో జరిగిన మేఘం గురించి చెప్పారు.

''మన మనస్సులో చెలరేగిన భావాల్ని బట్టీ మనకి అలా కనిపిస్తాయి. నిశ్చలంగా, నిర్మలంగా ఉండే నీటిలో మన నీడని మనం అద్దంలో వలే చూడగలం. రంగులు కలిసిన నీటిలో, కదిలే నీటిలో, పాచి పట్టిన నీటిలో, బురద నీటిలో చూడలేం కదా. అలాగే కోరికలు, దోషాలు, అలసత్వం, వ్యాకులత, అనుమానాలు.. అనే ఐదు పొరలూ మనస్సును చుట్టి ఉంటే.. మనం చూసేదాన్ని సరిగా చూడలేం.. ఇవి మనస్సును పొరలా కప్పి ఉంచుతాయి'' అన్నాడు.

వారిద్దరికీ ఆ మేఘం ఒక్కొక్కరికీ ఒక్కొక్క రకంగా ఎందుకు కన్పించిందో అర్థమయ్యింది. బుద్ధుడు వారి వంక చూశాడు. వారి మనస్సు గ్రహించాడు.

''ఉపాసకులారా! మీకు ఐదు రకాల మనుషుల గురించి చెప్తాను. వినండి''.

''భగవాన్ సెలవియ్యండి'' అన్నారు వారు.

''ఒక వ్యక్తికి అప్పు ఉంటుంది. అతను ఏదో పని కోసం అలా అప్పు చేశాడు. ఆ పని పూర్తి చేశాడు. ఆ తరువాత అప్పు తీర్చాడు. అతనికి ఇంకా కొంత ధనం మిగిలి ఉంటుంది. ఆ సొమ్ముతో కుటుంబ పోషణ చేశాడు. అప్పుడతను ఎంతో సంతోషాన్ని పొందుతాడు. అతను ఋణగ్రస్తునిలా ఉన్నప్పుడు ఆ సంతోషం పొందలేడు''


మరో వ్యక్తి ఉన్నాడు. అతనికి తీవ్రమైన వ్యాధి సోకింది. మంచాన పడ్డాడు. కొన్నాళ్ళకు ఆ వ్యాధి తగ్గింది. లేచాడు. సత్తువ వచ్చింది. ఆహారం చక్కగా తీసుకోసాగాడు. అలాగే... బానిసత్వం నుండి బయటపడి స్వేచ్ఛ పొందినవారు, చెరసాల నుండి విడుదలైన వారు కూడా సంతోషాన్ని పొందుతారు. అలాగే.. ఎక్కువ ధనాన్ని వెంట తీసుకుని అడవి మార్గంలో పోయేవారు, సురక్షితంగా అడవి దాటితే ... అలాంటి సంతోషాన్నే పొందుతారు.

ఈ ఐదుగురూ మొదట దశలో భయపడ్డారు. బాధపడ్డారు. కలవరపడ్డారు. కానీ, చివరికి అమిత సంతోషాన్ని పొందారు. మన మనస్సుకు ఐదు పొరలూ అడ్డు పడుతూ ఉంటాయి. అందుకే సరిగా చూడలేం. సరిగా వినలేం. సరిగా ఆలోచించలేం. అవి అడ్డు పడి ఉన్నంత కాలం అప్పు చేసిన వాడిలా, రోగిలా, ఖైదీలా, బానిసలా, అడవిలో ప్రయాణికునిలా భయానికి లోనవుతాం. బాధల్లో కూరుకుపోతాం. ఈ పొరలు తొలగితే ఉన్నది ఉన్నట్లు చూడగలం. సత్యాన్ని సత్యంగా గ్రహించగలం'' అన్నాడు.

ఒకే మేఘం పిల్లలకూ, తమకూ వేరువేరుగా ఎందుకు కనిపించిందో వారికి అర్థమయ్యింది. మనస్సు నుండి ఈ అవరోధాలు తొలగితే.. ఉన్నది ఉన్నట్లు చూడగలం'' అని గ్రహించారు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా



ప్రభాస్, కృతీసనన్

రామాలయానికి 100 టిక్కెట్లు ఉచితం

హీరో ప్రభాస్ రామునిగా నటించిన 'ఆదిపురుష్' సినిమా కోసం పాన్ ఇండియా వ్యాప్తంగా ప్రేక్షకులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. ఓమ్ రౌత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కృతీసనన్ సీతగా నటించారు. భూషణ్ కుమార్, క్రిష్ణకుమార్, ఓమ్ రౌత్, ప్రసాద్ సుతారియా, రెట్రోఫిల్స్ రాజేష్ నాయర్, యూవీ క్రియేషన్స్ వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 16న విడుదలవుతోంది. తెలుగు రాష్ట్రాల్లో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ రిలీజ్ చేస్తోంది. 'రామాయణ పారాయణం జరిగే ప్రతి చోటుకి హనుమంతుడు విచ్చేస్తాడు అనేది మన నమ్మకం. ఈ నమ్మకాన్ని గౌరవిస్తూ 'ఆదిపురుష్' సినిమాని ప్రదర్శించే ప్రతి థియేటర్లో ఒక సీటు విక్రయించకుండా హనుమంతుడి కోసం ప్రత్యేకంగా కేటాయిస్తున్నాం' అంటూ యూనిట్ ఇటీవల ప్రకటించింది. ఈ మంచి కార్యాన్ని తమవంతుగా ప్రోత్సహిస్తూ శ్రేయాస్ మీడియా వారు మరో నిర్ణయం తీసుకున్నారు. ఖమ్మం జిల్లాలో ఉన్న ప్రతి రామాలయానికి 100+1 (1 టిక్కెట్ హనుమాన్‌కి) టిక్కెట్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు శ్రేయాస్ మీడియా అధినేత శ్రీనివాస్ తెలిపారు. టిక్కెట్లు కావాల్సిన వారు తమను సంప్రదించాలని పేర్కొన్నారు.

గుండెల్లో మోగిందే నీ కబురే!

నిఖిల్, ఐశ్వర్యా మీనన్ జంటగా ఆర్యన్ రాజేష్, సన్యా ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటించిన యాక్షన్ ఫిల్మ్ 'స్పై'. ఎడిటర్ గ్యారీ బీహెచ్ దర్శకత్వంలో కె.రాజశేఖర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించిన ఈ మూవీలోని ''మొదటిసారిగా చూపు తగిలే... గుండెల్లో మోగిందే నీ తొలి కబురే, జుమ్ జుమ్మనే గుండెల్లోన యుద్ధాలే.. సిద్ధంగా ఉంచా నీకే ఏడుజన్మలే..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను చిత్రయూనిట్ ఆదివారం విడుదల చేసింది. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి, రమ్యా బెహ్రా పాడారు. స్వాతంత్ర్య సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ డెత్ మిస్టరీ అంశాల నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకి కెమెరా: వంశీ పచ్చిపులుసు, మార్క్ డేవిడ్, సంగీతం: శ్రీచరణ్ పాకాల, విశాల్ చంద్రశేఖర్.



నిఖిల్, ఐశ్వర్యా మీనన్

వైల్డ్ యానిమల్

రణ్‌బీర్ కపూర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'యానిమల్'. 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాలోని ఓ యాక్షన్ సీక్వెన్స్ నుంచి చిన్న సీన్‌ను ప్రీ టీజర్‌గా ఆదివారం విడుదల చేసింది చిత్రయూనిట్. 'వైల్డ్ యానిమల్', 'వైలెంట్ యానిమల్' అంటూ 'యానిమల్' ప్రీ టీజర్ గురించి పోస్టులు చేస్తున్నారు నెటిజన్లు. ఫుల్ టీజర్ ఈ నెల 16న విడుదల కానుందని సమాచారం. తండ్రీ కొడుకుల భావోద్వేగాల నేపథ్యంలో ఈ సినిమా కథ, కథనాలు ఉంటాయట. ఓ కాలేజ్ లెక్చరర్ అయిన యువకుడు తండ్రి కోసం మాఫియాతో ఏ విధంగా పోరాడాడు? అనే కథాంశంతో 'యానిమల్' తెరకెక్కుతోందని ప్రచారం సాగుతోంది. ఈ సినిమా తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, హిందీ భాషల్లో ఆగస్టులో విడుదల కానుంది.



రణ్‌బీర్ కపూర్

శ్రీకాకుళం యాసతో...

రవి మహాదాస్యం, అనన్య నాగళ్ల జంటగా చల్లా రాజా రామ్మోహన్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోంది. బేబీ లాస్య రెడ్డి సమర్పణలో శ్రీ గణపతి సినిమాస్‌పై వెన్నపూస రమణారెడ్డి నిర్మిస్తున్న ఈ మూవీ షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సందర్భంగా రాజా రామ్మోహన్ మాట్లాడుతూ– ''కామెడీ, ఎమోషన్, సెంటిమెంట్.. ఇలా అన్ని వాణిజ్య అంశాలతో ఈ చిత్ర కథ ఆసక్తిగా ఉంటుంది. శ్రీకాకుళం యాస ఇతివృత్తంతో తెరకెక్కుతోన్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది'' అన్నారు. 'వెన్నెల' కిశోర్, శియా గౌతమ్, 'బాహుబలి' ప్రభాకర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు సంగీతం: సునీల్ కశ్యప్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రాజేష్ రంబాల.



అనన్య నాగళ్ల

ద్రవిడభూమి గొప్పతనంతో...

ప్రముఖ రచయిత సొద అరుణ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కోడ్ రామాయణ'. ఈ చిత్రంలో సుమారు 50 మంది నూతన నటీనటులు యాక్ట్ చేశారు. సొద అరుణ్ స్టూడియోస్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం టైటిల్ అనౌన్స్‌మెంట్ హైదరాబాద్‌లో జరిగింది. ముఖ్య అతిథులుగా వచ్చిన బౌద్ధ భిక్షువు బంతె షీల్ రక్షిత్, ప్రముఖ రచయిత్రి లలిత. పి. చేతుల మీదుగా 'కోడ్ రామాయణ' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక–నిర్మాత సొద అరుణ్ మాట్లాడుతూ–''ద్రవిడ భూమి గొప్పతనాన్ని ప్రపంచం మరింత అర్థం చేసుకోవాలనే ఈ సినిమా చేస్తున్నాం. ఈ చిత్రం మొత్తం మూడు భాగాలుగా(కోడ్ రామాయణ, రావణ చరిత్ర, ఉత్తర రామాయణం) ప్రేక్షకుల ముందుకు వస్తుంది'' అన్నారు. ఈ చిత్రంలో దుర్వాసుడు పాత్రలో నటించిన భరద్వాజ మాట్లాడుతూ–''కోడ్ రామాయణ' అంటే రామాయణ అంతరార్థం అని అర్థం. ఈ సినిమాని చిరంజీవిగారికి చూపించి, రెండో భాగంలో రావణాసుర పాత్ర చేయమని కోరతాం'' అన్నారు. నటులు శ్రీశైల్ రెడ్డి, పి.జగదీశ్ పాల్గొన్నారు.



శ్రీశైల్ రెడ్డి, భరద్వాజ, సొద అరుణ్, పమ్మిడి జగదీశ్

హారర్.. థ్రిల్లర్



రవిబాబు

రవిబాబు, సత్యప్రకాష్, 'చిత్రం' శ్రీను కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'టెర్రర్ ద వే ఆఫ్ డెవిల్'. ఈ చిత్రం ద్వారా సీవీఎస్ఎమ్ వెంకట్ రవీంద్రనాథ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శ్రీ కృష్ణార్జున మూవీ మేకర్స్‌పై పెదారికట్ల చెన్నైబోయిన నరసమ్మ, వెంకటేశ్వర్లు యాదవ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా తొలి షెడ్యూల్ పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పెదారికట్ల చెన్నైబోయిన నరసమ్మ, వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ–''గతంలో గ్రామాల్లో మాతంగులు జీవించేవారు. వారి జీవితాల ఆధారంగా అల్లుకున్న కథకి హారర్, థ్రిల్లర్ అంశాలు జోడించి ఈ చిత్రం నిర్మిస్తున్నాం. ఈ మూవీ ద్వారా ముగ్గురు కొత్త అమ్మాయిలను హీరోయిన్స్‌గా పరిచయం చేస్తున్నాం. తెలుగు, కన్నడ భాషల్లో ఏకకాలంలో నిర్మిస్తున్న ఈ సినిమా రెండవ షెడ్యూల్ నేటి నుంచి ప్రారంభం అవుతుంది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: పీకే స్టిల్ రాజ్ కమల్.

చిన్న సినిమాలు సక్సెస్ కావాలి – ప్రసన్న కుమార్



లక్ష్మీపతి, ప్రసన్న కుమార్, ఘటికాచలం

''చిన్న సినిమాలు సక్సెస్ అయితే ఇండస్ట్రీ బాగుంటుంది. లక్ష్మీపతిలాంటి నిర్మాతలు ఇండస్ట్రీకి వస్తారు. 'ఐక్యూ' సినిమా సక్సెస్‌తో ఆయన మరిన్ని సినిమాలు ప్లాన్ చేస్తున్నారు'' అని నిర్మాత ప్రసన్న కుమార్ అన్నారు. సాయి చరణ్, పల్లవి జంటగా జీఎల్‌బీ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన చిత్రం 'ఐక్యూ'. కేఎల్‌పీ మూవీస్ పతాకంపై కాయగూరల లక్ష్మీపతి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 2న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కాయగూరల లక్ష్మీపతి మాట్లాడుతూ–''ఐక్యూ' సినిమా కథ జనాలకు బాగా కనెక్ట్ అయింది.. అందుకే రెండో వారం కూడా సక్సెస్‌ఫుల్‌గా నడుస్తోంది'' అన్నారు. రచయిత ఘటికాచలం పాల్గొన్నారు.

మర్డర్ మిస్టరీ



అరుణ్, సృజన

అరుణ్, సృజన జంటగా సురేష్ రెడ్డి దర్శకత్వంలో 'వేటాడతా' చిత్రం తెరకెక్కుతోంది. ఎమ్.అంకయ్య నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. వైజాగ్ మాజీ మేయర్ దాడి సత్యనారాయణ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత సాయివెంకట్ క్లాప్ ఇచ్చారు. నిర్మాత నాగులపల్లి పద్మిని స్క్రిప్ట్ అందించగా, నిర్మాత రామ సత్యనారాయణ తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ–''సస్పెన్స్ అండ్ మర్డర్ మిస్టరీగా 'వేటాడతా' చిత్రం రూపొందుతోంది. ఈ నెలాఖరులో షూటింగ్‌ను స్టార్ట్ చేస్తాం. అరకు, హైదరాబాద్, నంద్యాల ప్రాంతాల్లో చిత్రీకరిస్తాం'' అన్నారు. ''మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు అంకయ్య. ''మా నాన్న(అంకయ్య) సిద్ధం చేసిన కథతో హీరోగా పరిచయమవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది'' అన్నారు అరుణ్. ఈ సినిమాకు సహ–నిర్మాత: డి.శివ ప్రసాద్, సంగీతం: శేఖర్ మోపూరి.

గ్లాడియేటర్-2 సెట్‌లో అగ్నిప్రమాదం



రిడ్లీ స్కాట్

హాలీవుడ్ చిత్రం 'గ్లాడియేటర్-2' సెట్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీంతో కొంతమంది యూనిట్ సభ్యులు గాయపడ్డారు. రిడ్లీ స్కాట్ దర్శకత్వంలో రెండు దశాబ్దాల క్రితం ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'గ్లాడియేటర్' ఫిల్మ్ సూపర్ హిట్‌గా నిలిచింది. 73వ ఆస్కార్ అవార్డ్స్‌లో ఈ చిత్రం ఐదు విభాగాల్లో అవార్డులు సాధించింది. తాజాగా 'గ్లాడియేటర్' సినిమాకు సీక్వెల్‌గా 'గ్లాడియేటర్-2' తెరకెక్కిస్తున్నారు రిడ్లీ స్కాట్. పాల్ మెస్కల్, డెంజెల్ వాషింగ్టన్, కొన్నీ నిల్సన్ ప్రధాన పాత్రధారులు. ఈ సినిమా తాజా షెడ్యూల్ ఇటీవల మొరాకోలో ప్రారంభమైంది. ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్న సమయంలో సెట్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకున్నట్లు హాలీవుడ్‌లో వార్తలొస్తున్నాయి. ''గ్లాడియేటర్ -2' సెట్స్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఆరుగురు సిబ్బంది గాయపడ్డారు. ప్రధాన నటీనటులు ఎవరూ గాయపడలేదు'' అని చిత్ర నిర్మాణ సంస్థ పారామౌంట్ పిక్చర్స్ ప్రతినిధి పేర్కొన్నట్లు హాలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి.

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 81

సోమవారం 12-6-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | CHENNAI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'



“ఓటమితో నిరాశగా ఉన్నా. మ్యాచ్ మొదటి సెషన్‌లో మేం బాగా బౌలింగ్ చేసినా తర్వాత ప్రత్యర్థి కోలుకునేందుకు అవకాశం ఇచ్చాం. హెడ్ చెలరేగిన తర్వాత మ్యాచ్‌లో కోలుకోవడం అంత సులువు కాదని మాకు తెలుసు. కొన్ని సార్లు గట్టి పోటీనివ్వగలిగినా ఆస్ట్రేలియా చాలా బాగా ఆడింది. మా వ్యూహాలేవి పని చేయలేదు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్నా మేం వాడుకోలేకపోయాం. నాలుగేళ్లలో ఎంతో కష్టపడి రెండు సార్లు ఫైనల్ చేరాం. మేం సాధించిన విజయాల విలువ ఈ ఓటమితో తగ్గదు. నా అభిప్రాయం ప్రకారం ఫైనల్‌ను మూడు మ్యాచ్‌ల సిరీస్‌గా నిర్వహిస్తే బాగుంటుంది. అదీ ఇంగ్లండ్‌లోనే, జూన్‌లోనే ఎందుకు జరగాలి. దీనినీ మార్చవచ్చు కదా. -రోహిత్ శర్మ, భారత కెప్టెన్

టాస్ ఓడిపోవడమే మంచిదైంది. లేకపోతే మేమూ బౌలింగ్ తీసుకునేవాళ్లం. కొన్నిసార్లు భారత్ ప్రతిఘటించినా, ఎక్కువ భాగం మేమే ఆధిపత్యం ప్రదర్శించాం. మాకు సంబంధించి ఇదో మధుర క్షణం. ఈ విజయాన్ని కొన్ని రోజులు ఆస్వాదించిన తర్వాతే యాషెస్ గురించి ఆలోచిస్తాం. ఫైనల్ ఒక్క మ్యాచ్ ఉండటమే మంచిది. అనుకుంటే 50 మ్యాచ్‌ల సిరీస్ కూడా ఆడవచ్చు. ఒలింపిక్స్‌లో ఒక్క రేస్ గెలిస్తేనే స్వర్ణం దక్కుతుంది కదా. -ప్యాట్ కమిన్స్, ఆస్ట్రేలియా కెప్టెన్”





అప్పగించేశారు

ఐదో రోజు పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. కోహ్లి, రహానే కలిసి కమాల్ చూపిస్తారనుకున్న భారత అభిమానులకు అసలు పరిస్థితి కొద్ది సేపటికే అర్థమైంది. ఒక వికెట్ పడగానే మిగతా వారంతా అనుసరించేశారు. కోలుకునే అవకాశమే లేకుండా మ్యాచ్‌ను అప్పగించేశారు. వరుసగా రెండోసారి టీమిండియా ఫైనల్ చేరిన ఆనందం అక్కడికే పరిమితం కాగా, ఆస్ట్రేలియా తొలిసారి వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. గతంలో భారత్‌తో టెస్టుల్లో చేసిన పొరపాట్లను ఆస్ట్రేలియా ఈసారి చేయలేదు. మరో ‘గాబా’కు అవకాశం ఇవ్వలేదు. చివరి రోజు తొలి బంతి నుంచే కట్టుదిట్టమైన బౌలింగ్‌తో బ్యాటర్లను కదలనీయకుండా చేసిన కంగారూలు ఒత్తిడి పెంచి వరుస వికెట్లు తీశారు. వన్డే, టి20 ప్రపంచకప్‌ల తర్వాత సాంప్రదాయ క్రికెట్‌లో వరల్డ్ కప్‌లాంటి చాంపియన్‌షిప్‌ను అందుకొని కంగారూలు శిఖరాన నిలిచారు.

డబ్ల్యూటీసీ ఫైనల్లో భారత్ చిత్తు

రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 234 ఆలౌట్

తొలిసారి టెస్టుల్లో ప్రపంచ చాంపియన్‌గా ఆసీస్

209 పరుగులతో ఆస్ట్రేలియా ఘన విజయం

లండన్: రెండో వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) టైటిల్‌ను ఆస్ట్రేలియా సొంతం చేసుకుంది. ఆదివారం ముగిసిన ఫైనల్లో ఆసీస్ 209 పరుగుల భారీ తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. చివరి రోజు హోరాహోరీగా సాగుతుందనుకున్న ఆట భారత్ పేలవ బ్యాటింగ్‌తో ఏకపక్షంగా ముగిసింది. 444 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 164/3తో ఆట కొనసాగించిన భారత్ 234 పరుగులకే ఆలౌటైంది. విరాట్ కోహ్లి (78 బంతుల్లో 49; 7 ఫోర్లు), అజింక్య రహానే (108 బంతుల్లో 46; 7 ఫోర్లు) తమ జోరును చివరి రోజు కొనసాగించలేకపోయారు. లయన్‌కు 4 వికెట్లు దక్కాయి. ట్రవిస్ హెడ్‌కు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ పురస్కారం లభించింది.

విజేత ఆస్ట్రేలియా జట్టుకు గదతోపాటు 16 లక్షల డాలర్లు (రూ. 13 కోట్ల 19 లక్షలు), రన్నరప్ భారత జట్టుకు 8 లక్షల డాలర్లు (రూ. 6 కోట్ల 59 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

23.3 ఓవర్లు... 70 పరుగులు... 7 వికెట్లు... చివరి రోజు భారత జట్టు ప్రదర్శన ఇది. శనివారం ఆఖరి గంటలో ప్రదర్శించిన పట్టుదల గానీ, దూకుడు కానీ ఎక్కడా కనిపించలేదు. ఒకరి వెనుక ఒకరు వరుస కట్టడంతో లంచ్‌లోపే ఓటమి ఖాయమైంది. తొలి 6 ఓవర్ల పాటు కోహ్లి, రహానే గట్టిగా నిలబడ్డారు. అయితే బోలండ్ వేసిన తర్వాతి ఓవర్ ఆటను మలుపు తిప్పింది. స్లిప్‌లో స్మిత్ చక్కటి క్యాచ్‌కు కోహ్లి వెనుదిరగ్గా, మరో రెండు బంతులకే జడేజా (0) కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఇన్నింగ్స్ ఆరంభం నుంచి చెత్త బౌలింగ్ వేసిన స్టార్క్ అసలు సమయంలో తన విలువను చూపించాడు. అతని బంతిని ఆడలేక రహానే కీపర్‌కు క్యాచ్ ఇవ్వడంతో భారత్ వేగంగా ఓటమి దిశగా పయనించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆదుకున్న శార్దుల్ (0) ఈసారి నిలవలేకపోగా, ఉమేశ్ యాదవ్ (1) అతడిని అనుసరించాడు. కొద్దిసేపు పోరాడిన శ్రీకర్ భరత్ (41 బంతుల్లో 23; 2 ఫోర్లు)ను వెనక్కి పంపిన లయన్, తన తర్వాతి ఓవర్లో సిరాజ్ (1)ను అవుట్ చేసి భారత్ ఆట ముగించాడు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 469; భారత్ తొలి ఇన్నింగ్స్: 296; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 270/8 డిక్లేర్డ్; భారత్ రెండో ఇన్నింగ్స్: రోహిత్ (ఎల్బీ) (బి) లయన్ 43; గిల్ (సి) గ్రీన్ (బి) బోలండ్ 18; పుజారా (సి) క్యారీ (బి) కమిన్స్ 27; కోహ్లి (సి) స్మిత్ (బి) బోలండ్ 49; రహానే (సి) క్యారీ (బి) స్టార్క్ 46; జడేజా (సి) క్యారీ (బి) బోలండ్ 0; భరత్ (సి అండ్ బి) లయన్ 23; శార్దుల్ (ఎల్బీ) (బి) లయన్ 0; ఉమేశ్ (సి) క్యారీ (బి) స్టార్క్ 1; షమీ (నాటౌట్) 13; సిరాజ్ (సి) బోలండ్ (బి) లయన్ 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం** (63.3 ఓవర్లలో ఆలౌట్) 234. **వికెట్ల పతనం:** 1-41, 2-92, 3-93, 4-179, 5-179, 6-212, 7-213, 8-220, 9-224, 10-234. **బౌలింగ్:** కమిన్స్ 13-1-55-1, బోలండ్ 16-2-46-3, స్టార్క్ 14-1-77-2, గ్రీన్ 5-0-13-0, లయన్ 15.3-2-41-4.


1 అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఆధ్వర్యంలో నిర్వహించే అన్ని టోర్నమెంట్‌లను గెలిచిన తొలి జట్టుగా ఆస్ట్రేలియా గుర్తింపు పొందింది. ఆస్ట్రేలియా జట్టు ఐదుసార్లు (1987, 1999, 2003, 2007, 2015) వన్డే వరల్డ్‌కప్‌ను... రెండుసార్లు (2006, 2009) చాంపియన్స్ ట్రోఫీని... ఒకసారి (2021) టి20 వరల్డ్‌కప్‌ను.. ఒకసారి (2023) ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌ను సాధించింది.

టాస్ నుంచి ఓటమి వరకు...

‘వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ గెలవనంత మాత్రాన మా జట్టు గత రెండేళ్లలో సాధించిన విజయాల విలువ తగ్గదు. మా టీమ్ ఎన్నో గొప్ప విజయాలు అందుకుంది’... డబ్ల్యూటీసీ ఫైనల్ ప్రారంభానికి ముందు భారత హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ చేసిన వ్యాఖ్య ఇది. అంకెల్లో చూస్తే అది వాస్తవమే అయినా, ఒక మెగా ఈవెంట్‌కు ముందు ఈ తరహా నెగెటివ్ వ్యాఖ్యలు కోచ్ నుంచి రావడం ఎవరికీ నచ్చలేదు. ఓడిపోవడానికి ముందే దాని కోసం సాకులు వెతుకుతున్నట్లుగా ఉందని దీనిపై చాలా మంది క్రికెట్ అభిమానులు విమర్శించారు. చివరకు మ్యాచ్ ఫలితం అలాగే వచ్చింది.


హెడ్ కోచ్ ద్రవిడ్
కెప్టెన్ రోహిత్ శర్మ

- ఆటగాడిగా దిగ్గజ స్థాయి ఉన్న ద్రవిడ్ కోచ్‌గా అండర్-19, ఇండియా ‘ఎ’ టీమ్‌ల తరఫున మాత్రం గొప్ప ఫలితాలు రాబట్టాడు. అయితే సీనియర్ టీమ్ కోచ్‌గా ద్రవిడ్ ఆశించిన ఫలితాలు రాబట్టలేదనేది వాస్తవం. టీమ్ మేనేజ్‌మెంట్‌లో ప్రధాన భాగమైన ద్రవిడ్ తొలి రోజే పిచ్‌పై అంచనా తప్పడం భారత్‌ను దెబ్బ తీసిందనేది వాస్తవం. తీవ్ర ఒత్తిడి ఉండే ఫైనల్ మ్యాచ్‌లో నాలుగో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయడం అంత సులువు కాదని తెలిసినా టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోవడం పెద్ద తప్పు. ఇంగ్లండ్‌లో వాతావరణం గంటగంటకూ మారుతుందని ద్రవిడ్‌కు బాగా తెలుసు. మన పేసర్లపై నమ్మకం ఉండటమే కాదు... మబ్బులు కమ్మిన వేళ మనం బ్యాటింగ్ తీసుకొని ఆసీస్ బౌలర్లు చెలరేగిపోతే జట్టు కుప్పకూలిపోతుందనే భయం కూడా ద్రవిడ్ మనసులో ఉండవచ్చు. గంట తర్వాత అంతా మారిపోయింది. హెడ్, స్మిత్ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశారు. ఆ భాగస్వామ్యంతోనే భారత్ వెనకడుగు వేసింది. తొలిరోజు ఆసీస్ 327/3 వద్ద ముగించడంతోనే మన ఓటమికి పునాది పడింది. భారత్ సన్నాహాలు బాగా లేవనే వాస్తవాన్ని మాత్రం అతను టెస్టు ముగిసిన తర్వాత అంగీకరించాడు. ‘ఒక కోచ్‌గా మాకు ప్రాక్టీస్‌కు లభించిన సమయంతో సంతృప్తిగా లేను. అయితే అది నా చేతుల్లో లేదు. షెడ్యూల్ చాలా బిజీగా ఉంది. నాకు అందుబాటులో ఉన్న వనరులతోనే ఆడాలి’ అని ద్రవిడ్ చెప్పాడు.
- అగ్రశ్రేణి బౌలర్ అశ్విన్‌ను తప్పించడం కూడా చర్చనీయాంశం. అతను భారత్‌లో మాత్రమే బాగా ఆడగలడనేది కూడా అపోహ మాత్రమే. మ్యాచ్‌కు ముందు అశ్విన్ ప్రత్యేకతపై మాట్లాడిన సచిన్ టెండూల్కర్ మ్యాచ్ తర్వాత అదే అభిప్రాయం వ్యక్తం చేయడం అతని విలువను చూపిస్తుంది. ‘గొప్ప బౌలర్లకు పిచ్‌తో పని లేదు. టర్నింగ్ లేని చోట కూడా ఫలితాలు సాధించే అశ్విన్‌ను ఎందుకు ఆడించలేదో నాకూ అర్థం కాలేదు’ అని సచిన్ చెప్పాడు. ఆసీస్‌పై మెరుగైన రికార్డు, ఆ జట్టులో టాప్-6లో నలుగురు ఎడంచేతి వాటం కావడంతో కచ్చితంగా అతను ప్రభావం చూపించగలిగే వాడనేది వాస్తవం. ఆల్‌రౌండర్, గత ఓవల్ టెస్టులో ప్రదర్శన ఆధారంగా శార్దుల్‌కు చోటు ఖాయం కాగా... ఉమేశ్ యాదవ్‌కు బదులు అశ్విన్‌ను ఆడించి ఉండే బాగుండేది. ఉమేశ్ ఈ మ్యాచ్‌లో పూర్తిగా విఫలం కాగా... చివరి ఇన్నింగ్స్‌లో లయన్ చూపించిన ప్రభావం అశ్విన్‌ను గుర్తు చేసింది.
- మ్యాచ్‌లో మన ఆటగాళ్ల ప్రదర్శన చూస్తే కొంత విరామం తర్వాత పునరాగమనం చేసిన అజింక్య రహానేకే ఎక్కువ మార్కులు పడతాయి. రెండు ఇన్నింగ్స్‌లలోనూ అతను ప్రభావం చూపించగలిగాడు. ఇక శార్దుల్ ఠాకూర్, రవీంద్ర జడేజా తొలి ఇన్నింగ్స్‌లో జట్టును ఆదుకున్నా... రెండో ఇన్నింగ్స్‌లో ఇద్దరూ విఫలమయ్యారు. బౌలర్లుగా వీరిద్దరూ పెద్దగా ప్రభావం చూపలేదు. షమీ, సిరాజ్ మాత్రమే చాలావరకు తమ స్థాయిలో గట్టిగా ప్రయత్నించారు. అయితే ఎన్ని విశ్లేషణలు చేసినా... టాప్-4 బ్యాటింగ్ వైఫల్యమే జట్టును దెబ్బ తీసిందనేది వాస్తవం. తొలి ఇన్నింగ్స్‌లోనూ ఈ నలుగురు విఫలం కాగా, రెండో ఇన్నింగ్స్‌లో కీలక సమయాల్లో రోహిత్, పుజారా చెత్త షాట్లు ఆడి ఛేదనను కఠినంగా మార్చేశారు. లయన్ తొలి ఓవర్లోనే స్వీప్ షాట్‌కు ప్రయత్నించి రోహిత్ చేసిన సాహసం. చాలా రోజులుగా కౌంటీల్లో అద్భుత ప్రదర్శన చేసిన పుజారా అనుభవం ఇక్కడ పనికొస్తుందని భావించగా, అది అర్ధ సత్యమే. పుజారా చేసిన పరుగులన్నీ కౌంటీలో పేలవమైన బౌలర్లు ఉండే ద్వితీయ శ్రేణి మ్యాచుల్లోనే! ఐపీఎల్ ఆడని ఒకే ఒక ఆటగాడు పుజారా ఐపీఎల్ తరహా షాట్‌కు ప్రయత్నించి అవుట్ కావడం ఆశ్చర్యకరం. ‘కోహ్లి చెత్త షాట్ ఆడాడు. అది ఎందుకు ఆడాడో అతడినే అడగాలి. గెలవాలంటే సుదీర్ఘ ఇన్నింగ్స్ ఆడాలని అతను చెబుతుంటాడు. ఇలాంటి షాట్‌తో అది సాధ్యమా’ అని గావస్కర్ విమర్శించడం విశేషం.


రహానే

- బుమ్రా, పంత్ లేని లోటు కనిపించిందనేది వాస్తవమే అయినా... ఓటమికి అది మాత్రం కారణం కాదు. ఆంధ్ర ఆటగాడు కేఎస్ భరత్ బ్యాటింగ్‌పై చాలా మంది విమర్శలు చేస్తున్నా ఆ మాటలకు విలువ లేదు. తన అసలు బాధ్యత వికెట్ కీపింగ్‌లో అతను అద్భుత ప్రదర్శన కనబర్చాడు. టాప్-6 పరుగులు చేయకుండా 7వ నంబర్ ఆటగాడిని ప్రశ్నించడం అర్థరహితం. రెండేళ్ల క్రితం కూడా న్యూజిలాండ్‌తో ఫైనల్లో భారత్ ఇదే టాప్-5తో ఆడింది. నాడూ రెండు ఇన్నింగ్స్‌లలోనూ బ్యాటింగ్ వైఫల్యంతో భారత్ ఓడింది. ఇప్పుడూ అదే పునరావృతమైంది.


భరత్

- మరోవైపు సొంతగడ్డపై వరుసగా రెండు సిరీస్‌లు, ఇటీవల భారత గడ్డపై మరో సిరీస్ కలిపి వరుసగా 3 సిరీస్‌లలో టీమిండియా చేతిలో ఓడిన ఆస్ట్రేలియా ఈ మ్యాచ్‌కు మాత్రం బాగా సన్నద్ధమై వచ్చింది. ఐపీఎల్ ఆడిన వార్నర్, గ్రీన్ మినహా అంతా చాలా రోజులుగా కఠోర సాధన చేశారు. అది ఓవల్‌లో కనిపించింది. రెండేళ్ల క్రితం ఓవర్‌రేట్ జరిమానాగా పాయింట్ల కోతతో ఫైనల్ అవకాశాలు కోల్పోయిన కంగారూలు ఈ సారి తుది పోరుకు అర్హత సాధించడంతో పాటు తమ పూర్తి సత్తాను చాటి విజేతగా నిలిచారు.

-సాక్షి క్రీడా విభాగం


నేనే రాజు... నేనే రారాజు

జొకోవిచ్ ఖాతాలో 23వ గ్రాండ్‌స్లామ్ టైటిల్

అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించిన టెన్నిస్ ప్లేయర్‌గా కొత్త రికార్డు

మూడోసారి ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గిన సెర్బియా స్టార్ | **మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ హస్తగతం** | **రూ. 20 కోట్ల 41 లక్షల ప్రైజ్‌మనీ సొంతం**

పురుషుల టెన్నిస్‌లో ఆదివారం అద్భుతం ఆవిష్కృతమైంది. సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన క్రీడాకారుడిగా అవతరించాడు. 22 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌తో స్పెయిన్ స్టార్ రాఫెల్ నాదల్‌తో సమఉజ్జీగా ఉన్న జొకోవిచ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో విజేతగా నిలిచి 23వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో అగ్రస్థానానికి దూసుకొచ్చాడు. 14 సార్లు ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్‌గా నిలిచిన రాఫెల్ నాదల్ గాయంతో బరిలోకి దిగకపోవడంతో జొకోవిచ్‌ను టైటిల్ ఫేవరెట్‌గా పరిగణించారు. తనపై అభిమానులు పెట్టుకున్న అంచనాలను అతను నిజం చేశాడు. ఆద్యంతం నిలకడగా ఆడుతూ జొకోవిచ్ మూడోసారి ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెడరర్ గత ఏడాది ఆటకు గుడ్‌బై చెప్పడం... స్పెయిన్ స్టార్ రాఫెల్ నాదల్ గాయం కారణంగా ఈ ఏడాది మరే టోర్నీలోనూ ఆడే అవకాశం లేకపోవడం... వెరసి ఈ ఏడాది మిగిలిన రెండు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లోనూ (వింబుల్డన్, యూఎస్ ఓపెన్) జొకోవిచ్ టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనున్నాడు. ఈ రెండు టోర్నీల్లోనూ జొకోవిచ్ విజేతగా నిలిస్తే టెన్నిస్ చరిత్రలో చిరకాలం రారాజుగా నిలిచిపోతాడు.



పారిస్: ఎలాంటి సంచలన ఫలితం నమోదు కాలేదు. ఊహించిన విధంగానే సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ స్థాయికి తగ్గ ప్రదర్శనతో అదరగొట్టాడు. టెన్నిస్ సీజన్‌లోని రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఫ్రెంచ్ ఓపెన్‌లో జొకోవిచ్ మూడోసారి విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో మూడో సీడ్ జొకోవిచ్ 3 గంటల 13 నిమిషాల్లో 7-6 (7/1), 6-3, 7-5తో నాలుగో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే)పై గెలుపొందాడు. విన్నర్ జొకోవిచ్‌కు 23 లక్షల యూరోలు (రూ. 20 కోట్ల 41 లక్షలు), రన్నరప్ కాస్పర్ రూడ్‌కు 11 లక్షల 50 వేల యూరోలు (రూ. 10 కోట్ల 20 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ విజయంతో జొకోవిచ్ 23వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్‌తో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన ప్లేయర్‌గా కొత్త చరిత్ర సృష్టించాడు. అంతేకాకుండా నేడు విడుదల చేసే ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకోనున్నాడు. మరోవైపు కాస్పర్ రూడ్‌కు మూడోసారీ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లో నిరాశ ఎదురైంది. గత ఏడాది రూడ్ ఫ్రెంచ్ ఓపెన్, యూఎస్ ఓపెన్‌లలో ఫైనల్ చేరి రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు.

గట్టి పోటీ లభించినా...

కెరీర్‌లో 34వ గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడుతున్న జొకోవిచ్ ఒకవైపు... కేవలం మూడో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడుతున్న కాస్పర్ రూడ్ మరోవైపు... ఈ ఇద్దరిలో ఎవరికి విజయావకాశాలు ఉంటాయని అడిగితే జొకోవిచ్‌వైపే మొగ్గు చూపుతారు. ఆదివారం అలాగే జరిగింది. ఆరంభంలో జొకోవిచ్‌కు రూడ్ గట్టిపోటీ ఇచ్చినా మ్యాచ్ కొనసాగుతున్నకొద్దీ జొకోవిచ్ జోరు పెంచాడు. తొలి సెట్ తొలి గేమ్‌లో సర్వీస్ నిలబెట్టుకున్న రూడ్... 11 నిమిషాలపాటు సుదీర్ఘంగా సాగిన రెండో గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేశాడు. ఆ తర్వాత తన సర్వీస్‌ను కాపాడుకొని 3-0తో ఆధిక్యంలోకి వచ్చాడు. దాంతో జొకోవిచ్‌కు విజయం అంత సులువుగా దక్కదనిపించింది. అయితే జొకోవిచ్ నెమ్మదిగా పుంజుకున్నాడు. రూడ్ ఆటతీరును అంచనా వేసి తన వ్యూహాలను మార్చుకున్నాడు. ఏడో గేమ్‌లో రూడ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి, ఎనిమిదో గేమ్‌లో తన సర్వీస్‌ను కాపాడుకున్న జొకోవిచ్ స్కోరును 4-4తో సమం చేశాడు. ఆ తర్వాత ఇద్దరూ తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడంతో టైబ్రేక్ అనివార్యమైంది. టైబ్రేక్‌లో జొకోవిచ్ పైచేయి సాధించి తొలి సెట్‌ను 90 నిమిషాల్లో దక్కించుకున్నాడు. రెండో సెట్‌లోని రెండో గేమ్‌లోనే రూడ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్ అదే జోరులో 3-0తో ముందంజ వేశాడు. ఆ తర్వాత ఈ ఆధిక్యం కాపాడుకొని రెండో సెట్‌ను 48 నిమిషాల్లో సొంతం చేసుకున్నాడు. మూడో సెట్‌లో ఇద్దరూ నువ్వా నేనా అన్నట్లు పోరాడారు. చివరకు 11వ గేమ్‌లో రూడ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్ 6-5తో ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత 12వ గేమ్‌లో తన సర్వీస్‌ను నిలబెట్టుకొని మూడో సెట్‌ను 55 నిమిషాల్లో నెగ్గి విజేతగా అవతరించాడు.

‘క్యాలెండర్ గ్రాండ్‌స్లామ్’పై మరోసారి గురి...

ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ కూడా సాధించిన జొకోవిచ్ ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ నెగ్గడంతో అతనికి మరోసారి ‘క్యాలెండర్ గ్రాండ్‌స్లామ్’ (ఒకే ఏడాది నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గడం) ఘనత సాధించే అవకాశం వచ్చింది. గాయం కారణంగా నాదల్ ఈ ఏడాది మరే టోర్నీలో ఆడే అవకాశం లేకపోవడంతో జొకోవిచ్ తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేస్తే ‘క్యాలెండర్ గ్రాండ్‌స్లామ్’ ఘనత అందుకునే అవకాశముంది. పురుషుల టెన్నిస్‌లో రాడ్ లేవర్ (1969లో), మహిళల టెన్నిస్‌లో స్టెఫీ గ్రాఫ్ (1988లో) మాత్రమే ‘క్యాలెండర్ గ్రాండ్‌స్లామ్’ ఘనతను సాధించారు. 2021లో జొకోవిచ్ వరుసగా ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టైటిల్స్ గెలిచినా...యూఎస్ ఓపెన్ ఫైనల్లో మెద్వెదెవ్ (రష్యా) చేతిలో ఓడిపోవడంతో జొకోవిచ్‌కు సువర్ణావకాశం చేజారింది.

“ఇదో అద్భుతం. 23 గ్రాండ్‌స్లామ్‌లు గెలవగలిగిన నేను అదృష్టవంతుడిని మాత్రమే కాదు. అంతకన్నా చాలా ఎక్కువ. ఏడేళ్ల వయసులో ఉన్నప్పుడు ఏదో రోజు వింబుల్డన్ గెలవాలని, ప్రపంచ నంబర్‌వన్ కావాలని కలగన్నా. కానీ ఈ స్థాయిలో నిలబడే అవకాశం దక్కడం ఎంతో గొప్పగా అనిపిస్తోంది. నా రాతను నేను రాసుకోగలనని నమ్మాను. ప్రతీ కుర్రాడిని నేను ఒకే విషయం చెబుతాను. మంచి భవిష్యత్తు కావాలంటే దానిని నువ్వే స్వయంగా సృష్టించుకోవాలి. -నొవాక్ జొకోవిచ్

ఫైనల్ మ్యాచ్ గణాంకాలు

జొకోవిచ్		కాస్పర్ రూడ్
11	ఏస్‌లు	4
1	డబుల్ ఫాల్ట్‌లు	1
3/10	బ్రేక్ పాయింట్లు	1/4
52	విన్నర్స్	31
32	అనవసర తప్పిదాలు	31
20/27	నెట్ పాయింట్లు	14/20
12	డ్రాప్ షాట్‌లు	18
118	మొత్తం పాయింట్లు	89

1 టెన్నిస్‌లో నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీలను కనీసం మూడుసార్లు చొప్పున గెలిచిన తొలి ప్లేయర్‌గా జొకోవిచ్ నిలిచాడు.

జొకోవిచ్ 23 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్

టోర్నీ	సంవత్సరాలు	మొత్తం
ఆస్ట్రేలియన్ ఓపెన్	2008, 2011, 2012, 2013, 2015, 2016, 2019, 2020, 2021, 2023	10
ఫ్రెంచ్ ఓపెన్	2016, 2021, 2023	3
వింబుల్డన్	2011, 2014, 2015, 2018, 2019, 2021, 2022	7
యూఎస్ ఓపెన్	2011, 2015, 2018	3

అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ వీరులు (కనీసం 10)

జొకోవిచ్	(సెర్బియా)	23
రాఫెల్ నాదల్	(స్పెయిన్)	22
ఫెడరర్	(స్విట్జర్లాండ్)	20
పీట్ సంప్రాస్	(అమెరికా)	14
రాయ్ ఎమర్సన్	(ఆస్ట్రేలియా)	12
జాన్ బోర్గ్	(స్వీడన్)	11
రాడ్ లేవర్	(ఆస్ట్రేలియా)	11
బిల్ టిల్డెన్	(అమెరికా)	10

తొలిసారి ఆసియా కప్ సొంతం

- భారత జూనియర్ మహిళల హాకీ జట్టు ఘనత
- ఫైనల్లో నాలుగుసార్లు చాంపియన్ దక్షిణ కొరియాపై విజయం

కాకామిగహారా (జపాన్): నిరీక్షణ ముగిసింది. ఎట్టకేలకు ఏడో ప్రయత్నంలో భారత జూనియర్ మహిళల హాకీ జట్టు తొలిసారి ఆసియా కప్‌ను సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ 2-1 గోల్స్ తేడాతో నాలుగుసార్లు చాంపియన్ దక్షిణ కొరియాను బోల్తా కొట్టించింది. భారత్ తరఫున అన్ను (22వ ని.లో), నీలమ్ (41వ ని.లో) ఒక్కో గోల్ సాధించగా... కొరియా జట్టుకు పార్క్ సియో యోన్ (25వ ని.లో) ఏకైక గోల్‌ను అందించింది. ‘ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్’ ప్రీతి కెప్టెన్సీలోని భారత జట్టు ఈ టోర్నీలో అజేయంగా నిలిచింది. లీగ్ దశలో మూడు మ్యాచ్‌ల్లో గెలిచి, ఒక మ్యాచ్‌ను ‘డ్రా’ చేసుకున్న టీమిండియా సెమీఫైనల్లో, ఫైనల్లో పటిష్టమైన జపాన్, కొరియా జట్లను ఓడించింది.




హాకీ ఇండియా నజరానా...

తొలిసారి ఆసియా కప్ టైటిల్ నెగ్గిన భారత జట్టుకు హాకీ ఇండియా (హెచ్ఐ) నజరానా ప్రకటించింది. జట్టులోని ప్రతి సభ్యురాలికి రూ. 2 లక్షలు చొప్పున... సహాయక సిబ్బందికి రూ. 1 లక్ష చొప్పున నగదు ప్రోత్సాహకం అందజేస్తామని తెలిపింది.

సిక్కి రెడ్డి జోడీకి టైటిల్



సాక్షి, హైదరాబాద్: డెన్మార్క్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తెలంగాణ క్రీడాకారిణి సిక్కి రెడ్డి మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో విజేతగా నిలిచింది. డెన్మార్క్‌లోని హిలెరాడ్ పట్టణంలో ఆదివారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో టాప్ సీడ్ సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ (భారత్) జోడీ 21-16, 21-17తో మాడ్స్ వెస్టర్‌గార్డ్-క్రిస్టిన్ బుష్ (డెన్మార్క్) ద్వయంపై విజయం సాధించింది. 42 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో కీలకదశలో సిక్కి-రోహన్ పాయింట్లు నెగ్గి పైచేయి సాధించారు. ఈ ఏడాది సిక్కి-రోహన్ జోడీకిదే తొలి మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్. విజేతగా నిలిచిన సిక్కి-రోహన్ జోడీకి 2,250 డాలర్ల ప్రైజ్‌మనీతోపాటు 4000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.


'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 81

సోమవారం 12-6-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అప్పగించేశారు

డబ్ల్యూటీసీ ఫైనల్లో భారత్ ఓటమి.. టెస్టుల్లో చాంపియన్‌గా ఆసీస్ - స్పోర్ట్స్‌లో



వృద్ధాప్యంలో ఆదాయం

రిటైర్మెంట్ ఫండ్ కోసం మెరుగైన పెట్టుబడుల ప్రణాళికలపై కథనం - 11లో



మిగతా రాష్ట్రాలకూ అదే గతి

పాలనా సర్వీసులను నియంత్రిస్తూ కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌ను వ్యతిరేకించాలని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కోరారు.

వివరాలు 6లో ▸



ప్రజా విశ్వాసమే నా ఆస్తి

ప్రజలకు న్యాయం చేకూర్చాలన్నదే తన ధ్యేయమని, అందుకు పోరాటం చేస్తానని కాంగ్రెస్ అసంతృప్త నేత సచిన్ పైలట్ అన్నారు.

వివరాలు 6లో ▸



అతి తీవ్ర తుపానుగా బిపర్‌జోయ్

అరేబియా సముద్రంలో ఏర్పడిన 'బిపర్‌జోయ్'.. అతి తీవ్ర తుపానుగా బలపడిందని భారత వాతావరణ శాఖ తెలిపింది.

వివరాలు 6లో ▸



క్యూబాలో చైనా గూఢచారులు

చైనా తమ పొరుగు దేశం క్యూబాలో 2019 నుంచి గూఢచార స్థావరాన్ని నడుపుతోందని అమెరికా ఆరోపించింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

బాబు నిర్వాకంతో రూ.2,020 కోట్లు నష్టం



పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యానికి, భారీ నష్టానికి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబే కారణమని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. కమీషన్ల దాహంతో పాటు అవగాహన రాహిత్యంతో ప్రాజెక్టును సర్వనాశనం చేశారన్నారు.

వివరాలు 3లో ▸

రూ.లక్ష కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ హబ్



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఏపీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ పనులను ఎన్‌టీపీసీ ప్రారంభించింది. సుమారు రూ.లక్ష కోట్లతో అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు తొలి విడత పనులను 2026 కల్లా పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టింది.

వివరాలు 3లో ▸

నేనే రాజు.. నేనే రారాజు



సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో మూడోసారి విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో జొకోవిచ్ కాస్పర్ రూడ్ (నార్వే)పై గెలుపొందాడు. అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్(23) నెగ్గిన ప్లేయర్‌గా కొత్త చరిత్ర సృష్టించాడు.

వివరాలు స్పోర్ట్స్‌లో ▸

ఇదండీ సంగతి



వాళ్లకు లాభాలు రావాలంటే మళ్లీ పెట్రోల్ ధరలు పెంచాలిగా సార్!!

గోల్డెన్ చాన్స్!

సర్కారు బడి పిల్లలకు గ్లోబల్ చదువులు

భవిష్యత్ టెక్నాలజీ చదువులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- దేశంలోనే తొలిసారిగా ఉన్నత స్థాయి వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు
- సభ్యులుగా ఉన్నతాధికారులు, మైక్రోసాఫ్ట్, అమెజాన్, గూగుల్, ఇంటెల్, నాస్కాం ప్రతినిధులు
- వీరందరి సూచనలతో హై ఎండ్ టెక్నాలజీలో అత్యున్నత ఉద్యోగాలే లక్ష్యంగా అడుగులు
- ఏఐ, ఏఆర్, వీఆర్, చాట్ జీపీటీ, వెబ్ 3.0 తదితర వాటిపై ఇప్పటి నుంచే అవగాహన
- భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానంలో సుశిక్షితులుగా తీర్చిదిద్దేలా చర్యలు
- నైపుణ్యాలను పెంచేందుకు పక్కా ప్రణాళిక
- జూలై 15 నాటికి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్న వర్కింగ్ గ్రూప్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విద్యా రంగంలో ఇప్పటికే పలు విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను గ్లోబల్ సిటిజన్స్‌గా తీరిదిద్దేందుకు తాజాగా మరిన్ని చర్యలు చేపట్టింది. ప్రపంచ స్థాయి పోటీని తట్టుకునేలా, మారుతున్న టెక్నాలజీ రంగంలో విద్యార్థులను సుశిక్షితులుగా తీర్చిదిద్దేలా మరో అడుగు ముందుకేసింది. భవిష్యత్ టెక్నాలజీ రంగానికి అవసరమయ్యే నైపుణ్యాలతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సుశిక్షితులుగా తీర్చిదిద్దనుంది. వారికి హైఎండ్ టెక్నాలజీ రంగంలో

మిగతా 2వ పేజీలో ▶

నేడు 'జగనన్న విద్యా కానుక'

43,10,165 మంది విద్యార్థులకు రూ.1,042.53 కోట్లతో కిట్లు పంపిణీ

17 వరకు ఒంటిపూట బడులు


నేటి నుంచి స్కూళ్లు పునఃప్రారంభం

2లో

20 ఎంపీ సీట్లు ఏపీలో గెలవాలి

విశాఖ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

- రాష్ట్రంలో అవినీతి పాలన సాగుతోంది
- రాష్ట్రానికి కేంద్రం ఎంతగానో సహకారం.. భారీగా నిధులు, కేంద్ర సంస్థలను ఇచ్చాం
- కేంద్రంలో అవినీతికి తావులేని పాలన
- అందుకే ఆంధ్ర ప్రజల ఆశీర్వాదం కోరుతున్నాం
- వచ్చే ఎన్నికల్లో బీజేపీకి 300 లోక్‌సభ స్థానాలు ఖాయం



సాక్షి, విశాఖపట్నం: వచ్చే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో 20 ఎంపీ స్థానాలు గెలవాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. రాష్ట్రానికి కేంద్రం సహకరిస్తున్నందునే అభివృద్ధి సాధ్యమైందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి.. వారి ఆశీర్వాదం కోరాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నాలుగేళ్లుగా అవినీతి ప్రభుత్వం నడుస్తోందని మండిపడ్డారు. ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా బీజేపీ ఆదివారం సాయంత్రం విశాఖలో మహాజన సంపర్క్ అభియాన్ సభ నిర్వహించింది. విశాఖ రైల్వే గ్రౌండ్స్‌లో జరిగిన ఈ సభకు అమిత్‌షా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వైఎస్ జగన్ పాలనపై విమర్శలు, ఆరోపణలు గుప్పించారు. ఈ నాలుగేళ్లలో జగన్ ప్రభుత్వం అవినీతి ఆరోపణలను, కుంభకోణాలను ఎదుర్కొంటోందన్నారు. రైతుల ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉందన్నారు. ప్రధాని మోదీ ఇచ్చే సొమ్ముతో సీఎం జగన్ రైతు భరోసా పేరిట రైతులను మభ్య పెడుతున్నారని ఆరోపించారు. పేదలకు కేంద్రం ఇచ్చే బియ్యం పథకంపై వైఎస్ జగన్ ఫొటో వేసుకుంటున్నారన్నారు. విశాఖపట్నం సమాజ విరోధ శక్తులకు అడ్డాగా మారిందని..

మిగతా 3వ పేజీలో ▶



పలాసలో సిద్ధమవుతున్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్

ఉద్దానం చెంతకు ఆధునిక వైద్యం

రూ.60 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

- తుది దశకు చేరిన పనులు.. అధునాతన పరికరాలు సమకూర్పు
- వైద్య సేవలతో పాటు కిడ్నీ వ్యాధులపై పరిశోధన
- నెఫ్రాలజీ, యూరాలజీ తదితర 41 మంది వైద్య నిపుణుల నియామకం
- వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు

సాక్షి, అమరావతి: శ్రీకాకుళం జిల్లా మందస మండలం లింబుగం గ్రామస్తుడైన తెవ్వయ్య ఐదేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. డయాలసిస్ చేయించుకుంటున్నాడు. టీడీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకాకుళం జిల్లాలోని ఏ ప్రభుత్వ ఆస్పత్రిలోనూ కిడ్నీ వ్యాధులకు సరైన చికిత్స అందుబాటులో ఉండేది కాదు. దీంతో చికిత్స కోసం విశాఖకు వెళ్లేవాడు. సహాయకునితో కలిసి ఒక్కసారి విశాఖకు వెళ్లి రావాలంటే రవాణా, ఇతర ఖర్చుల రూపంలో రూ.వేలల్లో ఖర్చు అయ్యేది. చాలీచాలని పింఛన్, భార్య కూలిపనులకు వెళితే వచ్చే డబ్బుతో మందుల కొనుగోలు.. వెరసి వైద్యం చేయించుకోవడం తలకు మించిన భారంగా మారింది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక లింబుగంకు మూడు కి.మీ దూరంలోని హరిపురం సీహెచ్‌సీలో

మిగతా 5వ పేజీలో ▶

రాయలసీమను తాకిన రుతుపవనాలు

- రెండు రోజుల్లో 'సీమ' అంతటా విస్తరించే అవకాశం
- రాష్ట్రమంతా విస్తరించేందుకు మరో వారం
- అప్పటి వరకు ఎండల తీవ్రత తప్పదు



సాక్షి, అమరావతి/తిరుమల: నైరుతి రుతు పవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. ఆదివారం రాయలసీమలోని పలు ప్రాంతాలను రుతుపవనాలు తాకాయి. రుతు పవనాలు కేరళను తాకిన తర్వాత ఏపీకి రావడానికి సాధారణంగా నాలుగు రోజుల సమయం పడుతుంది. ఈ నెల 8వ తేదీన అవి కేరళలో ప్రవేశించగా.. 12వ తేదీ నాటికి ఏపీకి వస్తాయని భావించారు. కానీ.. బిపర్‌జోయ్ తుపాను కారణంగా

మిగతా 2వ పేజీలో ▶



ఇక రామాయపట్నం ఎయిర్‌పోర్టుపై దృష్టి

- శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తెట్టు వద్ద 2,064.44 ఎకరాల్లో నిర్మాణం
- పూర్తికావచ్చిన భూసర్వే.. అటవీశాఖ ఆమోదం రాగానే పీపీపీ విధానంలో నిర్మాణానికి టెండర్లు
- ఏపీఏడీసీఎల్ ఎండీ భరత్‌రెడ్డి వెల్లడి

12లో

• తెలంగాణలో దారుణం



శిరీష (ఫైల్)

కళ్లల్లో పొడిచి.. కత్తితో కోసి

- నర్సింగ్ విద్యార్థిని దారుణ హత్య
- గ్రామ సమీపంలోని నీటికుంటలో మృతదేహం లభ్యం
- వికారాబాద్ జిల్లా కాళ్లాపూర్‌లో ఘటన

12లో

ల్యాండ్ స్కామ్ అంటే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణే

ఆ స్టీల్‌ప్లాంట్‌కు క్యాప్టివ్ మైన్స్ ఎందుకు కేటాయించరు?

- పచ్చపువ్వుల తప్పుడు మాటలు విని.. వాటినే చెప్పడం మర్యాద కాదు
- లంచాలకు తావులేకుండా పేదల ఖాతాల్లో రూ.2.16 లక్షల కోట్లు జమచేసిన సీఎం జగన్
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇందులో సగమైనా ఇచ్చారా?
- అమరావతి భూకుంభకోణంపై విచారణ జరిపిస్తామని చెప్పి ఇప్పుడెందుకు మాట మార్చారు?
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాపై మాజీ మంత్రి పేర్ని నాని ఫైర్



సాక్షి, అమరావతి: 'విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వెనుక ల్యాండ్ స్కామ్ ఉందన్నది ప్రజల అనుమానం. లేకపోతే దానికి క్యాప్టివ్ మైన్స్ ఎందుకు ఇవ్వరు. కావల్సిన వారికి కట్టబెట్టడానికేనా ప్రైవేటీకరణ'.. అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను మాజీమంత్రి, మచిలీపట్నం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పేర్ని నాని సూటిగా ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఏ ప్రైవేటు వ్యక్తికీ భూములు కేటాయించకపోయినా కుంభకోణం జరిగిందని

మిగతా 3వ పేజీలో ▶

నేడు 'జగనన్న విద్యా కానుక'


విద్యార్థులకు అందజేసేందుకు సిద్ధంగా ఉన్న జగనన్న విద్యా కానుక



సాక్షి, అమరావతి: విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తూ చదువుల భారమంతా తన భుజాలకెత్తుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వరుసగా నాలుగో ఏడాదీ జగనన్న విద్యాకానుకను అందిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి చదివే 43,10,165 మంది విద్యార్థులకు రూ. 1,042.53 కోట్ల ఖర్చుతో విద్యాకానుక కిట్ల పంపిణీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరులో లాంఛనంగా ప్రారంభించనున్నారు.

బడికెళ్లడం ఇక వేడుక

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి ఉచితంగా బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, కుట్టు కూలితో సహా మూడు జతల యూనిఫామ్ క్లాత్, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూలు బ్యాగుతోపాటు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ (6–10 తరగతి పిల్లలకు), పిక్టోరియల్ డిక్షనరీ (1–5 తరగతి పిల్లలకు)తో కూడిన జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీని బడులు తెరిచిన తొలిరోజే చేపట్టనున్నారు. జగనన్న విద్యాకానుక కిట్‌కు క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో సహా నాలుగు దశల్లో నాణ్యతా పరీక్షలు చేపట్టారు. ప్రతి విద్యార్థికీ దాదాపు రూ.2,400 విలువైన విద్యాకానుక కిట్లను ప్రభుత్వం అందచేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో స్కూళ్లు తెరిచి 6,7 నెలలైనప్పటికీ యూనిఫామ్ సంగతి దేవుడెరుగు కనీసం పాఠ్యపుస్తకాలు కూడా అందించలేని దుస్థితి నెలకొన్న విషయం తెలిసిందే. ఇక ఇతర వస్తువుల ఊసే లేదు. ఆ పరిస్థితిని సమూలంగా మారుస్తూ జగనన్న ప్రభుత్వం పాఠశాలలు తెరిచిన రోజే 10 వస్తువులతో కూడిన జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందచేస్తోంది. ఇక విద్యార్థుల చదువులను గాలికొదిలేస్తూ గత సర్కారు పెండింగ్‌లో పెట్టిన రూ.1,778 కోట్ల ఫీజు రీయింబర్స్ బకాయిలను సైతం సీఎం జగన్ ప్రభుత్వమే చెల్లించింది.

విద్యారంగ సంస్కరణలకు నాలుగేళ్లలో రూ.60,329.42 కోట్లు		
	జగనన్న అమ్మఒడి లబ్ధిదారులు 44,48,865	అందించిన మొత్తం రూ. 19,674.34 కోట్లు
	విద్యాకానుక లబ్ధిదారులు 47,40,421	అందించిన మొత్తం రూ. 3,366.53 కోట్లు
	గోరుముద్ద లబ్ధిదారులు 43,26,782	అందించిన మొత్తం రూ.3,590.00 కోట్లు

మొత్తం 45,975 స్కూళ్లలో 3 దశల్లో రూ.17,805 కోట్లతో అభివృద్ధి పనులు		
	నాడు నేడు మొదటి దశ స్కూల్స్ 15,715	ఎంత వ్యయం? రూ 3,669.00 కోట్లు
	నాడు నేడు రెండో దశ స్కూల్స్ 22,344	ఎంత వ్యయం? రూ. 8,000.00 కోట్లు

వైఎస్సార్ సంపూర్ణ పోషణ లబ్ధిదారులు: 35,70,675	అందించిన మొత్తం: రూ. 6,141.34 కోట్లు
స్వేచ్ఛ (శానిటరీ న్యాప్కిన్స్) పంపిణీ : 10,01,860	ఎంత వ్యయం?: రూ. 32.00 కోట్లు
8వ తరగతి విద్యార్థులు, టీచర్లకు ట్యాబ్‌లు: 5,18,740	అందించిన మొత్తం: రూ. 685.87 కోట్లు
విద్యా దీవెన లబ్ధిదారులు : 26,98,728	అందించిన మొత్తం: రూ.10,636.67 కోట్లు
వసతిదీవెన లబ్ధిదారులు : 25,17,245	అందించిన మొత్తం: రూ. 4,275.76 కోట్లు
విదేశీ విద్యాదీవెన లబ్ధిదారులు : 1,858	అందించిన మొత్తం: రూ. 132.41 కోట్లు
వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా లబ్ధిదారులు : 16,668	అందించిన మొత్తం: రూ.125.50 కోట్లు

గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దేలా

కార్పొరేట్ స్కూళ్లే ప్రభుత్వ పాఠశాలలతో పోటీ పడేలా, విద్యార్థులను గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రానున్న రోజుల్లో ప్రతి స్కూల్‌లో ఇంగ్లిష్ మీడియంతో సీబీఎస్ఈ సిలబస్‌లో బోధించేలా సిద్ధమైంది. 'మనబడి నాడు నేడు' తొలిదశ స్కూళ్లలో 6–10వ తరగతి వరకు 30 వేలకు తరగతి గదుల్లో బైజూస్ కంటెంట్‌తో కూడిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా సులభంగా అర్థమయ్యేలా డిజిటల్ బోధన చేపట్టనున్నారు. ఇంగ్లిష్ లాబ్స్‌తోపాటు 1–5వ తరగతి వరకు ప్రతి స్కూల్‌లో 10 వేల స్మార్ట్ టీవీల ఏర్పాటు దిశగా సన్నద్ధమైంది.

తొలిదశ స్కూళ్లలో జూలై 12 నాటికి ఐఎఫ్‌పీలు

మనబడి నాడు నేడు తొలిదశ పనులు పూర్తైన 15,715 స్కూళ్లలో ఈ ఏడాది జులై 12 నాటికి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ) ఏర్పాటు పూర్తి కానుంది. రెండో దశలో భాగంగా 22,344 స్కూళ్లలో ఈ ఏడాది డిసెంబర్ 21 నాటికి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ఏర్పాటవుతాయి. మిగిలిన 15 వేల స్కూళ్లలో మూడో దశలో ఐఎఫ్‌పీలు అందుబాటులోకి వస్తాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యార్థులకు కూడా బైజూస్ కంటెంట్ అందించనున్నారు. బీఎస్ఎన్ఎల్, ఏపీ ఫైబర్ నెట్ ద్వారా 45,000 పాఠశాలల్లో ఇంటర్ నెట్ సదుపాయం సమకూరనుంది. ఇక ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లిష్‌లో నైపుణ్యం సాధించేలా టోఫెల్ ప్రైమరీ, టోఫెల్ జూనియర్ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈమేరకు ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్)తో ఒప్పందం కుదుర్చుకోనున్నారు.

30 వరకు పాత యూనిఫామ్స్‌కు ఓకే

2023–24 విద్యా సంవత్సరం సోమవారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో మొదటిరోజే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసినట్లు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కిట్‌లో స్కూలు పుస్తకాల బ్యాగ్‌తో పాటు మూడు జతల యూనిఫామ్ క్లాత్, బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, డిక్షనరీ ఉంటాయన్నారు. ఈ ఏడాది కొత్త డిజైన్‌లో యూనిఫామ్ క్లాత్ అందిస్తున్నామని, విద్యార్థులు వాటిని కుట్టించుకునే వరకు గతేడాది యూనిఫామ్ ధరించి పాఠశాలలకు హాజరు కావచ్చన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు ఈ అవకాశం ఉంటుందని, ఆలోగా కొత్త యూనిఫామ్ కుట్టించుకోవాలని సూచించారు.

ఫిర్యాదులకు 14417 టోల్‌ఫ్రీ నెంబర్

జగనన్న విద్యా కానుక ద్వారా అందచేసిన వస్తువుల్లో ఏవైనా లోపాలుంటే విద్యార్థులు తమ స్కూల్ ప్రధానోపాధ్యాయుడికి అందచేస్తే వారం రోజుల్లో రీప్లేస్ చేస్తారు. మరే ఇతర ఫిర్యాదులున్నా 14417 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చు.

క్లుప్తంగా...

రేపటి నుంచి 'యూజీసీ నెట్-2023'

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా 13 నుంచి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఫేజ్-1 'జాతీయ అర్హత పరీక్ష (యూజీసీ నెట్) జరగనుంది. ఇప్పటికే అభ్యర్థులకు జాతీయ పరీక్ష నిర్వహణ సంస్థ (ఎన్‌టీఏ) అడ్మిట్ కార్డులను జారీ చేసింది. దేశంలో 541 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా..ఏపీలో 20 సెంటర్‌లు ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే పరీక్ష కేంద్రాలు రెట్టింపయ్యాయి. తొలి దశలో ఎన్‌టీఏ ఈ నెల 13–17వరకు, రెండో దశలో 19–22 వరకు రోజుకు 2 షిఫ్టుల్లో పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించింది. త్వరలో రెండో దశ అడ్మిట్ కార్డులనూ అందుబాటులోకి తేనుంది. అభ్యర్థులు అడ్మిట్ కార్డు (సిటీ ఇంటిమేషన్ స్లిప్)ను డౌన్‌లోడ్, సమాచార, వ్యక్తిగత వివరాల్లో లోపాలుంటే 011-40759000, ugcnet@nta.ac.in మెయిల్ చేయవచ్చు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో ఆన్‌లైన్‌లో షిఫ్ట్ 1 ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, షిఫ్ట్ 2 మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష ఉంటుంది. యూజీసీ నెట్‌ను అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీల్లో ప్రతి ఏటా రెండు సార్లు (జూన్, డిసెంబర్‌లో) నిర్వహిస్తోంది.

అమ్మకానికి విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆస్తులు



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై దూకుడుగా ఉన్న కేంద్రం మరో అడుగు ముందుకు వేసింది. కార్మికుల ఆందోళనను బేఖాతరు చేస్తూ ప్లాంట్ ఆస్తుల అమ్మకాల ప్రక్రియ ప్రారంభించింది. స్టీల్‌ప్లాంట్‌కు సమీప, విశాఖ నగరంలో ఉన్న ఆస్తులను అమ్మడానికి ప్రకటన చేసి పలు సంస్థలను ఆహ్వానిస్తూ లేఖలు రాసింది. నగరంలోని హెచ్‌బీ కాలనీ (మద్దిలపాలెం)లో ఉక్కు ఉద్యోగుల నివాసం కోసం ఉపయోగించిన 22.90 ఎకరాల్లో ఉన్న 588 ఫ్లాట్లను, గాజువాకలోని ఆటోనగర్‌లో ఉన్న రెండెకరాల విస్తీర్ణంలోని 76 ఇళ్లను విక్రయానికి పెట్టింది. దీనికి తోడు 434.75 చ.అ విస్తీర్ణంతో ఉన్న పెదగంట్యాడలోని పాత ఆరోగ్య కేంద్రాన్ని అమ్మనున్నట్లు ప్రకటించింది. మొత్తం కొనుగోలు చేసేవారు కాని, అందులో భాగాల వారీగా కొనుగోలు చేసేవారు గాని 10 రోజుల్లో తమను సంప్రదించాలంది.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో ఆదివారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	45.5	29.0
విశాఖపట్నం	43.6	27.8
రెంటచింతల	42.8	30.2
గుంటూరు	42.0	30.0
ఏలూరు	42.0	29.0
శ్రీకాకుళం	42.0	28.0
విజయవాడ	41.0	31.0
విజయనగరం	40.0	30.0
తిరుపతి	40.0	28.0
కడప	39.8	25.5
కర్నూలు	37.4	26.3

గ్లోబల్ చదువులు

▶ మొదటి పేజీ తరువాయి

ఉన్నతోద్యోగాల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఇందుకోసం ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు, గ్లోబల్ టెక్ కంపెనీల ప్రతినిధులతో ఉన్నత స్థాయి వర్కింగ్ గ్రూపును ఏర్పాటు చేసింది. పాఠ్య ప్రణాళిక, ఉండాల్సిన మానవ వనరులు, సదుపాయాలపై ఈ వర్కింగ్ గ్రూప్ నివేదిక ఇవ్వనుంది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విద్యా రంగంలో అనేక విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అమ్మ ఒడి, విద్యా కానుక, వసతి దీవెన, విద్యాదీవెన వంటి పథకాలతోపాటు పాఠ్య ప్రణాళిక, మౌలిక సదుపాయాల పరంగా ఎన్నో మార్పులు తీసుకువచ్చారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లోని సుమారు 41 లక్షల మంది విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం చదువులు అందుతున్నాయి.

తెలుగు- ఇంగ్లిష్‌లో టెక్స్ట్‌బుక్స్

విప్లవాత్మక నిర్ణయాలకు అనుగుణంగా, విద్యార్థులకు చక్కగా అర్థమయ్యేలా 2020–21 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం మరొక కీలక నిర్ణయం తీసుకుంది. జగనన్న విద్యాకానుక కింద సైన్స్, సోషల్ స్టడీస్, మాథమెటిక్స్ సబ్జెక్టుల్లో బైలింగ్వల్ (ఒక పేజీలో ఇంగ్లిష్, మరో పేజీలో తెలుగు) టెక్స్ట్ బుక్స్‌ను రూపొందించి విద్యార్థులకు అందించింది. ఇంగ్లిష్‌లో భాషా పరిజ్ఞానాన్ని పెంచుకునేందుకు ఇంగ్లిష్ ల్యాబ్స్ కూడా ఏర్పాటు చేసింది. 2021–2 ఆరో తరగతి నుంచి 10వ తరగతి దాకా ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీని, మూడో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ పిక్టోరియల్ డిక్షనరీని అందించింది.



సబ్జెక్ట్ టీచర్.. డిజిటల్ బోధన

బోధనలో మరో కీలక మార్పు సబ్జెక్టు టీచర్ కాన్సెప్ట్. విద్యార్థులకు మూడో తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్ల కాన్సెప్ట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. జాతీయ.. ప్రపంచ స్థాయి విద్యార్థులతో పోటీపడేలా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సీబీఎస్ఈ గుర్తింపు వచ్చేలా 2022–23లో చర్యలు చేపట్టింది. విద్యార్థులకు సైన్స్, సోషల్, మాథమెటిక్స్‌లో అత్యుత్తమ పాఠ్యాంశాలను అందించడానికి బైజూస్‌తో ఒప్పందం చేసుకుంది. విద్యార్థులకు సులువుగా పాఠ్యాంశాలు అర్థమయ్యేందుకు ఆడియో, విజువల్ రూపంలో బైజూస్ కంటెంట్‌ను అందించింది. ఇందుకోసం 5,18,740 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ఉచితంగా అందించింది. వీటితోపాటు డిజిటలైజేషన్ ప్రక్రియను విస్తృతంగా, వేగవంతంగా చేపట్టింది. నాడు–నేడు పూర్తి చేసుకున్న 30,213 హైస్కూల్ తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్ (ఐఎఫ్‌పీ)ను ఏర్పాటు చేస్తోంది. ఈ విద్యా సంవత్సరం జూలై కల్లా వీటిని ఏర్పాటు చేయనున్నారు. మరో 10,038 ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేస్తోంది. మిగిలిన పాఠశాలల్లో వచ్చే డిసెంబర్ నాటికి ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేయనుంది. దీంతోపాటు ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీస్ (ఈటీఎస్) భాగస్వామ్యంతో ప్రభుత్వ స్కూలు పిల్లలకు టోఫెల్ పరీక్షలను కూడా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

టెక్నాలజీపై సూచనలు ఇచ్చేందుకు వర్కింగ్ గ్రూప్

ప్రపంచ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీ పడాలంటే ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం అవసరం. ప్రపంచ స్థాయి కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంగ్లిష్ పరిజ్ఞానం తప్పనిసరి. దీన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ టెక్నాలజీలపై పిల్లలను సుశిక్షితులుగా తయారు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధపెట్టింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం), ఎల్ఎల్ఎం ఫ్లాట్‌ఫాం మీదకు వచ్చే డేటా అనలిటిక్స్ చాట్ జీపీటీ, వెబ్ 3.0, అగ్‌మెంటెడ్ రియాల్టీ (ఏఆర్), వర్చువల్ రియాల్టీ (వీఆర్), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ, అటానమస్ వెహికల్స్, త్రీడీ ప్రింటింగ్, గేమింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు నైపుణ్యం ఇచ్చే అంశాలపై చేపట్టాల్సిన చర్యలు, మార్పులను సూచించేందుకు వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుకు సీఎం ఆదేశాలిచ్చారు. విద్యాభ్యాసం తొలినాళ్ల నుంచే ఈ తరహా టెక్నాలజీపై బోధన, సంబంధిత నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక పాఠ్యాంశాలు, పాఠ్య ప్రణాళిక, ఇవ్వాల్సిన శిక్షణ, మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, లెర్నింగ్ కంటెంట్, ల్యాబ్‌లు తదితర అంశాలు పాఠశాలల్లో ఎలా ఉండాలన్న దానిపై ఈ వర్కింగ్ గ్రూప్ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది.

వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు ఇలా..

పాఠశాల విద్యా శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఈ వర్కింగ్ గ్రూప్‌నకు చైర్మన్‌గా, పాఠశాలల మౌలిక సదుపాయాల కమిషనర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ ఐటీ కార్యదర్శి, స్కూలు ఎడ్యుకేషన్ కమిషనర్, సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ సభ్యులుగా ఉంటారు. మైక్రోసాఫ్ట్ ఇండియా నుంచి అశుతోష్ చద్దా, అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఇండియా నుంచి షాలినీ కపూర్, గూగుల్ సంస్థ ప్రతినిధి, ఇంటెల్ ఏసియా నుంచి శ్వేత ఖురానా, నాస్కాం ప్రతినిధి, సెంటర్ ఫర్ డిజిటల్ ఎకానమీ పాలసీ రీసెర్చ్ అధ్యక్షుడు జైజిత్ భట్టాచార్య, నీతి ఆయోగ్ డిజిటల్ కమ్యూనికేషన్స్ మాజీ సలహాదారు అర్చన జి.గులాటి వర్కింగ్ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ జూలై 15 నాటికల్లా ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. ఈ మేరకు ప్రభుత్వం ఆదివారం ఆదేశాలు జారీ చేసింది.

రాయలసీమను తాకిన రుతుపవనాలు

▶ మొదటి పేజీ తరువాయి

అవి చురుగ్గా కదలడంతో ఒకరోజు ముందుగానే ఏపీని తాకాయి. ఆదివారం తిరుపతి జిల్లా శ్రీహరికోట మీదుగా ఏపీలోకి ప్రవేశించాయి. వచ్చే 48 గంటల్లో అవి రాయలసీమలోని మిగిలిన ప్రాంతాలు, కోస్తాలోని పలు ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉంది. వారం రోజుల్లో మొత్తం రాష్ట్రమంతా విస్తరిస్తాయని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. రుతు పవనాల వల్ల ఈసారి సాధారణ వర్షపాతం నమోదవుతుందని ఇప్పటికే వాతావరణ శాఖ ప్రకటించింది.

మరో వారం ఎండల తీవ్రతే

రుతు పవనాలు రాష్ట్రమంతా విస్తరించే వరకు ఉష్ణోగ్రతలు కొనసాగనున్నాయి. అంటే మరో వారం రోజులపాటు పలు ప్రాంతాల్లో ఎండల తీవ్రత, వడగాడ్పులు ఉండనున్నాయి. సోమవారం 134 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 220 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఇదిలావుండగా ఆదివారం అనకాపల్లి జిల్లా అనకాపల్లి, కాకినాడ జిల్లా కరప, విజయనగరం జిల్లా జామిలో 44.8 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. విశాఖ జిల్లా పద్మనాభంలో 44.7, మన్యం జిల్లా భామిని, కోనసీమ జిల్లా శివలలో 44.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే 86 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 110 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. మరోవైపు పలుచోట్ల వర్షాలు కూడా కురుస్తున్నాయి.

మబ్బుల 'సన్'దడి

తిరుమలలో ఆదివారం ఉదయం నుంచే నీలాకాశం మబ్బులతో నిండిపోయింది. వెండి మబ్బులు దోబూచులాడుతూ భానుడితో ఆటలాడడం ప్రారంభించాయి. సాయంత్రానికి మరిన్ని మబ్బులు చేరి సందడి చేశాయి. దాదాపు రెండు నెలలపాటు ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు కాస్త ఉపశమనం కలిగినట్టయ్యింది.



26 నుంచి కుష్టువ్యాధి సర్వే

సాక్షి, అమరావతి: ఏపీలో కుష్టువ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా వైద్య, ఆరోగ్యశాఖ పక్కా ప్రణాళికతో చర్యలు చేపడుతోంది. ఇప్పటికే ప్రభుత్వ చర్యల ఫలితంగా కొన్నేళ్లుగా రాష్ట్రంలో కొత్తగా వ్యాధి బారినపడుతున్న వారి సంఖ్య తగ్గుతూ వస్తోంది. వ్యాధి వ్యాప్తి రేటు 2018–19లో ప్రతి 10 వేలమందిలో 0.66 ఉండగా గత ఏడాది 0.53కు తగ్గింది. ఈ రేటును ఇంకా తగ్గించడానికి చర్యలు చేపడుతున్నారు. రాష్ట్రంలో కొత్త కేసులను గుర్తించేందుకు వైద్యశాఖ ఇంటింటి సర్వేకు సిద్ధమైంది. ఈ నెల 26 నుంచి తొలిదశ లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ) 2023–24 ను ప్రారంభించనున్నారు. వైద్యబృందాలు రాష్ట్రంలోని ఇంటింటికి వెళ్లి 5.31 కోట్ల జనాభాను స్క్రీన్ చేయనున్నాయి. ఇంటింటి సర్వేలో భాగంగా జిల్లాస్థాయిల్లో సూక్ష్మ ప్రణాళికలు రచించనున్నారు. ఆశా, ఏఎన్ఎంలు, సచివాలయాల్లో పనిచేసే పురుష వలంటీర్‌లను సర్వేలో భాగస్వామ్యం చేయడానికి శిక్షణ ఇవ్వనున్నారు. వీరు గుర్తించిన అనుమానిత లక్షణాలున్న కేసులను వైద్యాధికారులు పరీక్షించి వ్యాధిని నిర్ధారించనున్నారు. కొత్త కేసుల్ని గుర్తించేందుకు 2022–23లో ఇంటింటి సర్వే నిర్వహించి 1,231 మందికి వ్యాధిని నిర్ధారించారు. వీరికి ప్రభుత్వం ఉచిత చికిత్స అందిస్తోంది.

పాఠశాలస్థాయిలో నేటి నుంచి జగనన్న ఆణిముత్యాలకు అవార్డులు

- టెన్త్ పరీక్షల్లో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన విద్యార్థులకు అవార్డులు
- రాష్ట్రంలో 6,570 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 19 వరకు పంపిణీ
- రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి వంతున నగదు బహుమతి
- సర్టిఫికెట్, మెడల్‌తో సత్కారం.. తరువాత టెన్త్, ఇంటర్ సెకండియర్‌లో టాపర్స్‌కు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి సత్కారాలు

సాక్షి, అమరావతి: ఈ ఏడాది జరిగిన పదోతరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి మొదటి మూడుస్థానాల్లో నిలిచిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం కింద సన్మానించి నగదు బహుమతులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని 6,570 ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు. ఒక్కో పాఠశాలలో ముగ్గురు వంతున మొత్తం 19,710 మంది విద్యార్థులను సత్కరించనున్నారు. తొలి 3 స్థానాల్లో నిలిచినవారికి వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి నగదు బహుమతిస్తారు. ముగ్గురిని సర్టిఫికెట్, మెడల్‌తో సత్కరిస్తారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం కింద 2023లో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను నియోజకవర్గస్థాయిలో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఈ నెల 15న, జిల్లాస్థాయిలో జిల్లా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో ఈ నెల 17న, రాష్ట్రస్థాయిలో ఈ నెల 20న సీఎం జగన్ సత్కరించనున్నారు.

17 వరకు ఒంటిపూట బడులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో సోమవారం (నేటి) నుంచి ఈనెల 17 వరకు ఒక్కపూట మాత్రమే పాఠశాలలు పనిచేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ.. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రకటించారు. రానున్న నాలుగైదు రోజుల్లో ఎండలు తీవ్రంగా ఉంటాయన్న సూచనల మేరకు ఒంటి పూట బడులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ నిబంధనలు పాటించాలన్నారు. అన్ని పాఠశాలల్లోను తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ 6 రోజులు పాఠశాలలు ఉ.7.30 నుంచి 11.30 వరకు పనిచేయాలి. ఉ.8.30 నుంచి 9 గంటల మధ్య విద్యార్థులకు రాగిజావ.. 11.30–12 గంటల వరకు మధ్యాహ్న భోజనం అందించాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందిలేకుండా జాగ్రత్తలు..

రాష్ట్రంలో కొత్త విద్యా సంవత్సరం (2023–24) సోమవారం నుంచి ప్రారంభం కానుంది. తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంది. నాడు–నేడు పనులు జరుగుతున్న స్కూళ్లలో నిర్మాణ సామగ్రితో విద్యార్థులు ఇబ్బంది పడకుండా చూడాలని పాఠశాల విద్య మౌలిక వసతుల కమిషనర్ కాటమనేని భాస్కర్ డీఈవో, ఎంఈవోలను ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 16 వేల పాఠశాలను నాడు–నేడు రెండో దశలో అభివృద్ధి చేస్తుండగా, ఫేజ్–1లో అభివృద్ధి చేసిన మరో ఆరు వేల పాఠశాలల్లో 13 వేల అదనపు తరగతి గదులను నిర్మిస్తున్నారు. వీటిని వేసవి సెలవుల్లోనే ప్రారంభించి గత 40 రోజుల్లో రూ.1,600 కోట్ల విలువైన పనులు పూర్తిచేశారు. అదనపు గదులు తప్పనిసరి అయినచోట యుద్ధప్రాతిపదికన 2 వేల అదనపు తరగతి గదులను అందుబాటులోకి తెచ్చారు. మరో 11 వేల గదులు రెండునెలల్లో తీసుకురానున్నారు.

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

229 పని రోజులు.. 88 సెలవులు

ఈ ఏడాదిలో 229 రోజులపాటు పాఠశాలలు పని చేస్తాయి. 88 రోజులు సెలవులున్నాయి. స్కూల్ కాంప్లెక్స్ షెడ్యూల్, ప్రధానోపాధ్యాయులు, టీచర్ల విధులు, లాంగ్వేజ్ మేళా, క్లబ్, ల్యాబ్స్, పాఠ్య ప్రణాళిక, పరీక్షలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సహా పాఠశాలల్లో చేపట్టాల్సిన అంశాలతో పాఠశాల విద్యాశాఖ కేలండర్‌ను రూపొందించి అన్ని పాఠశాలలకు అందించింది. అందులో పేర్కొన్న విధంగా సమ్మేటివ్, ఫార్మేటివ్‌పరీక్షలు నిర్వహించాలని పేర్కొంది. అవి..

- ఉన్నత పాఠశాలలు ఉ.9 నుంచి సా.5 గంటల వరకు.. ప్రాథమిక పాఠశాలలు ఉ.9 నుంచి సా.4.30 గంటలకు కొనసాగుతాయి.
- వచ్చే ఏడాది ఒంటిపూట బడుల సమయంలో పాఠశాలలు ఉ.7.45 నుంచి మ.12.30 గంటల వరకు ఉంటాయి.
- అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఉన్న పాఠశాలలు వారానికి వరుసగా 2 పీరియడ్స్‌ను సైన్స్ పీరియడ్స్‌కు కేటాయించాలి.
- అక్టోబర్ 14–24 వరకు దసరా సెలవులు..జనవరి 9–18 వరకు సంక్రాంతి సెలవులు.
- క్రిస్టియన్ మైనార్టీ విద్యా సంస్థలకు అక్టోబర్ 21–24 వరకు దసరా సెలవులు.. డిసెంబర్ 17–26 వరకు క్రిస్మస్ సెలవులు.
- పర్యావరణ విద్య సబ్జెక్టును 6, 7 తరగతులకు భౌతికశాస్త్రం ఉపాధ్యాయులు.. 8, 9, 10 తరగతులకు జీవశాస్త్రం టీచర్లు బోధించాలి.
- ఈ విద్యా సంవత్సరం నుంచి మూడో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులకు టోఫెల్ ప్రైమరీ/జూనియర్ విభాగాలను ప్రవేశపెట్టడంతో ఆ శిక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. టోఫెల్ బోధనలో సహాయకులుగా ఇంగ్లిష్ టీచర్లతో పాటు డిగ్రీ, పీజీలో ఆంగ్లం ఒక సబ్జెక్టు చదివిన వారు సహాయకులుగా ఉండాలి. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో టోఫెల్ పరీక్ష నిర్వహించాలి.
- ఒకటి, రెండో తరగతుల విద్యార్థులకు ప్రతినెలా మొదటి, రెండో శనివారం 'నో బ్యాగ్ డే' పాటించి విద్యార్థులతో పేపర్ కటింగ్, క్లే మౌల్డింగ్, డ్రాయింగ్, సింగింగ్, గార్డెనింగ్ వంటి యాక్టివిటీస్ చేయించాలి.
- ప్రాథమిక పాఠశాల పిల్లలకు లాంగ్వేజ్ పీరియడ్స్‌లో కర్సివ్ రైటింగ్‌ను ప్రాక్టీస్ చేయించాలి. ఇంగ్లిష్‌కు ప్రాధాన్యమిస్తూ వారానికి 2 పీరియడ్స్‌ను గూగుల్ రీడ్ యాప్‌ను ఉపయోగించి వినడం.. మాట్లాడడం కోసం ఇంగ్లిష్ ల్యాబ్ నిర్వహించాలి.

గొడవలు.. గందరగోళం లేకుండా..

ప్రశాంతంగా, పకడ్బందీగా 50వేల మందికి పైగా ఉపాధ్యాయుల బదిలీలు

సాక్షి, అమరావతి : కొత్త విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ ముందే చెప్పినట్టుగా సమర్థంగా చేపట్టింది. గతంలో మాదిరిగా ఎక్కడా గందరగోళం, గొడవలు లేకుండా, అక్షరాల 50 వేల మంది పైచిలుకు టీచర్ల బదిలీల ప్రక్రియను ప్రారంభించింది. రకరకాల కారణాలతో అయిదారేళ్లుగా ఆగిపోయిన ఈ బదిలీల కౌన్సెలింగ్ 15 రోజుల్లో పూర్తిచేసి, కొత్త స్కూళ్లలో కొత్త టీచర్లను బదిలీ చేసింది. గతంలో అర్ధరాత్రి వరకు సాగే బదిలీ ప్రక్రియలో ఎంతో గందరగోళం నెలకొనేది. కానీ, ఈసారి టెక్నాలజీని ఉపయోగించి చేపట్టిన ఈ ప్రక్రియతో ఇంటి నుంచి లేదా ఇంటర్నెట్ పాయింట్ నుంచి బదిలీ ధ్రువపత్రం తీసుకుని కొత్త స్కూల్లో చేరుతున్నారని, వేలాది టీచర్ల ముఖాల్లో కొత్త ఆనందం కనిపిస్తోందని ఉపాధ్యాయ సంఘా లు తెలిపాయి. 45వేల ప్రభుత్వ స్కూళ్లలోని 41 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వేసవి సెలవుల్లో, ఎక్కడి వారు అక్కడే ఉంటూ, ఎవరి ప్రయాణాలు వాయిదా వేసుకోవాల్సిన అవసరం లేకుండా పకడ్బందీగా నిర్వహించిన చారిత్రాత్మక కౌన్సిలింగ్ అని పేర్కొంటూ ప్రభుత్వాన్ని, పాఠశాల విద్యాశాఖకు ఆయా సంఘాలు కితాబిచ్చాయి.

ఇంత ప్రశాంతంగా ఎప్పుడూ లేదు

సంఘాల మధ్య తరచూ చోటుచేసుకునే ఆధిపత్య ధోరణుల నేపథ్యంలో.. 'అర్ధరాత్రుళ్లు ఆగిపోయే కౌన్సెలింగ్ లేదు.. ఎక్కడా డీఈఓ కార్యాలయాల ముందు ఉపాధ్యాయుల పడిగాపులు లేవు.. ఆమ్యామ్యాలు ఇస్తేనే ఆర్డర్లు ఇస్తామనే వేధింపుల్లేవు.. ఇంట్లో ఉండి దరఖాస్తు చేసుకుని, ఇంట్లో నుంచే బదిలీ ఆర్డర్ పుచ్చుకుని, కొత్త స్కూళ్లలో చేరిన వేలాది ఉపాధ్యాయులందరూ టెక్నాలజీకి మనసులోనే నమస్కరిస్తున్నారు. ఇంత ప్రశాంతంగా జరిగిన దాఖలాలు లేవు. ఈ ఘనత మన పాఠశాల విద్యాశాఖదే. బదిలీల ప్రక్రియను అద్భుతంగా నిర్వహించిన ప్రభుత్వం.. ప్రభుత్వ పాఠశాలల విద్యా ర్థుల విద్యా ప్రయోజనాలకు కట్టుబడి ఉందన్న సంకేతాన్ని పంపించింది' అంటూ డెమోక్రటిక్ పీఆర్టీయూ ఏపీ టీచర్లు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

మీ డబ్బు మీ వద్ద.. మీ బిడ్డల భవిత మా వద్ద!



డబ్బులు ఎవరికీ ఊరికే రావు. అనవసరంగా మాయలో పడి చదువును కొనకండి. మన ఊరిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మీ పిల్లలను చేర్పించండి. మీ డబ్బు మీ వద్దే.. మీ పిల్లల భవిష్యత్తు మా వద్ద.. అంటూ సోషల్ మీడియా వేదికగా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు అనంతపురం జిల్లాలోని పలువురు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా మారిపోయాయని, అమ్మఒడి తదితర సంక్షేమ పథకాల ద్వారా పిల్లల చదువులకు సీఎం జగన్ అండగా నిలుస్తున్నారంటూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

- రాప్తాడు రూరల్

రూ.లక్ష కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ హబ్

పూడిమడక వద్ద ఫేజ్-1 పనులు ప్రారంభించిన ఎన్టీపీసీ

- ఈ ప్రాజెక్టు నిర్మించేందుకు జీఐఎస్‌లో ఏపీ ప్రభుత్వంతో ఎన్టీపీసీ ఒప్పందం
- 13.4 గిగావాట్‌ల సోలార్, 20 గిగావాట్‌ల రెన్యువబుల్ ఎనర్జీ ప్లాంట్ల నిర్మాణం
- ఫేజ్–1 పనులు 2026కు పూర్తి చేసేందుకు కసరత్తు

సాక్షి, విశాఖపట్నం : తరిగిపోతున్న శిలాజ ఇంధన వనరులకు ప్రత్యామ్నాయంగా స్వచ్ఛ ఇంధనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చే ప్రయత్నాలను ఏపీ ప్రభుత్వం ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఇటీవల విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఏపీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ పనులను ఎన్టీపీసీ ప్రారంభించేలా చర్యలు తీసుకుంది. సుమారు రూ.లక్ష కోట్లతో అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు తొలి విడత పనులను 2026కు, మొత్తం 2030నాటికి పూర్తి చేసే దిశగా ఎన్టీపీసీ ప్రణాళికలు సిద్ధంచేసింది.

1,200 ఎకరాల్లో ఏర్పాటు...

రాబోయే 20 ఏళ్లలో పెట్రోల్, డీజిల్, బొగ్గు వంటి సంప్రదాయ ఇంధన వనరులను క్రమంగా తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ఏపీ సిద్ధమవుతోంది. ఈ స్వచ్ఛ ఇంధనాన్ని వినియోగంలోకి తీసుకురావడం ద్వారా భూతాపం, కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ఇందులో భాగంగా దేశంలోని అతి పెద్ద ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థ అయిన ఎన్టీపీసీతో ఏపీ ప్రభుత్వం


హైడ్రోజన్ హబ్ పనులు మొదలైన ప్రాంతం

ఒప్పందం కుదుర్చుకుంది. హైడ్రోజన్, ఎనర్జీ స్టోరేజ్ పరిష్కృత ప్రాజెక్టు ఏర్పాటుపై జరిగిన ఒప్పందంలో భాగంగా పూడిమడక వద్ద గ్రీన్ హైడ్రోజన్ హబ్ ప్రాజెక్టు తొలి విడత పనులను ఇటీవల ఎన్టీపీసీ ప్రారంభించింది. తొలి విడతలో 1,500 టన్నుల సామర్థ్యంతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ హబ్‌లో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా సంబంధిత ఎక్విప్‌మెంట్ ఉత్పత్తి, ఎగుమతులకు అవసరమైన మాన్యుఫ్యాక్చరింగ్ సౌకర్యాలను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఏపీఐఐసీ 1,200 ఎకరాలను ఎన్టీపీసీకి కేటాయించింది. ఈ భూమిని చదును చేసే ప్రక్రియ మొదలైంది. మొదటి విడత ప్రాజెక్టు ప్రక్రియ పనులకు అవసరమైన మేర స్థలాన్ని సిద్ధం చేస్తున్నారు.

9,000 ఎండబ్ల్యూహెచ్ స్టోరేజ్ ప్రాజెక్టు టెండర్లు వారంలో ఖరారు

ఇప్పటికే ఏపీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ప్రాజెక్టు ఫేజ్–1 పనులు ప్రారంభించిన ఎన్టీపీసీ... 9,000 మెగావాట్‌హవర్ (ఎండబ్ల్యూహెచ్) స్టోరేజ్ ప్రాజెక్టు టెండర్లని ఈ వారంలో ఖరారు చేయనుంది. మొదటి విడత పనులను 2026 నాటికి పూర్తి చేయనుంది. సుమారు రూ.లక్ష కోట్ల విలువైన ఈ ప్రాజెక్టు మొత్తం పనులను 2030నాటికి పూర్తి చేసి దేశానికి అంకితమిచ్చే దిశగా అడుగులు వేస్తున్నట్లు ఎన్టీపీసీ డైరెక్టర్(ఫైనాన్స్) శ్రీనివాసన్ తెలిపారు. ప్రీ ఇంజినీరింగ్ బిల్డింగ్స్, షెడ్‌లను నిర్మించి వీలైనంత త్వరగా ప్రాజెక్టు పూర్తి చేసి ఉత్పత్తి పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. సోలార్ రూఫ్‌టాప్‌లు, ఎలక్ట్రోలైజర్స్, ఫ్యూయల్ సెల్స్, బ్యాటరీలు, సోలార్ వేఫర్స్, సోలార్ మాడ్యూల్స్, విండ్ టర్బైన్ ఎక్విప్‌మెంట్, కార్బన్ క్యాప్చర్ సిస్టమ్స్ తదితర కొత్త టెక్నాలజీకి సంబంధించిన ఉత్పత్తులు ఈ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లో తయారు కానున్నాయి. దక్షిణాసియా దేశాల మార్కెట్ కోసం రోజుకు 1,300 టన్నుల గ్రీన్ అమ్మోనియా, 1,200 టన్నుల గ్రీన్ ఇథనాల్ సహా గ్రీన్ హైడ్రోజన్, ఇతర ఉత్పత్తులు ఎగుమతి చేసే విధంగా ప్రాజెక్టును డిజైన్ చేశారు. అదేవిధంగా ఈ ప్రాజెక్టు ద్వారా 2030 నాటికి 13.4 గిగావాట్‌ల సోలార్, 20 గిగావాట్‌ల రెన్యువబుల్ ఎనర్జీని ఉత్పత్తి చేయడం, నిల్వ సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించినట్లు ఎన్టీపీసీ ప్రకటించింది.

త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టేందుకు ఎన్టీపీసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

విద్యుత్ ఉత్పత్తిలో మరో ముందడుగు

- ఎన్టీటీపీఎస్‌లో 800 మెగావాట్ల 8వ యూనిట్ విజయవంతంగా గ్రిడ్‌కు అనుసంధానం
- అత్యాధునిక సాంకేతికతతో యూనిట్ నిర్మాణం
- జూలై నెలాఖరు నాటికి వాణిజ్య ఉత్పత్తి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలకు నిరంతరం నాణ్యమైన, తక్కువ ఖర్చుతో కూడిన విద్యుత్‌ను సరఫరా చేయాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా.. ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్(ఏపీ జెన్‌కో) మరో ముందడుగు వేసింది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్(ఎన్టీటీపీఎస్)లో స్టేజ్–5 కింద 800 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించిన 8వ యూనిట్‌ను ఆదివారం విజయవంతంగా గ్రిడ్‌కు అనుసంధానం చేసింది. ఈ యూనిట్ బాయిలర్ సూపర్ క్రిటికల్ సాంకేతికత, శక్తి సామర్థ్య టర్బైన్, జనరేటర్‌తో 80 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. సీటిని ఆదా చేసే విధంగా ఏర్పాట్లు చేశారు. యూనిట్‌ను పూర్తి లోడ్‌తో నడపడానికి రోజుకు దాదాపు 9,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరమవుతుంది. విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియలో వెలువడే బూడిద వృథా అవ్వకుండా వంద శాతం వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నారు. ఇటీవలే నెల్లూరులోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్‌లో కూడా 800 మెగావాట్ల యూనిట్–3 వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించారు. ఎన్టీటీపీఎస్‌లో కొత్త యూనిట్ ట్రయల్ ఆపరేషన్‌తో ఏపీ జెన్‌కో థర్మల్ ఇన్‌స్టాల్డ్ సామర్థ్యం 8,789 మెగావాట్లకు చేరుకుంది. ఇటీవల కాలంలో జాతీయ స్థాయిలో రెండు 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ యూనిట్లు ఏపీలోనే ప్రారంభమవ్వడం విశేషం. ప్రస్తుతం రాష్ట్ర గ్రిడ్‌కు ఏపీ జెన్‌కో రోజూ 102 నుంచి 105


ఎన్టీటీపీఎస్‌లో స్టేజ్-5 కింద నిర్మించిన 8వ యూనిట్

మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. ఇది మొత్తం వినియోగంలో దాదాపు 40 నుంచి 45 శాతంగా ఉంది.

జూలై నెలాఖరుకల్లా వాణిజ్య ఉత్పత్తి..

కొత్త యూనిట్ వాణిజ్య ఉత్పత్తిని వచ్చే నెల చివరికల్లా మొదలయ్యేలా చూడాలని ఏపీ జెన్‌కో, బీహెచ్ఈఎల్, బీజీఆర్ ప్రతినిధులకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సూచించారు. గ్రిడ్ అనుసంధానం సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు నిల్వలను మెరుగుపరచడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. తక్కువ ఖర్చుతో సమర్థవంతమైన విద్యుత్ ఉత్పత్తిని సాధించాలన్నారు. విద్యుత్ రంగానికి సీఎం వైఎస్ జగన్, ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని వివరించారు. అత్యుత్తమ విధానాలు అవలంబించడానికి, కర్బన ఉద్గారాలు తగ్గించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. విద్యుత్ ఉత్పత్తిలో, అత్యధిక ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ నిర్వహణలో జాతీయ స్థాయిలో అత్యుత్తమ సంస్థగా ఉండేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో ఏపీ జెన్‌కో డైరెక్టర్లు చంద్రశేఖరరాజు, బి.వెంకటేశులురెడ్డి, సయ్యద్ రఫీ, సత్యనారాయణ, ఆంటోనీ రాజా పాల్గొన్నారు.

క్లుప్తంగా...

బహుజనులకు అన్యాయం చేస్తే భూస్థాపితమే..

బహుజన పరిరక్షణ సమితి నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ : బహుజనులకు అండగా నిలువకుండా అన్యాయం చేస్తున్న పార్టీలను భూస్థాపితం చేస్తామని బహుజన పరిరక్షణ సమితి నేతలు హెచ్చరించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 987వ రోజుకు చేరాయి. ఈ దీక్షలకు పలువురు మద్దతు తెలిపి ప్రసంగించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు ఆర్థికంగా ఎదిగేందుకు అడుగడుగునా అడ్డుపడుతున్న బాబు అండ్ కోకు వత్తాసుగా నిలుస్తున్న తోక పార్టీలకు కాలం చెల్లే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. కులవాదమే అజెండాగా రాష్ట్రంలో రాజకీయాలు నడవడం బాధాకరమని, తరతరాల ఆధిపత్యం కోసం అన్ని పార్టీల్లో ఉన్న కులవాదులంతా ఏకమై బహుజనుల హక్కులపై దెబ్బకొట్టాలని కుటిల యత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదవాడికి ఆర్థిక భరోసా ఇచ్చేందుకు సీఎం వైఎస్ జగన్ ఇళ్ల స్థలాలిచ్చి.. పక్కా గృహాలు నిర్మించుకునేందుకు రుణాలు మంజూరు చేస్తుంటే వీరికి నష్టమేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు, పల్లె బాబు, బేతపూడి సాంబయ్య, కారుమూరి పుష్పరాజ్ పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఎవరో రాసిస్తే చదివే అలవాటు నడ్డాకు లేదు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

సాక్షి, విశాఖపట్నం: ఎవరో స్క్రిప్ట్ రాసిస్తే చదివే అలవాటు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాకు లేదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న పరిస్థితులపైనే శ్రీకాళహస్తి సభలో నడ్డా మాట్లాడారని చెప్పారు. దీనిపై మాజీ మంత్రి పేర్ని నాని చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని అన్నారు. సోము వీర్రాజు ఆదివారం విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడుతూ నడ్డాను విమర్శించే స్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులకు లేదన్నారు. రాష్ట్రంలో ఇసుక, భూ మాఫియాలు నడుస్తున్నాయని తాము ఎప్పటి నుంచో చెబుతున్నామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధితోపాటు అవినీతిపైనా చర్చకు తాము సిద్ధమని, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధమా... అని ఆయన ప్రశ్నించారు. ఏపీ అభివృద్ధికి కేంద్రం నిధులు ఇస్తోందని, వాటిని సక్రమంగా సద్వినియోగం చేయడంలేదని ఆరోపించారు. బీజేపీ రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అవకతవకలపై మీడియా సమక్షంలో చర్చకు రావాలని డిమాండ్ చేశారు. తాము చేస్తున్న ఆరోపణలను నిరూపించలేకపోతే తమ పదవులకు రాజీనామా చేస్తామని చెప్పారు. తాము ఏ పార్టీ నుంచి వచ్చినా ప్రస్తుతం ఉన్న పార్టీకే మద్దతుగా మాట్లాడతామని తెలిపారు. మీడియా సమావేశంలో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మాధవ్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

20 ఎంపీ సీట్లు ఏపీలో గెలవాలి

▶ మొదటి పేజీ తరువాయి

భూ మాఫియా పెరిగిందని విమర్శించారు.

తొమ్మిదేళ్లలో రూ.10 లక్షల కోట్లు

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తోందని కేంద్ర మంత్రి అమిత్‌షా అన్నారు. ఏపీకి భారీగా నిధులు కేటాయించడంతో పాటు ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ, ఎయిమ్స్, మెడికల్ కాలేజీలు, ట్రిపుల్ ఐటీ, సెంట్రల్, ట్రైబల్ యూనివర్సిటీలు వంటి పలు కేంద్ర సంస్థలను మంజూరు చేసిందని చెప్పారు. 2009 – 2014 వరకు యూపీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు పన్నులు, గ్రాంట్ల రూపంలో రూ.78 వేల కోట్లు ఇస్తే మోదీ పాలన తొమ్మిదేళ్లలో సుమారు రూ.10 లక్షల కోట్లు ఇచ్చారని తెలిపారు. 2014 నాటికి రాష్ట్రంలో నాలుగు వేల కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉండగా, ఇప్పుడవి 9 వేల కిలోమీటర్లకు విస్తరించాయన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం కోసం రూ.3 లక్షల కోట్లు ఖర్చు చేశారని, దీనికి అదనంగా సాగరమాల పథకంలో జాతీయ రహదారులకు రూ.85 వేల కోట్లు వెచ్చించామని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టుతో పాటు విశాఖ-సికింద్రాబాద్, తిరుపతి-సికింద్రాబాద్‌ల మధ్య వందేభారత్ రైళ్లు, కాకినాడలో బల్క్ డ్రగ్ పార్క్ వంటివి ప్రధాని మోదీ మంజూరు చేశారని చెప్పారు. విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి, అమరావతిలను స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. విశాఖ, అనంతపురంలలో మల్టీపర్పస్ లాజిస్టిక్ పార్కులు ఏర్పాటవుతున్నాయన్నారు.

కుంభకోణాలకు తావులేని పాలన

దేశంలో 2004 నుంచి 2014 వరకు సోనియాగాంధీ నేతృత్వంలోని మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం రూ.12 లక్షల కోట్ల అవినీతికి, ఎన్నో కుంభకోణాలకు పాల్పడిందని, అందుకు బాధ్యులపై చర్యలూ తీసుకోలేదని అమిత్ షా ఆరోపించారు. నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో ఒక్క అవినీతి కుంభకోణం జరగలేదన్నారు. పైగా ప్రపంచ దేశాల్లో భారత్ గౌరవాన్ని మోదీ పెంచారన్నారు. మోదీ ప్రధాని అయ్యాక దేశంలో ప్రతి ఇంటికి విద్యుత్, మరుగుదొడ్డి సదుపాయం కల్పించారన్నారు. కోవిడ్ మహమ్మారి నిరోధానికి 230 కోట్ల కోవిడ్ వ్యాక్సిన్లు ఉచితంగా వేయించారని తెలిపారు. కాశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేస్తే అక్కడ రక్తం ఏరులై పారుతుందని రాహుల్‌గాంధీ అన్నారని, ఆ తర్వాత పరిణామాలతో ఆయన అంచనా తప్పని తేలిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ 300 లోక్‌సభ స్థానాలు దక్కించుకుంటుందని జోస్యం చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ఆ పార్టీ నేతలు సత్యకుమార్, పురందేశ్వరి, విష్ణుకుమార్‌రాజు తదితరులు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ సభలో కేంద్ర మంత్రి మురళీధరన్, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, పార్టీ నేతలు సునీల్ దేవ్‌ధర్, జీవీఎల్ నరసింహారావు, టీజీ వెంకటేష్, సీఎం రమేష్, సుజనాచౌదరి పాల్గొన్నారు.

ల్యాండ్ స్కామ్ అంటే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణే

▶ మొదటి పేజీ తరువాయి

ఎలా ఆరోపిస్తారని ప్రశ్నించారు. బీజేపీ ముసుగులో చంద్రబాబు ప్రయోజనాల కోసం పని చేస్తున్న సీఎం రమేశ్, సుజనాచౌదరి, సత్యకుమార్ వంటి పచ్చపువ్వులు చెప్పిన తప్పుడు మాటలు విని.. వాటినే చెప్పడం మంచిదికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం కాదని.. కేంద్రంపై ఢిల్లీలో విమర్శలు చేస్తున్న విపక్షాలకు సమాధానం చెప్పండని ఆయన నడ్డాకు సూచించారు. బీజేపీలో పచ్చపువ్వుల కలుపు తీయకపోతే ఆ పార్టీ టీజేపీగా మారడం ఖాయమని నాని స్పష్టం చేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

అమరావతిపై వైఖరి ఎందుకు మారింది?

అమరావతిలో జరిగిన ల్యాండ్ స్కామ్‌పై విచారణ జరిపిస్తామని 2019 బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నారు. రాజధాని నిర్మించడానికి రూ.వేలాది కోట్లిస్తే.. వాటిని చంద్రబాబు హల్వాలా తినేసి ఒక్క భవనాన్ని నిర్మించలేకపోయారని బీజేపీ నేతలే ఆరోపించారు. కర్నూల్‌లో హైకోర్టును ఏర్పాటుచేస్తామని బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొంది. మరిప్పుడు టీడీపీ పాటను బీజేపీ వాళ్లు ఎందుకు అందుకున్నారో?

రూ.4 వేల కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి?

రాష్ట్రంలో శాండ్ (ఇసుక) స్కామ్ జరిగిందని నడ్డా ఆరోపించారు.. 2014–19 వరకు టీడీపీ–బీజేపీ రెండూ కలిసి రాష్ట్రాన్ని ఏలాయి. అప్పుడు ఇసుక ఉచితం పేరుతో నదుల్లో ఉన్నటువంటి ఇసుకనంతా టీడీపీ–బీజేపీ పెద్దలందరూ దోచుకున్నారు. ఇప్పుడు ఈ ప్రభుత్వ హయాంలో ఇసుక వల్ల ఏటా రూ.750 కోట్ల చొప్పున ఐదేళ్లలో దాదాపు రూ.4,000 కోట్ల ప్రభుత్వ ఖజానాకు జమవుతోంది. ఇదే ఆదాయం అప్పుడు రాలేదు కదా.. ఇలా సంవత్సరానికి రూ.750కోట్ల చొప్పున ఈ నాలుగు వేల కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి? టీడీపీ–బీజేపీ జేబుల్లోకే పోయాయా మరి?

మద్యం స్కాం ఎవరిదో మీరే చెప్పాలి..

నిజానికి.. రాష్ట్రంలో మద్యం కుంభకోణం జరిగింది టీడీపీ–బీజేపీ ప్రభుత్వ హయాంలోనే. ఇప్పుడున్న డిస్టిలరీలు ఏవీ కొత్తవి కావు. ఇవన్నీ గత టీడీపీ–బీజేపీ ప్రభుత్వ హయాంలోనివే.. ఇప్పుడు కొత్తగా ఒక్క దానికీ అనుమతివ్వలేదు. అప్పట్లో ఢిల్లీ రికమెండేషన్ పేరుతో మూడు, నాలుగు కంపెనీలకే 80 శాతం అమ్మకాలను చంద్రబాబు కట్టబెట్టారు. కానీ ఇప్పుడు డిస్టిలరీలన్నింటికీ నూరుశాతం సమానంగా కాంట్రాక్టు ఇచ్చాం.. ఇందులో స్కాం ఎవరిదో మీరే చెప్పాలి. అలాగే, వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక మద్యం రేట్లు పెంచాం.. అమ్మకాలు తగ్గించాం. బెల్ట్‌షాపులు లేవు. మద్యం షాపులను ప్రభుత్వమే నడిపిస్తోంది. ప్రజల ఆస్తిగా ప్రభుత్వానికి ఆదాయం వస్తోంది.

పేదల ఖాతాల్లో రూ.2.16లక్షల కోట్లు జమ

రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదల ఖాతాల్లో సంక్షేమ పథకాల ద్వారా ఒక్క పైసా అవినీతికి తావులేకుండా నాలుగేళ్లలోనే జగన్ సర్కార్ రూ.2.16 లక్షల కోట్లను జమచేసింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఈ విషయంలో సీఎం రాజీపడలేదు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇందులో సగమైనా జమచేశారా?

హరీశ్ సర్టిఫికెట్లకు ఉల్లిపాయలైనా వస్తాయా?

తెలంగాణ మంత్రి హరీశ్‌రావుకు తన మేనమామ కేసీఆర్ మీద విపరీతమైన దుగ్ధ, బాధ, కోపం. బామ్మర్ది మీద ఈర్ష్య. అమాంతం మామను తోసేసి సీఎం కుర్చీలో కూర్చోవాలన్నది హరీశ్ తపన. బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడనే గతంలో కేబినెట్‌లోకి తీసుకోకుండా హరీశ్‌ను కేసీఆర్ పక్కన పెట్టాడు. ఏపీ ప్రభుత్వానికి హరీశ్‌రావు సర్టిఫికెట్లు అవసరమేలేదు. ఆ సర్టిఫికెట్లకు తెలంగాణలోనైనా ఉల్లిపాయలు వస్తాయా?

రాష్ట్రపతినే గౌరవించని వాళ్లు.. రాష్ట్రాన్ని ఉద్ధరిస్తారా?

ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్

సాక్షి, అమరావతి : దేశ ప్రథమ పౌరురాలైన గిరిజన మహిళను గౌరవించని బీజేపీ నేతలు దేశాన్ని, రాష్ట్రాన్ని ఉద్ధరిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు, గిరిజన నాయకుడు వడిత్యా శంకర్ నాయక్ మండిపడ్డారు. మోదీ తొమ్మిదేళ్ల పాలన నేపథ్యంలో ఆదివారం విశాఖ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన విమర్శలను శంకర్‌నాయక్ ఖండించారు. కేవలం ఓట్లు, సీట్ల కోసమే గిరిజన మహిళ అయిన ద్రౌపది ముర్మును రాష్ట్రపతి చేశారు తప్పా.. బీజేపీ నేతలకు గిరిజనులపై నిజమైన చిత్తశుద్ధి లేదన్నారు. ఇదే విషయం పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవంలో తేటతెల్లమైందని తెలిపారు. ఇప్పుడు 20 ఎంపీ సీట్లు గెలిపిస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని గొప్పలు చెబుతున్న అమిత్ షా రాష్ట్ర విభజన హామీలను ఎందుకు అమలు చేయలేకపోయారని ప్రశ్నించారు.

బాబు నిర్వాకంతో రూ.2,020 కోట్లు నష్టం

- పోలవరంపై గత సర్కారు అవగాహన లేని పనులతో జాప్యం: మంత్రి అంబటి
- కమీషన్ల దాహంతో సర్వనాశనం చేసిన చంద్రబాబు, రామోజీ, నవయుగ
- సీఎం జగన్ పూర్తి చేస్తుంటే ఎందుకంత కడుపుమంట?
- ప్రాజెక్టును సందర్శించాలనుకుంటే అనుమతి కోరితే ఇస్తాం
- ప్రచారం కోసం ఆర్నెల్ల క్రితం చంద్రబాబు, ఇప్పుడు ఉమా రాద్ధాంతం
- సీడబ్ల్యూసీ నివేదిక ఆధారంగా గైడ్ బండ్‌ను చక్కదిద్దుతాం

సాక్షి, అమరావతి: అవగాహనా రాహిత్యంతో పనులు చేపట్టడంతోపాటు పోలవరం నిర్మాణంలో జాప్యం, భారీ నష్టానికి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబే కారణమని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. టీడీపీ హయాంలో ప్రోటోకాల్ ప్రకారం వరదను మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్, ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేయకుండా కమీషన్ల దాహంతో ప్రధాన డ్యామ్ పునాది డయాఫ్రమ్‌వాల్‌ను చంద్రబాబు చేపట్టారని విమర్శించారు. కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేయకుండా ఖాళీ ప్రదేశాలను వదిలేయడం వల్ల గోదావరి వరద ఉధృతికి డయాఫ్రమ్‌వాల్ దెబ్బ తినడంతోపాటు ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతం కోతకు గురై అగాధాలతో ధ్వంసమైందన్నారు. డయాఫ్రమ్‌వాల్‌లో దెబ్బతిన్న చోట్ల కొత్తగా డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి, అగాధాలను పూడ్చివేసి ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతాన్ని యథాస్థితికి తెచ్చేందుకు రూ.2,020 కోట్లు వ్యయం అవుతుందని సీడబ్ల్యూసీ తేల్చిందన్నారు. ఈ నష్టానికి చంద్రబాబు, దేవినేని ఉమా, నవయుగ కారణమని స్పష్టం చేశారు. నవయుగ సంస్థ రామోజీ కుమారుడి వియ్యంకుడిది కావడంతో ఈ నష్టం ఈనాడుకు కనపడదని వ్యాఖ్యానించారు. కమీషన్ల దాహంతో మీరు చేసిన తప్పిదాలను సరిదిద్దుతూ శరవేగంగా ప్రాజెక్టును పూర్తి చేస్తుంటే ఎందుకంత కడుపుమంట? అని చంద్రబాబు, ఎల్లో మీడియాను నిలదీశారు. ప్రచార పిచ్చితో ఆర్నెల్ల క్రితం పోలవరాన్ని పరిశీలిస్తానంటూ రాత్రి పూట చంద్రబాబు రాద్ధాంతం చేస్తే మాజీ మంత్రి దేవినేని, ఆ పార్టీ ఎమ్మెల్యేలు తాజాగా వీరంగం సృష్టించారని మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్ శరవేగంగా పూర్తిచేస్తున్న పోలవరం ప్రాజెక్టును సందర్శించాలనుకుంటే అనుమతి కోరితే ఇస్తామని చెప్పారు. మంత్రి అంబటి ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

పూర్తవుతుండటం కానరాదా?

సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసి స్పిల్‌వే, స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానళ్లను పూర్తి చేసి గోదావరి ప్రవాహాన్ని 6.1 కి.మీ. పొడవున 2021 జూన్ 11నే మళ్లించారని మంత్రి అంబటి గుర్తు చేశారు. దిగువ కాఫర్ డ్యామ్, గ్యాప్–3లో కాంక్రీట్ డ్యామ్‌ను పూర్తి చేశామన్నారు. విద్యుత్కేంద్రం పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్ల ప్రకారం ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో అగాధాల పూడ్చివేత వేగంగా సాగుతోందన్నారు. అది పూర్తయ్యాక డయాఫ్రమ్ వేసి వరదల్లోనూ ప్రధాన డ్యామ్‌ను పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే పోలవరం పనుల్లోపురోగతే లేదంటూ చంద్రబాబు, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు.

కేంద్రాన్ని ఒప్పించి నిధులు తెస్తున్న సీఎం జగన్

2013–14 ధరల ప్రకారం రూ.20,398 కోట్లతో పోలవరం పూర్తి చేస్తానంటూ కేంద్రంతో చేసుకున్న ఒప్పందంపై 2016లో చంద్రబాబు సంతకం చేశారని మంత్రి అంబటి పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు పనులు 48 శాతం పూర్తయ్యాయని, వ్యయం మాత్రం రూ.20,398 కోట్ల కంటే ఎక్కువ అయ్యిందన్నారు. చంద్రబాబు కమీషన్ల దాహంతో 2013–14 ధరలకే పనులు చేస్తానని అంగీకరించడం వల్ల 2017–18 ధరల ప్రకారం పోలవరానికి ఇవ్వాల్సిన రూ.55,548 కోట్లను కేంద్రం ఇవ్వడం లేదన్నారు. 2017–18 ధరల ప్రకారం నిధులిచ్చి ప్రాజెక్టు సత్వరమే పూర్తి చేసేందుకు సహకరించాలని సీఎం జగన్ పలుదఫాలు ప్రధాని మోదీ, జల్ శక్తి, ఆర్థిక శాఖల మంత్రులను కోరారని గుర్తు చేశారు. దీనిపై స్పందించిన కేంద్రం తొలుత 41.15 మీటర్ల పరిధిలో పూర్తి చేయడానికి అవసరమైన రూ.12,911 కోట్లు విడుదలకు అంగీకరించిందన్నారు. ఇటీవల నిర్వహించిన లైడార్ సర్వేలో 41.15 మీటర్ల పరిధిలోకి మరో 36 గ్రామాల్లోని 16 వేల నిర్వాసిత కుటుంబాలు వస్తాయని తేలిందని, వారికి పునరావాసం కల్పించేందుకు రూ.5,127 కోట్లను అదనంగా ఇవ్వడానికి కూడా కేంద్రం సానుకూలంగా ఉందన్నారు. నిధుల సమస్యను పరిష్కరించిన సీఎం జగన్ పోలవరాన్ని సందర్శించి శరవేగంగా పూర్తి చేసేలా అధికారులకు దిశానిర్దేశం చేయడాన్ని చూసి ఓర్వలేని ఈనాడు రామోజీరావు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గైడ్ బండ్ కుంగలేదన్నారు. కొంత జారిందని, కారణాలపై సీడబ్ల్యూసీ కమిటీ అన్వేషిస్తుందన్నారు. కమిటీ నివేదిక ఆధారంగా దాన్ని చక్కదిద్దుతామని స్పష్టం చేశారు. వైఎస్సార్ స్వప్నం పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ఆయకట్టుకు నీళ్లందించేది సీఎం వైఎస్ జగనేనని స్పష్టం చేశారు.

14 ఏళ్లు సీఎంగా ఉండి ఏం చేశావ్ బాబూ?

చంద్రబాబుకు మతిభ్రమించి సీఎం జగన్, మంత్రులపై విమర్శలు చేస్తున్నారని అంబటి మండిపడ్డారు. 'సీఎంగా 14 ఏళ్లు పనిచేసి కుప్పాన్ని మున్సిపాలిటీగా చేశావా? కనీసం రెవెన్యూ డివిజన్‌గా కూడా ఎందుకు చేయలేకపోయావ్?' అని చంద్రబాబును నిలదీశారు. కుప్పం కాలువను కూడా పూర్తిచేయలేని దౌర్భాగ్య పరిస్థితి చంద్రబాబుదన్నారు. కుప్పంలో ఎలాంటి అభివృద్ధీ చేయని చంద్రబాబుకు మంత్రుల గురించి మాట్లాడే నైతిక హక్కు నీకు ఉందా? అని నిలదీశారు. ఐదేళ్లలో పులివెందులను దివంగత వైఎస్సార్ ఎలా అభివృద్ధి చేశారో వెళ్లి చూడాలని సలహా ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్‌కు విశ్వాసపాత్రుడిగా ఉంటూ టికెట్ తెచ్చుకుని సత్తెనపల్లి నుంచి పోటీ చేస్తానని ఓ ప్రశ్నకు సమాధానంగా అంబటి చెప్పారు. చంద్రబాబు, పవన్ పార్టీలు మారిన వస్తాదులను ఎంత మందిని పోటీకి పెట్టినా ప్రజలు తననే గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

అధికారమిస్తే.. డ్రిప్ పరికరాలిస్తాం: లోకేశ్


లోకేశ్ పాదయాత్రలోని వాహనం ఢీకొట్టిన బస్సును పరిశీలిస్తున్న పోలీసులు

అట్లూరు: టీడీపీ అధికారంలోకి వస్తే.. రైతులకు పాత పద్ధతిలో డ్రిప్ పరికరాలు అందజేస్తామని టీడీపీ నేత నారా లోకేశ్ చెప్పారు. యువగళం పాదయాత్రలో భాగంగా ఆదివారం సాయంత్రం వైఎస్సార్ జిల్లా అట్లూరు మండలం నబీయాబాద్ వద్ద పాదయాత్ర మొదలు పెట్టే ముందు రైతులతో లోకేశ్ ముఖాముఖి నిర్వహించారు. జగన్ పాలనలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల రేట్లు పెరిగాయని ఆరోపించారు. టీడీపీ ప్రాజెక్టుల కోసం రూ.11,700 కోట్లు ఖర్చు చేస్తే.. ప్రస్తుత ప్రభుత్వం అందులో 10 శాతం కూడా ఖర్చు చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీకి ఇచ్చిన సీట్లు ఈసారి టీడీపీకి ఇస్తే.. రాయలసీమను అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. గోదావరి, పెన్నా అనుసంధానం ద్వారానే సాగునీటి సమస్య తీరుతుందన్నారు. పండ్ల మొక్కలు రాయలసీమలో పెంచే విధంగా రీసెర్చ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన యువగళం వాహనం

యువగళం పాదయాత్రకు సంబంధించిన కంటైనర్ వాహనం ఆదివారం సాయంత్రం నెల్లూరు నుంచి కడపకు వస్తున్న ఆర్టీసీ బస్సును లింగాలకుంట చెరువు వద్ద ఢీకొట్టింది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. కంటైనర్ డ్రైవర్ తన వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. దీంతో బస్సు డ్రైవర్ జి.వెంకటయ్య అట్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రాజకీయాలు నచ్చకే దూరంగా ఉన్నా..

- ప్రస్తుత పరిస్థితులను చూసి తట్టుకోలేకే మళ్లీ వచ్చా: మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: గతంలో జరిగిన పరిణామాలతో రాజకీయాలు నచ్చక తాను దూరంగా ఉన్నానని ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి, ఇటీవల బీజేపీలో చేరిన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కొన్నాళ్ల విరామం తర్వాత ప్రస్తుత పరిస్థితులను చూసి తట్టుకోలేక మళ్లీ రాజకీయాల్లోకి రావాలనిపించి వచ్చానన్నారు. ఆదివారం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడారు. కొన్నాళ్ల పాటు రాజకీయాలు వదిలి ప్రశాంత జీవితం గడిపి తిరిగి కాంగ్రెస్‌లో చేరినా అక్కడ ఇమడ లేకపోయానన్నారు. నరేంద్ర మోదీతో తనకు ముందునుంచే పరిచయం ఉందని, ఆయన పనితీరు నచ్చడంతో పాటు ఇప్పుడున్న పరిస్థితుల్లో బీజేపీ ఒక్కటే దేశానికి ఏకైక ఆప్షన్‌గా భావించి ఆ పార్టీలో చేరానని తెలిపారు. 1999–2004 మధ్య చంద్రబాబు పాలనలో 1,500 పనిదినాలకు 1,200 రోజుల్లో ఆర్బీఐ నుంచి రూ.40వేల కోట్ల అప్పులు తెచ్చారని విమర్శించారు. ఆ తర్వాత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ పాలన పదేళ్లలో మూడు రోజులే ఆర్బీఐ నుంచి రుణాలు తెచ్చినట్లు చెప్పారు. 2009లో వైఎస్ అమలు చేసిన 29 సంక్షేమ పథకాలపై సర్వే నిర్వహిస్తే, 108 సేవలు తొలి స్థానంలో నిలిచాయని తెలిపారు.



దేనికి భయపడనక్కర్లేదో
తెలుసుకోవడమే ధైర్యం.
– ప్లేటో

సాక్షి
సోమవారం, 12 జూన్ 2023

ఎదురుచూపులు

ధర్మం నాలుగుపాదాలా నడిచే రాజ్యంలో క్రమం తప్పకుండా వానలు కురుస్తాయని ప్రతీతి. ఇప్పుడు ధర్మం ఎన్ని పాదాలతో నడుస్తోందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ధర్మం ఎంత కుంటి నడక నడుస్తున్నా, ఈ భూమ్మీద చెట్టూ చేమా, పిట్టా పిచుకా, పశువులూ మనుషులూ మనుగడ సాగించాలంటే తప్పకుండా వానలు కురవాల్సిందే! ఈసారి వేసవి తన తీవ్రతను తారస్థాయిలో చూపుతోంది. ఎండలు మండిపడుతున్నాయి. సూర్యుడింకా నడినెత్తికి రాకముందే నడివీథుల్లో నిప్పులు చెరుగుతున్నాయి. రుతు పవనాలు ఇప్పటికే కేరళ తీరానికి చేరుకున్నాయి. నేడో రేపో ఇక్కడకూ చేరుకుంటాయి. వానలు కురిపిస్తాయి. ఈ ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం జనాలు చాతకాల్లా వానల కోసం ఎదురు చూస్తున్నారు. ఉక్కపోతలతో అల్లాడిన జనాలకు నాలుగు చినుకులే ఊరట! వాన చినుకుల కోసం నెర్రెలువారిన నేల ఆవురావురుమని ఎదురుచూస్తుంది.

మన ప్రాచీన సాహిత్యంలో చాతక పక్షులు ఎదురుచూపులకు ప్రతీకలు. చాతక పక్షులు వాన చినుకుల నీటిని మాత్రమే తాగుతాయని, అందుకే అవి వానల కోసం ఆత్రంగా ఎదురుచూస్తుంటాయని పురాణ సాహిత్యం చెప్పేమాట! శాస్త్రీయ వాస్తవాలు మరోలా ఉన్నా, మన కవులు చాతకపక్షులను ఎదురుచూపులకు ప్రతీకగానే ఎంచుకున్నారు. 'హంసః పద్మవనం సమిచ్ఛతి యథా నీలాంబుదం చాతకః/ కోకః కోకనదప్రియ ప్రతిదినం చన్ద్రం చకోరస్తథా/ చేతో వాంఛతి మామకం పశుపతే చిన్మార్గమృగ్యం విభో/ గౌరీనాథ భవత్పదాబ్జ యుగళం కైవల్య సౌఖ్యప్రదం' అన్నారు ఆదిశంకరులు. తామరతూళ్లనే ఆహారంగా తినే హంసలు తామరలతో నిండిన సరోవరాల కోసం ఎదురుచూస్తాయి. వాన చినుకులను మాత్రమే తాగే చాతకాలు వానలు కురిపించే కారుమబ్బుల కోసం ఎదురుచూస్తాయి. వెన్నెలనే ఆహారంగా తీసుకునే చాతకాలు చంద్రోదయం కోసం ఎదురుచూస్తాయి. అలాగే అసలైన భక్తుడు పరమేశ్వరుడి సాన్నిధ్యం కోసం ఎదురుచూస్తాడట! శ్రీమహావిష్ణువు ద్వాపరయుగంలో కృష్ణావతారం దాల్చి భూలోకంలో పుట్టాడు. అప్పుడు వైకుంఠవాసులు శ్రీమహావిష్ణువు రాక కోసం లిప్త ఒక యుగంగా నిరీక్షించినట్లు దివాకర్ల వెంకటావధాని తన 'కలి పరాజయము'లో వర్ణించారు.

నిజానికి మనుషుల బతుకులే ఎదురుచూపుల మయం. బడికి వెళ్లే వయసులో సెలవుల కోసం ఎదురుచూపులు. కాలేజీ కుర్రకారుకు ప్రేమికుల కోసం ఎదురుచూపులు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాల కోసం ఎదురుచూపులు. ఉద్యోగులకు నెలకోసారి వచ్చే జీతాల కోసం ఎదురుచూపులు. జబ్బుచేసి ఆస్పత్రికి వెళితే అక్కడ వైద్యుడి దర్శనం కోసం ఎదురుచూపులు. జీవితంలో సింహభాగం ఇలా ఎదురుచూపులతోనే గడిచిపోతుంది. 'ఒకవేళ ఏవైనా ఎదురుచూపులు నెరవేరకపోతే ఆశ్చర్యపోవద్దు. దాన్నే మనం జీవితమంటాం' అని ఆస్ట్రియన్ సంతతికి చెందిన బ్రిటిష్ మానసిక విశ్లేషకురాలు అనా ఫ్రాయిడ్ వ్యాఖ్యానించింది. జీవితంలో చాలా ఎదురుచూపులు ఉంటాయి. సాధారణంగా వాటిలో నెరవేరనివే ఎక్కువ! ఎదురుచూపులు నెరవేరినప్పుడు సంతోషాన్నిస్తాయి. నెరవేరని ఎదురుచూపులు నిరాశలో ముంచేస్తాయి. 'ఈ లోకంలో మనుషులు భ్రమల్లో బతుకుతూ ఎల్లప్పుడూ ఏదో ఒకదాని కోసం ఎదురుచూస్తూనే ఉంటారు– ఒక్క ముక్కలో చెప్పాలంటే, కోరికలతో సతమతమవుతుంటారు' అన్నాడు బుద్ధుడు.

లోకంలో ఎవరి ఎదురుచూపులు వారికి ఉండనే ఉంటాయి. అయితే, సాహిత్యంలో ప్రేయసీప్రియుల ఎదురుచూపులకే అమిత ప్రాధాన్యమిచ్చారు మన కవులు. భావకవిత్వం సాహితీలోకాన్ని కమ్మేసిన కాలంలో మన కవులు ఊహాసుందరుల కోసం ఎదురుచూపులు చూస్తూ, వీసెల కొద్ది విరహగీతాలు రాశారు. 'ప్రబల కష్ట పరంపరల్ ప్రతిఘటించి/ నిల్చిపోయితి నీకయి నేటివఱకు!/ ఈ నిరీక్షణ పరిణామ మేమి యగునొ?' అని చివరకు శ్రీశ్రీ కూడా తన గీతపద్యాలలో ఎదురుచూపుల వగపును వడబోశారు. 'చిన్ని చిన్ని చిన్ని చెట్ల/ వన్నె వన్నె వన్నె పూల/ ఏరి ఇంద్రచాప మట్లు/ కట్టినాను నీకు మాల/ కాని, ఇచటికి ప్రియురాల!/ నీవింకను రావదేల?' అంటూ పఠాభి తన 'నిరీక్షణ'లోని నిట్టూర్పులతో సెగలు రేపారు. అష్టవిధ నాయికలలో విరహోత్కంఠిత తన నాయకుని కోసం అనుక్షణం ఎదురుచూస్తూ, విరహతాపాన్ని అనుభవిస్తూ ఉంటుంది. 'భర్త ఆఫీసునన్ బందియై పోయినన్/ ఎదురు తెన్నులు జూచు నింతి యిపుడు/... కాంతుడు రాకున్న క్షణము లుత్కంఠమ్మై/ భారాన క్షణములు కదలునెపుడు/... వేగిపోవును తన భర్త జాగుజేయ/ నామె యందమైన కనులె యలసిపోవు' అంటూ ఆధునిక విరహోత్కంఠితల ఎదురుచూపుల విరహతాపాన్ని కొనకళ్ల ఫణీంద్రరావు చమత్కారంగా రాశారు.

ఆముష్మికుల ఎదురుచూపులు భగవత్ సాన్నిధ్యం కోసం కావచ్చు, విరహిణుల ఎదురుచూపులు తమ నాయకుల కోసం కావచ్చు, భావకవుల ఎదురుచూపులు ఊహాసుందరీమణుల కోసం కావచ్చు గాని, సామాన్యులు మాత్రం ఎప్పుడొస్తాయో తెలియని మంచిరోజుల కోసం ఎదురుచూపులు చూస్తుంటారు. నడివేసవిలో వానల కోసం ఎదురుచూస్తే, కొద్దిరోజులకైనా నాలుగు చినుకులు కురుస్తాయేమో గాని, సామాన్యులు మంచిరోజుల కోసం ఎన్నాళ్లు ఎదురుచూపులు చూడాలో ఎవరూ చెప్పలేరు. అయినా, జనాలు ఎంతో ఆశతో మంచిరోజుల కోసం ఎదురుచూస్తూనే ఉంటారు. మనసులో ఆశల దీపాలు వెలుగుతున్నంత సేపూ ఎదురుచూపులు బాధించవు. ఎదురుచూపులు చూసే శక్తి కోసమైనా ఆశలను అడుగంటిపోకుండా కాపాడుకోవాలి.

ప్రజల కోసమే ప్రశ్నించే స్వేచ్ఛ

కామెంట్



కరణ్ థాపర్

తొమ్మిదేళ్ల సుదీర్ఘ కాలంలో మోదీ ఒక్కసారి కూడా పత్రికా సమావేశాన్ని నిర్వహించలేదనీ, జవాబుదారీతనం నుంచి ఆయన తప్పించుకోవాలని చూస్తున్నారనీ అనేకమంది ఒక అంతిమ భావనకు వచ్చేశారు. నిజానికి పరిణతి చెందిన ప్రజాస్వామ్య దేశాలు తమ నాయకులను ప్రజలకు జవాబుదారీగా చేసేందుకు పత్రికా సమావేశాలను కాక, 'రాజకీయ ఇంటర్వ్యూ'లకు ప్రాముఖ్యం ఇస్తాయి. ఏ అంశం మీద ప్రశ్నలు అడగాలన్నదీ, ఏ ప్రశ్నపై విడుపు లేకుండా పట్టుతో ఉండాలన్నదీ ఆ జర్నలిస్టు నియంత్రణలోనే ఉంటుంది. ఒక ప్రశ్నకు ప్రధాని నుంచి సంతృప్తికరమైన సమాధానం వచ్చే వరకు ఆ ప్రశ్నను కొనసాగించే హక్కును ఆ పాత్రికేయుడు కలిగి ఉంటాడు. నిజాన్ని నిగ్గు తేల్చే విధానం అది.

పత్రికా సమావేశాన్ని నిర్వహించడానికి దేశ ప్రధాని సుముఖంగా ఉన్నారంటే ప్రజలకు జవాబుదారీగా ఉండేందుకు ఆయన సంసిద్ధతను కనబరుస్తున్నారని ఇండియాలో మనం భావిస్తాం. ప్రధానికి నిజంగానే తన పాలనకు బాధ్యత వహించే ఉద్దేశం ఉందా, లేదా అనేదానికి అసలైన పరీక్ష... ఆయన ఒక పత్రికా సమావేశాన్ని ఏర్పాటు చేయడం, లేదా చేయకపోవడం. పత్రికా సమావేశంలో వందలాది మంది పాత్రికేయులకు ముఖాముఖీ బదులు ఇవ్వవలసి వచ్చినప్పుడు కఠినమైన ప్రశ్నలను ఎదుర్కోవలసి ఉంటుంది. అలాగే డొంక తిరుగుడు లేకుండా సమాధానాలు చెప్పవలసి వస్తుంది. అందుకే తొమ్మిదేళ్ల సుదీర్ఘ కాలంలో మోదీ ఒక్కసారి కూడా పత్రికా సమావేశాన్ని నిర్వహించలేదనీ, జవాబుదారీతనం నుంచి ఆయన తప్పించుకోవాలని చూస్తున్నారనీ అనేకమంది ఇప్పటికే ఒక అంతిమ భావనకు వచ్చేశారు.

వారి భావనతో ఒక్క క్షణమైనా నాకు నిమిత్తం లేనప్పటికీ, పత్రికా సమావేశాన్ని మోదీ దాటవేస్తూ రావడంపై నాకు తీవ్రమైన అభ్యంతరాలు ఉన్నాయి. ప్రపంచంలోని మిగతా ప్రజాస్వామ్య దేశాలలో నిజమైన జవాబుదారీతనాన్ని భిన్న పాత్రికేయ ప్రక్రియల ద్వారా సాధిస్తారు. ఆ విషయానికి తర్వాత వస్తాను. మొదట, పత్రికా సమావేశాల మీద మనకుండే విశ్వాసం ఎందుకు సన్నగిల్లుతున్నదో నన్ను వివరించనివ్వండి.

మొదటి విషయం. పత్రికా సమావేశంలో అనేక మీడియాల నుంచి వచ్చిన అనేకమంది ప్రతినిధులు ఉంటారు. వారిలో ప్రతి ఒక్కరూ తమదైన ప్రశ్న ఒకటి అడిగేందుకు ఆతురతతో ఉంటారు. చాలా వరకు అవన్నీ ఒక దానితో ఒకటి సంబంధం లేని వేర్వేరు ప్రశ్నలే అయి ఉంటాయి. గంటల పాటు పత్రికా సమావేశం జరుగుతున్నా ఈ వేర్వేరు ప్రశ్నల కారణంగా ప్రధానమంత్రి జవాబులు చెప్పడానికి ఎప్పుడో తప్ప ఒత్తిడికి లోనయే అవకాశం దాదాపుగా ఉండదు.

ప్రధాని ఎందుకు ఒత్తిడికి లోనవరో చెప్తాను చూడండి. ప్రధాని పత్రికా సమావేశాలలో ఒక జర్నలిస్టుకు ఒక ప్రశ్న వేయడానికి మాత్రమే అనుమతి ఉంటుంది. ఒక జర్నలిస్టు ఒక ప్రశ్న అడిగాక, ఆ తర్వాతి జర్నలిస్టు తిరిగి అదే ప్రశ్న అడిగేందుకు ఉండదు. అప్పుడు ఆ జర్నలిస్టు తన ప్రశ్నను, ఒక్కోసారి తన సబ్జెక్టును కూడా మార్చుకోవలసి వస్తుంది. అంటే ఒకటే ప్రశ్నపై పట్టుపట్టడానికి తక్కువ అవకాశం ఉండటంతో ప్రధానిపై ఒత్తిడి పెరిగే పరిస్థితి ఉండదు. అప్పుడు ఆయన పొంతన లేని, లేదా సంపూర్ణం కాని సమాధానాలతో తప్పించుకోవచ్చు. ప్రధాని అజాగ్రత్తతో తొట్రుపడితేనో, లేదంటే ఏవైనా అవాస్తవాలు ఆయన నుంచి దొర్లితేనో తప్ప ఆయన పట్టుబడరు. అది



నక్క తోకను తొక్కడమే కానీ, నాణ్యమైన జర్నలిజం కాదు.

నిజానికి ప్రధాని పత్రికా సమావేశాన్ని టీవీలో ప్రత్యక్ష ప్రసారంగా చూస్తున్నప్పుడు ఆయన ఒక నేర విచారణను ఎదుర్కొంటున్న వ్యక్తిగా కనిపిస్తారు. కానీ అది భ్రమ. ఒకే ప్రశ్నను పదే పదే అడుగుతూ, ఆయన ఇచ్చే సమాధానాలను నిశితంగా పరిశీలించి వాటిలోని తప్పుల్ని, దాటవేతల్ని ఎత్తి చూపుతూ ఉన్నప్పుడు మాత్రమే ఆయన దిక్కుతోచని స్థితికి చేరుకుంటారు. అయితే ప్రధాని పత్రికా సమావేశాలలో ఇలా జరిగే అవకాశం ఉండనే ఉండదు.



మార్గరెట్ థాచర్‌ను ఇంటర్వ్యూ చేస్తున్న బ్రియాన్ వాల్డెన్

అందుకే పరిణతి చెందిన ప్రజాస్వామ్య దేశాలు తమ నాయకులను ప్రజలకు జవాబుదారీగా చేసేందుకు పత్రికా సమావేశాలకు కాక, 'రాజకీయ ఇంటర్వ్యూ'లకు ప్రాముఖ్యం ఇస్తాయి. ప్రధాని– జర్నలిస్ట్ ఇద్దరే ఎదురెదురుగా ఆ ఇంటర్వ్యూలో ఉంటారు. ముఖ్యంగా అక్కడ ఆ ఏక పాత్రికేయుడే... ప్రధాని జవాబులు చెప్పవలసిన ప్రశ్నలను నిర్ణయిస్తారు. ఏ అంశం మీద ప్రశ్నలు లేవనెత్తాలన్నదీ, అలాగే ఏ ప్రశ్నపై విడుపు లేకుండా పట్టుతో ఉండాలన్నదీ ఆ జర్నలిస్టు నియంత్రణలోనే ఉంటుంది. ఒక ప్రశ్నకు ప్రధాని నుంచి సంతృప్తికరమైన సమాధానం వచ్చే వరకు ఆ ప్రశ్నను కొనసాగించే హక్కును ఆ పాత్రికేయుడు కలిగి ఉంటాడు. నిజాన్ని నిగ్గు తేల్చే విధానం అది. అలాంటి జర్నలిస్టు విషయాలన్నీ బాగా తెలిసినవాడై, నిర్భీతి, దృఢచిత్తం గలవాడై ఉండాలని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కచ్చితంగా అయితే అతడు ప్రధాని ముందు నీళ్లు నమలనివాడై ఉండాలి.

జిహ్వకు చాపల్యాన్ని అంటించే రుచికరమైన బ్రిటిష్ రాజకీయ వర్గ అసంబద్ధ అంతర్గత కథనాలతో రాబ్ బర్లీ అనే బ్రిటిష్ టీవీ ప్రొడ్యూసర్ తాజాగా వండి వార్చిన 'వై ఈజ్ దిస్ లైయింగ్ బాస్టర్డ్ లైయింగ్ టు మి?' అనే పుస్తకంలో ఇలా రాశారు: ''రాజకీయ ఇంటర్వ్యూలు అనేవి అధికారంలో ఉన్నవారిని ప్రజలకు పూచీ పడేలా చేయడానికే తప్ప, నాయకులకు లబ్ధిని చేకూర్చడానికి కాదు. అవి ఉన్నది ప్రజా ప్రయోజనాల కోసం.''

దేశ అత్యున్నత పదవికి అభ్యర్థులైన వారి యోగ్యతను రాజకీయ ఇంటర్వ్యూల ద్వారా ఎలా అంచనా వేయవచ్చో బర్లీ ఈ పుస్తకంలో చెబుతున్నప్పటికీ, ఇప్పటికే అధికారం మాటున దాగి ఉన్నవారికి కూడా ఆయన మాట వర్తిస్తుంది. ''అటువంటి ఇంటర్వ్యూలు మన రాజకీయ సంస్కృతి స్వభావం, సమర్థత, విశ్వసనీయతలను బహిర్గతం చేయడానికి తోడ్పడే ఉత్తమ సాధనాలు. వాటి గురించి మనం గట్టిగా అడగాలి.''

మోదీ కూడా రాజకీయ ఇంటర్వ్యూలు ఇచ్చారు. నిజానికి చాలానే ఇచ్చారు. ప్రశ్న ఏమిటంటే, ఆయన్ని ఇంటర్వ్యూ చేసిన జర్నలిస్టులు ఎలాంటివారు? ఎలాంటి అంశాలను వాళ్లు ప్రధాని ముందు లేవనెత్తారు? ఎంత త్వరగా వాళ్ల ప్రశ్నల గేలం ప్రధానిని విడిచి పెట్టింది? ఈ ప్రశ్నలన్నిటి సమాధానాల కోసం మునుపటి ఇంటర్వ్యూలను చూడండి. అవి మిమ్మల్ని నిరుత్సాహపరుస్తాయి. ఆ ఇంటర్వ్యూలు మోదీ తనేం చెప్పదలిచారో అవి చెప్పడానికీ, తరచూ ప్రతిపక్షాలను విమర్శించడానికీ కానుకగా అందివచ్చిన వేదికలు.

బ్రిటిష్ బ్రాడ్‌కాస్టర్‌లు జెరెమి పాక్స్‌మ్యాన్, బ్రియాన్ వాల్డెన్స్ తమ రాజకీయ ఇంటర్వ్యూల కారణంగానే ప్రత్యేకంగా నిలిచిపోయారు. వాల్డెన్ తన సంధింపులతో బ్రిటన్ మాజీ ప్రధాని మార్గరెట్ థాచర్‌ను గుక్క తిప్పుకోకుండా చేశారు. పాక్స్‌మ్యాన్ అప్పటి బ్రిటిష్ విదేశాంగ కార్యదర్శి మైఖేల్ హోవర్డ్‌ను అడిగిన ప్రశ్ననే పన్నెండు సార్లు అడిగి ఆయన్ని గుటకలు వేయించారు. రెండు ఇంటర్వ్యూలలో అవి ముగిసే సమయానికి థాచర్, హోవర్డ్ సరైన సమాధానాలు చెప్పలేకపోయారు. చెప్పకపోవడం కాదు, చెప్పలేకపోవడం! ఆ చెప్పలేకపోవడమే ప్రజలకు వారిని జవాబుదారీగా చేసింది.

మన ప్రధానులను కూడా ఇంత కఠినంగా, కనికరం లేకుండా ప్రశ్నించగల రోజు వస్తే, మన రాజకీయాలలో నాటకీయమైన మార్పును చూస్తాం. మన రాజకీయ నాయకులు మారతారు. మనతో అబద్ధాలు చెప్పడం మానేస్తారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఒక్కసారి తినగానే...



48 గంటల క్రితం నా భార్య మామిడిపళ్లంటే మీకు ఎందుకంత పిచ్చి అంది. ఇండియాలో ఒక్క పండు తిన్నదో లేదో– అదేం విత్తనం, ఏ వాతావరణంలో పండుతుంది, ఈ 'ఇమామ్ పసంద్' రకం మేముండే సియాటిల్ (అమెరికా)లో ఎలా పండించాలి అని పరిశోధన చేయడం మొదలుపెట్టింది. – శివ్ రామ్‌దాస్, స్టోరీ టెల్లర్

ఇదేం అరాచకం?



చనిపోయిన తాలిబన్ మిలిటెంటు శరీరాన్ని వాహనం ముందర కట్టి బహిరంగంగా ఊరేగించారు పాకిస్తాన్ పోలీసులు. దక్షిణాసియా వేగంగా మధ్య యుగాల దిశగా వెనక్కి జారుతోంది. – అశోక్ స్వెన్, ప్రొఫెసర్

తాగడమే సమస్య



నాలుగు వేల కాలేయ మార్పిడి చికిత్సలను మేము ఇప్పుడే విశ్లేషించాం. మద్యపాన కాలేయ వ్యాధి కేసులు ఉన్నట్టుండి పెరగడం దిగ్భ్రమ కలిగించింది. మద్యపానం వల్ల కాలేయం పని చేయకపోవడం లేదా క్యాన్సర్ రావడం అనేది కాలేయ మార్పిడికి కారణమవుతున్న కేసులు 2017లో ఉన్న 21 శాతం నుంచి రెట్టింపై 40 శాతానికి పెరిగాయి. – అర్విందర్ సింగ్ సోయిన్, కాలేయ మార్పిడి సర్జన్

చదవకపోతే ఫర్లేదా?



ఎవరైనా జైల్లో ఉండకూడదంటే దానికి కారణం అతడు అమాయకుడై మాత్రమే ఉండాలి ; అంతేగానీ అతడు పీహెచ్‌డీ స్కాలర్, యువకుడు, బాగా చదువుతాడు అన్నవి కారణాలు కాకూడదు. ఒకరి చదువు గురించి ఎక్కువ నొక్కి చెబుతున్నామంటే, పెద్దగా చదువుకోని వాళ్లను నిరవధికంగా ఖైదు చేస్తే ఫర్లేదని పరోక్షంగా చెబుతున్నట్టు. – అమిత్ షాండీలియా, కాలమిస్ట్

మొదటి గోల



ప్రపంచంలోని ప్రతి ఒక్క విషయం లోనూ మొదటిస్థానంలో ఉండాలని విశ్వసించే వాళ్లలో భారతీయులు మొదటి స్థానంలో ఉంటారు. తాము అందరికంటే అత్యుత్తమం అని నిరూపించుకోవడం పట్ల ఇంత పట్టింపు ప్రపంచంలోని మరే దేశంలోని ప్రజలకు ఉండదు. ఈ నంబర్ పిచ్చి అనేది ఒక జాతీయ వ్యాధి. – రాజీవ్ త్యాగి, మాజీ ఫైటర్ పైలట్


సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

మంచి పుస్తకం

సినీ చరిత్రకు మాయా దర్పణం

ప్రపంచ సినిమా చరిత్ర... ఈ మాట అనడానికీ, వినడానికీ మామూలుగా అనిపించవచ్చు. కానీ, నూటికి పైగా దేశాలకు విస్తరించిన నూటపాతికేళ్ళ పైచిలుకు చరిత్రను ఒక పుస్తకంగా రాయడం కష్టం. చదివించేలా రాయడం మరీ కష్టం. నాలుగేళ్ళ పైగా ఎంత శ్రమ పడ్డారో కానీ, రచయిత అరిపిరాల సత్యప్రసాద్ ఆ కష్టాలను విజయవంతంగా అధిగమించారనడానికి నిదర్శనం – ఇటీవల వెలువడ్డ 'ప్రపంచ సినిమా చరిత్ర' పుస్తకం. క్రీస్తు పూర్వం 40 వేల ఏళ్ళ క్రితం ఆదిమ మానవుడు గుహలో బొమ్మ గీసి, తోటివారికి వేట గురించి చెప్పడానికి ప్రయత్నించినప్పటి నుంచి ఇవాళ్టి ఓటీటీ ప్రపంచం, రాబోయే కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కథతో వర్చ్యువల్ టెక్నాలజీతో తయారయ్యే భవిష్యత్ సినిమా దాకా ప్రపంచ సినీ గమనాన్ని చూపే మాయా దర్పణం ఈ పుస్తకం. సినిమాటోగ్రాఫ్ ఆవిష్కరణకు ముందు ఎడిసన్ తదితరులు చేసిన ప్రయోగాలు, గ్రిఫిత్ తీసిన ప్రసిద్ధ మూకీ చిత్రం 'బర్త్ ఆఫ్ ఎ నేషన్' అనేక విధాలుగా హాలీవుడ్ సినిమాకు ఒక నిర్దిష్ట సూత్రీకరణ చేసిన విధానం... ఇలా అనేక అంశాలను ఈ పుస్తకం అతి సులభంగా వివరిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఇండిపెండెంట్ సినిమా ఉద్యమానికి తొలి అడుగైన చార్లీ చాప్లిన్ తదిత రుల యునైటెడ్ ఆర్టిస్ట్స్ ఆవిర్భావం లాంటి సంఘటనలు ఆసక్తిగా చదివిస్తాయి.

జర్మన్ ఎక్స్‌ప్రెషనిజం, ఫ్రెంచ్ న్యూవేవ్, ఇటాలియన్ నియో రియలిజం – ఇలా వివిధ దేశాల్లో వచ్చిన సినీ ధోరణులు, అవి చూపిన ప్రభావాలు, మూకీలు, టాకీలు, ప్రపంచ సినీ పరిణామక్రమం – ఇవన్నీ ఈ పుస్తకం చదివి తెలుసుకోవచ్చు. చదివించేలానే కాక, చదువుతుంటే కళ్ళ ముందు దృశ్యాలు కనిపించేలా రాయడం ఈ రచన విశిష్టత. రచయిత ప్రత్యేకత. సినీ రచయితగా, నటుడిగా ప్రవేశం... కథ, నవల, అనువాదం – ఇలా వివిధ సాహిత్య ప్రక్రియల్లో అభినివేశం... రెండూ ఉన్నవారు కావడంతో అరిపిరాల ఈ భగీరథయత్నానికి న్యాయం చేశారు. సరళంగా చదివించారు. సంప్రదాయ రచనా విధానానికి భిన్నంగా, ఒక గైడెడ్ టూర్‌లా రాయాలనే ఆలోచన, రాసిన పద్ధతి అందుకు ఇతోధికంగా ఉపకరించాయి.



అయితే, కొండను అద్దంలో చూపే శ్రమతో కూడిన ప్రయత్నం కావడం వల్ల సంఘటనల్ని వివరించే క్రమంలో స్థలకాలాల విషయంలో అటూ ఇటూ కుప్పిగెంతులు, కప్పదాట్లు తప్పలేదు. సమాచారాన్ని మరికొంత సూక్ష్మంగా, దేనికదిగా వర్గీకరణ చేసి ఉండాల్సింది. కంటికి శ్రమ లేకుండా పేజీల అలంకరణలో జాగా నిస్తూ జాగ్రత్తలు తీసుకుంటే పుస్తక పఠనీయత ఇంకా పెరిగి ఉండేది. కానీ ఇప్పటికే 680 పేజీల బృహత్ గ్రంథంగా తయారైంది గనక, ఆ లగ్జరీ లేకపోయి ఉండవచ్చు. అయినా అదేమీ మరీ పెద్ద లోపమనిపించకుండా, ఆసక్తిని నిలపడం ఈ రచనలో విశేషం.

నిజానికి, భారతీయ సినిమాపై ఎక్కువగా, ప్రపంచ సినిమాపై కాస్తంత తక్కువగా... తెలుగులో ఇప్పటికే పలు పుస్తకాలున్నాయి. విషయంలో, వివరించిన విధానంలో వాటికి భిన్నంగా ఉండడం ఈ 'ప్రపంచ సినిమా చరిత్ర'ను ప్రత్యేకంగా నిలిపే అంశం. సరళమైన ఈ రచన సామాన్య సినీ ప్రియులకు సైతం ప్రపంచ సినిమాపై ప్రాథమిక అవగాహనను పెంచుతుంది. సముద్రాన్ని దోసిట్లో పడుతుంది. మంచి పుస్తకాల్ని అందించడంలో నాలుగేళ్ళుగా ముందుంటున్న ఆన్వీక్షికి పబ్లిషర్స్ సమర్పించిన ఈ వందో ప్రచురణ సినీ, పుస్తక ప్రియులిరువురికీ మండు వేసవిలో మంచి మామిడి పండు! – రెంటాల జయదేవ

పిల్లలకు ఏం నేర్పాలి? ఎవరు నేర్పాలి?

అభిప్రాయం



వి.వి. రమణ

విలువలతో కూడిన విద్యను విద్యార్థులు, భావితరాల వారు నేర్చుకో లేకపోతే రాబోవు సమాజం అతిపెద్ద ఉపద్రవాన్ని ఎదుర్కొంటుంది. నేడు సమాజంలో కుటుంబ విలువలు, సామాజిక విలువలు, రాజకీయ విలువలు, మీడియా విలువలు, విద్యాపరమైన విలువలు ఇలా... అన్ని రకాల విలువలు పతనం చెందుతూ ఉన్నాయి. వాటిని వ్యక్తి గమనించి మార్పు చెందుతున్నాడు. వ్యక్తి నుండి ప్రారంభమయ్యే మార్పు అతని ఆలోచనల నుండే ప్రారంభమవుతుంది. ఆలోచన ఆచరణగా మారుతుంది. ఆచరణ అలవాటుగా, అలవాటు స్వభావంగా, ఆ స్వభావమే వ్యక్తి వ్యక్తిత్వం అవుతుంది. విలువలతో కూడిన వ్యక్తిత్వాన్ని బోధించడానికి గురువులు మార్గదర్శకులుగా ఉంటారు. ఇక్కడ గమనించవలసిన విషయమేమంటే గురువులు బోధన ద్వారా వ్యక్తిలో కొంతవరకు మాత్రమే విలువలు పెంపొందించగలరు. అదే ఆచరణ ద్వారా పూర్తిస్థాయిలో వారిలో విలువలను ప్రోదిచేయవచ్చు.

పాశ్చాత్య దేశాలలో వివాహం ఇద్దరు వ్యక్తుల మధ్య జరుగుతుంది. భారతదేశంలో వివాహం రెండు కుటుంబాల మధ్య జరుగుతుంది. అందుకే భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రఖ్యాతి గాంచింది. కుటుంబంలో సామరస్యం, కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలు, ఒకరి భావాలను ఒకరు గౌరవించుకోవడం వంటి విషయాలను తల్లితండ్రులు పిల్లలకు గురువులుగా బోధిస్తున్నారు. కానీ ఇటీవలకాలంలో జీవనం యాంత్రికత్వాన్ని సంతరించుకుని కుటుంబ సభ్యులు అంతా కలిసి భోజనం చేసే పరిస్థితే లేకుండా పోయింది. ఇక విలువల గురించిన చర్చలు ఎప్పుడు జరగాలి?

ఒక సమాజం ఆమోదించిన, అంగీకరించిన ఆదర్శాలు, నియమాలు, ప్రవర్తనలనే సామాజిక విలువలు అంటారు. 'మంచి విలువలు గల వ్యక్తుల వలనే మంచి సమాజం నిర్మాణం అవుతుంది'. ఇది ఎలా సాధ్యం అంటే కేవలం 'సామాజిక విలువల'ను బాధ్యతగా పాటించడం ద్వారా మాత్రమే. ఈ సామాజిక విలువలను పూర్తిస్థాయిలో క్లాస్ రూమ్‌లో బోధించేది ఉపాధ్యాయుడే అయినప్పటికీ .. సమాజంలో ఉన్నత పదవులలో ఉన్నవారూ 'విలువలను ఆచరణ ద్వారా' ప్రజలకు స్ఫూర్తినివ్వాలి.



విద్య విషయానికి వస్తే తల్లితండ్రులకు 'విద్య విలువలు' అర్థమవ్వడం లేదు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి కంటే నేడు మన దేశంలో అక్షరాస్యత రేటు పెరిగింది. అయినప్పటికీ అవినీతి కూడా పెరిగింది. విద్యావంతులు, అక్షరాస్యత రేటు పెరిగితే అవినీతి తగ్గాలి కదా! మరి ఎందుకు పెరిగింది? విలువలతో కూడిన విద్య లేనందునే! విద్య ప్రధాన లక్ష్యం 'విలువలను పెంపొందించడమే'. భారతదేశానికి 'వ్యక్తులను నిర్మించే విద్య' కావాలన్నారు స్వామి వివేకానంద. తల్లితండ్రులు విలువల గురించి కాక మార్కులూ, ర్యాంకుల గురించే ఉపాధ్యాయులతో చర్చించడం శోచనీయం.

అబ్రహాం లింకన్ ఒకప్పుడు అమెరికా అధ్యక్షుడు. తన బిడ్డను బడిలో చేరుస్తూ ఆ బిడ్డకు ఎలాంటి విలువలు నేర్పాలని తాను కోరుకుంటున్నారో ఒక లేఖ రాసి ఉపాధ్యాయునికి పంపించారు. అందులో... 'ఈ లోకంలో అందరూ న్యాయబద్ధులూ, సచ్ఛీలురూ కాదనే వాస్తవాన్ని మా పిల్లవాడికి చెప్పండి. అంతేకాదు ప్రతి యోగ్యుడిలో ఒక నాయకుడు ఉంటాడని చెప్పండి. రాజకీయ నాయకులలో స్వార్థపరులతో పాటు అంకితభావం కలవారు ఉన్నారని చెప్పండి. దగాకోరులతోపాటు ధీరోదాత్తులూ ఉన్నారని తెలపండి. శత్రువులతో పాటు నిజమైన మిత్రులూ ఉంటారని బోధించండి. కష్టపడే మనస్తత్వాన్ని అలవాటు చేయండి. అసూయా ద్వేషాలను దూరం చేయండి' అని రాశారు.

'విలువలతో కూడిన రాజకీయం ఉండాలి' అని గాంధీజీ ప్రబోధించారు. ప్రభుత్వ నేతలు విలువలు గలవారైతే దేశానికి మంచి జరుగుతుంది. క్లాస్ రూమ్‌లో గురువులు బోధించే రాజకీయ విలువలకు బయట కనబడే రాజకీయ విధానాలకు పొంతనే లేదు. సిద్ధాంతపరంగా ఒక పార్టీ మరొక పార్టీపై విమర్శించుకోవడం సహజం. కానీ నేడు వ్యక్తిగత ద్వేషాలతో విమర్శలకు దిగుతున్నారు. వీటిని భావితరాల విద్యార్థులు గమనిస్తున్నారని అనుకోవడం లేదు. రాజకీయ విలువలను కాపాడేందుకు ఆయా పార్టీ లీడర్స్ తమ తమ అభ్యర్థులకు దిశా నిర్దేశం చేయాలి. భావితరాల వారికి 'రాజకీయ విలువలు ఆచరించే గురువులుగా మారాలి'. విలువల నిలయాలుగా విద్యాలయాలు, కుటుంబాలు విలసిల్లితే భావిపౌరులు ఆణిముత్యాల్లా తయారవుతారు. అప్పుడు దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలు తొలగిపోతాయి.

వ్యాసకర్త ఉపాధ్యాయులు
(నేడు పాఠశాలలు తెరుస్తున్న సందర్భంగా)

నీకు నీవే!

'ఎవరికెవరు ఈ లోకంలో' అన్న సినీకవి మాటలు నిజం. 'నీకు నీవే' దిక్కు అన్నది నిజం. ఒకసారి తీవ్రమైన నిరాశా నిస్పృహలతో ఉన్న భక్తుడు తను ఎంతగానో ఆరాధించే గురూజీ దగ్గరకు వెళ్లి... 'స్వామీ నాకు ఏదైనా తాయెత్తు ఇవ్వండి' అని అడిగాడు. స్వామీజీ ఓ రాగి రేకు ఇచ్చాడు. ఇది నీ ఇంట్లో ఉంచుకుంటే శుభం కలుగుతుందని చెప్పాడు. భక్తుడు తన సమస్యలకు పరిష్కారం తాయెత్తు వలన కలిగిందని కొన్నాళ్ల తర్వాత గురూజీని కలిసి చెప్పాడు. అందుకు గురువుగారు 'కాదు సమస్యలకు పరిష్కారం కనుగొన్నది నీవు. కేవలం నీకు నీపైన విశ్వాసాన్ని మాత్రమే నేను కలిగించాను. తాయెత్తు అనేది అందుకు ఓ మార్గం' అన్నారు.

'మిత్రమా! దేనికోసం విలపిస్తున్నావు? సర్వశక్తులూ నీలో ఉన్నాయి. ఆదిశంకరాచార్యుల వారు



శ్రద్ధను 'ఆస్తిక్య బుద్ధి' అన్నారు. అంటే ఉన్నది అనే నిశ్చయ భావన. శ్రద్ధ ఉన్నత లక్ష్యాల దిశగా మనిషిని ప్రయాణింపజేస్తుంది. 'స్వావలంబన' దిశగా ప్రతీ వ్యక్తీ ప్రయత్నం చేయాలి. ఆలోచించే శక్తి లేని పశుపక్ష్యాదులు సహితం తమకు తామే స్వయంగా నిర్ణయించుకుంటాయి. మరి ఎంతో జ్ఞాన సంపద కలిగిన మనిషి? పరావలంబనం ఒక బలహీనత. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనగలిగే ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం మనిషిని ఉన్నతుణ్ణి చేస్తాయి.

భగవద్గీత 'ఎవరి శ్రద్ధ ఎటువంటిదో వారు అటువంటివారు' (యోయత్ శ్రద్ధస్స ఏవనః) అని బోధిస్తుంది. శ్రద్ధ 'నిన్ను నీవు' తెలుసుకొనే ఓ గణిత సూత్రం. పులి ఎదురుగా వస్తే 'తనని తాను రక్షించుకునే మార్గం' వెతుకుతాడు. అతి విశ్వాసం ఉంటే ఎదురెళ్లి ప్రాణాలు కోల్పోతాడు. శక్తిని సరిగ్గా అంచనా వేసుకోగలిగిన వాడే విజేత.

– భమిడిపాటి గౌరీశంకర్

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.నవమి ప.1.33 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర సా.4.55 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** తె.4.26 నుండి 5.58 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.27 నుండి 1.18 వరకు, తదుపరి ప.3.05 నుండి 3.55 వరకు, **అమృతఘడియలు:** ప.12.23 నుండి 1.54 వరకు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.30.

క్లుప్తంగా...

అప్పన్న సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



కప్ప స్తంభానికి మొక్కుతున్న న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్‌కౌల్

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ధ్వజ స్తంభం వద్ద అర్చకులు వీరికి ఘన స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ దంపతులు ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో న్యాయమూర్తి పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఈవో త్రినాథరావు అందజేశారు. అలాగే రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాదరావు, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు స్వామిని దర్శించుకున్నారు.

రామ్‌రాజ్ షోరూం ప్రారంభం



కస్టమర్లకు వస్త్రాలు అందిస్తున్న వెంకటేష్, చిత్రంలో సంస్థ చైర్మన్ కేఆర్ నాగరాజన్

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): రామ్‌రాజ్ కాటన్ సంస్థ సంప్రదాయ వస్త్రాలు తయారు చేస్తూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతోందని సినీ హీరో దగ్గుబాటి వెంకటేష్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పిన్నమనేని పాలిక్లీనిక్ రోడ్డులో ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ 250వ షోరూంను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కాటన్ దుస్తులు ధరిస్తే శరీరానికి హాయిగా ఉండటమే కాకుండా పర్యావరణాన్ని పరిరక్షించినట్లు అవుతోందన్నారు. నెల్లూరులో 100వ షోరూంను కూడా తానే ప్రారంభించానన్నారు. దక్షిణ భారత దేశమంతటా షోరూంలను నిర్వహిస్తూ వేలాది మందికి ఉపాధి చూపడం అభినందనీయమన్నారు. రామ్‌రాజ్ కాటన్ సంస్థ చైర్మన్ కేఆర్ నాగరాజన్ మాట్లాడుతూ ధోతీలు, షర్టులు, ఇన్నర్ వేర్‌లు, నైట్‌వేర్, ఫ్యాబ్రిక్స్, కిడ్స్ అండ్ ఉమెన్స్ వేర్‌లతో పాటుగా అన్ని రకాల శుభకార్యాలకు అవసరమైన వస్త్రాలు తమ షోరూంలో అందుబాటులో ఉంటాయన్నారు. షోరూం ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన కాంతార సినిమాలోని నృత్యాలు ఆకట్టుకున్నాయి.

వీళ్లకు వీర'తాళ్లు' వేయాల్సిందే

బ్రిటిషర్లతో 'తాడు'ముడి వేసుకున్న తాళ్లరేవు

- నౌకల్లో ఉపయోగించే భారీ మోకులు, పెద్ద పగ్గాల తయారీలో ప్రసిద్ధి
- రథాల పగ్గాలు తయారీలోనూ తాళ్ల రేవు గ్రామస్తులది అందెవేసిన చేయి
- ఏటా 900 టన్నుల తాళ్ల ఎగుమతి
- తాళ్లరేవు భారీ తాళ్లకు రెండున్నర శతాబ్దాలకు పైగా చరిత్ర
- కోరంగి ఓడ రేవు అంతరించినా.. నేటికీ కొనసాగుతున్న తాళ్ల తయారీ

భారీ ఓడలు సముద్రంలో లంగరు వేయాలన్నా.. ఆలయ వీధుల్లో రథాలు పరుగులు తీయాలన్నా.. ఆ ఊళ్లో తయారయ్యే భారీ తాళ్లు, పగ్గాలను వాడాల్సిందే. తాళ్ల తయారీలో యంత్రాలు రంగప్రవేశం చేసినా.. ఆ ఊరి కార్మికుల పనితనం ముందు దిగదుడుపే. నౌకల్లో ఉపయోగించే భారీ మోకులు.. తాళ్లు.. పగ్గాల తయారీకి వందల ఏళ్ల నుంచీ తాళ్లరేవు గ్రామం ప్రసిద్ధి చెందింది.



తాళ్ల తయారీలో నిమగ్నమైన కార్మికులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కాకినాడ–అమలాపురం మధ్య జాతీయ రహదారిపై వెళ్లే ప్రతి ఒక్కరి చూపు తాళ్లరేవు రాగానే టక్కున ఆగిపోతుంది. తాళ్లే కదా.. ఎక్కడైనా తయారవుతాయనుకుంటే పొరబడ్డట్టే. ఇక్కడ తయారయ్యే తాళ్లకు పెద్ద చరిత్రే ఉంది. పెద్ద, పెద్ద కర్మాగారాల్లో తయారయ్యే తాళ్లు ఇక్కడ చేతితో తయారుచేసే తాళ్ల ముందు నిలవలేవంటే ఆశ్చర్యమేస్తుంది. అత్యధిక నాణ్యత.. 50 శాతం తక్కువ ధరల్లో ఇక్కడ తాళ్లు లభిస్తాయి. పాత తాళ్లు కొత్తగా అలంకరించుకోవాలన్నా.. తక్కువ ధరకే అవి దొరకాలన్నా తాళ్లరేవు పేరును తలవాల్సిందే. సెకండ్ హ్యాండ్ (పాత తాళ్ల)ను రీ ప్రాసెసింగ్ చేసి కొత్తవిగా తయారు చేయడంలో చేయి తిరిగిన నైపుణ్యం అక్కడి వారి సొంతం.

200 ఏళ్ల క్రితం సంభవించిన జల ప్రళయంతో..

ఈస్ట్ ఇండియా కంపెనీ వ్యాపారం కోసం ఇక్కడకు వచ్చి స్థావరాలు ఏర్పాటు చేసుకోవడంతో ఇప్పుడున్న కోరంగి అభయారణ్య ప్రాంతం అప్పట్లో పట్టణంగా విరాజిల్లింది. అమెరికా, రష్యా, ఇరాన్, ఇరాక్ తదితర దేశాల నుంచి ఓడలు కోరంగి రేవు ద్వారానే ఎగుమతి, దిగుమతులు సాగించేవి. కోరంగి నుంచి కేంద్రపాలిత యానాం వరకు విస్తరించి ఉన్న సముద్ర తీరానికి ఓడలు, పెద్దపెద్ద బోట్లు రాకపోకలు సాగించేవి. 2 వేల నుంచి 20 వేల టన్నుల సామర్థ్యం గల ఓడలు సైతం ఇక్కడకు వచ్చేవి. సుమారు 200 ఏళ్ల క్రితం సంభవించిన జల ప్రళయంలో ఓడలు, ఓడరేవుతో సహా కొట్టుకుపోయాయి. అప్పట్లో వేటకు వెళ్లిన వందలాది మత్స్యకారులు మృత్యువాతపడ్డారు. ఇంటి యజమానులు మృత్యువాత పడటంతో జీవనోపాధి కోసం ఇక్కడి మహిళలు కొబ్బరి, తాటి నారతో తాళ్లు తయారుచేసి విక్రయించడం ప్రారంభించారు. అలా మొదలైన తాళ్ల తయారీ తాళ్లరేవులో కుటీర పరిశ్రమగా మారింది. ప్రస్తుతం మహిళలు, పురుషులు సైతం తాళ్లను తయారు చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంది. తాళ్లరేవు ప్రాంతంలో కొబ్బరి, తాటి, నైలాన్, ప్లాస్టిక్ తాళ్లను తయారు చేస్తున్నారు. అర అంగుళం నుంచి అడుగున్నర మందంతో భారీ తాళ్లను సైతం ఇక్కడ తయారు చేస్తున్నారు. ఓడలకు, ఫైబర్ బోట్లకు వినియోగించే తాళ్లు కూడా ఇక్కడ తయారవుతున్నాయి. రథాలకు వినియోగించే పగ్గాలను సైతం ఇక్కడే తయారు చేస్తున్నారు.

ఏటా 900 టన్నుల తాళ్ల ఎగుమతి

ఏటా 900 టన్నుల వరకు తాళ్లు ఇక్కడ తయారవుతున్నాయి. తెలంగాణ, గుజరాత్, పశ్చిమ బెంగాల్ తదితర ప్రాంతాలకు ఇక్కడి తాళ్లను ఎగుమతి చేస్తున్నారు. ఈస్ట్ ఇండియా కంపెనీ వ్యాపార లావాదేవీలు ప్రారంభించిన సందర్భంలో కోరంగిలో ఓడలు రాకపోకలకు వీలుగా ఓడ రేవును ఏర్పాటు చేయడమే తాళ్ల పరిశ్రమలు ఏర్పాటుకు దోహదం చేసింది.

మేడిది.. పెమ్మాడి వంశీకులతో మొదలై..

తొలుత ఈస్ట్ ఇండియా వ్యాపారులతో పెనవేసుకున్న తాళ్ల బంధం కాస్తా వారసత్వ సంపదగా మారింది. తొలినాళ్లలో తాళ్లరేవుకు చెందిన మేడిది, పెమ్మాడి వంశీయులు తాళ్లు తయారుచేసే వారు. తాళ్ల తయారీ వంశ పారంపర్యంగా మారి నాలుగు తరాలుగా నేటికీ కొనసాగుతుండటం విశేషం. ఇక్కడ తయారయ్యే తాళ్లను టన్నుల కొద్దీ చెన్నై, కేరళ, ముంబై, కోల్‌కతా, గుజరాత్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఓడలు, బోట్లలో వినియోగించిన అనంతరం వృథాగా వదిలేసే పగ్గాలను తక్కువ ధరకు తాళ్లరేవు గ్రామస్తులు వేలంలో కొనుగోలు చేస్తుంటారు. రాష్ట్రంలోని పలు పోర్టులతోపాటు ఇతర రాష్ట్రాల్లోని పోర్టులలో వేలం వేసే పాత తాళ్లను కొనుగోలు చేస్తుంటారు. వాటిని గ్రేడింగ్ చేసి.. శుద్ధిచేసి కొత్త తాళ్లు తయారు చేసి విక్రయిస్తున్నారు.



విక్రయానికి సిద్ధంగా వివిధ రకాల తాళ్ల ఉత్పత్తులు

బ్రిటిష్ కాలం నుంచీ..



బ్రిటిష్ కాలం నుంచి తాళ్లరేవు, కోరంగిలలో తాళ్లు తయారు చేస్తున్నాం. నాలుగు తరాలుగా తాళ్ల తయారీలో నిపుణులు ఇక్కడ ఉన్నారు. కోరంగిలో ఓడరేవు ఉండడంతో ఓడలు భారీ స్థాయిలో ఇక్కడికి వచ్చేవి. ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రతినిధులు, బ్రిటిషర్లు కోరంగిని వ్యాపార కేంద్రంగా ఎంచుకోవడంతో భారీ నౌకలు, బోట్లు, నావలను తాళ్లరేవులో తయారు చేసేవారు. అలా ఓడలకు అవసరమైన తాళ్లు, మేకులు తదితర పరిశ్రమలు అప్పట్లో కోరంగి పరిసర ప్రాంతాల్లో ఏర్పాటయ్యాయి. ఇప్పటికీ తాళ్ల తయారీని కొనసాగుతోంది.

– పెమ్మాడి కాశీ విశ్వనాథం, బోట్ల తయారీ యూనిట్ ప్రతినిధి

ప్రత్యేక ప్రావీణ్యత ఉంది



మా తాత ముత్తాతల నుంచి తాళ్లు తయారు చేస్తున్నాం. తాళ్ల తయారీయే వృత్తిగా కొనసాగుతోంది. రోజుకు రూ.300 నుంచి రూ.600 వరకు సంపాదిస్తాం. తాళ్ల తయారీకి సంబంధించి మాకు ప్రత్యేక ప్రావీణ్యత ఉంది. మా దగ్గర తాడు తీసుకెళ్లిన వారు మళ్లీమళ్లీ కొనుగోలు చేస్తుంటారు.

– మందపల్లి జ్యోతిబాబు, తాళ్ల తయారీ కార్మికుడు

కాపు ఉద్యమకారుడి కుటుంబానికి సీఎం బాసట

- ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5 లక్షలు విడుదల
- చెక్కు అందజేసిన మాజీ మంత్రి కన్నబాబు



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: కాపు రిజర్వేషన్ల ఉద్యమం సందర్భంగా 2016లో కాకినాడలో కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యకు పాల్పడిన కాపు ఉద్యమకారుడు చీకట్ల వెంకట రమణమూర్తి కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాసటగా నిలిచారు. కాపులకు రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో చంద్రబాబు హయాంలో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కిర్లంపూడి కేంద్రంగా కాపు ఉద్యమం ప్రారంభించారు. ఈ క్రమంలో తునిలో రైలు దహనం ఘటన మరునాడు వెంకట రమణమూర్తి కలెక్టరేట్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అప్పట్లో ఈ ఘటన సంచలనమైంది. అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే కాపులను ఇబ్బంది పెడుతోందని, చంద్రబాబు, పవన్ కల్యాణ్ కాపు రిజర్వేషన్లపై సమాధానం చెప్పాలని, కాపులకు రిజర్వేషన్లు ఇవ్వాలనే డిమాండ్‌తో తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానని వెంకట రమణమూర్తి రాసిన లేఖలో పేర్కొన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. లారీ డీజిల్ మెకానిక్‌గా పనిచేసే అతడి ఆత్మహత్యతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. మృతుడికి భార్య పార్వతి, కుమారుడు రాజేష్, కుమార్తె రాజేశ్వరి ఉన్నారు. వీరిని అప్పట్లో ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్ ఓదార్చారు. వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం సహాయ నిధి నుంచి చీకట్ల పార్వతి పేరిట రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఈ చెక్కును రమణయ్యపేటలోని తన క్యాంపు కార్యాలయం వద్ద మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదివారం వెంకట రమణమూర్తి కుమార్తె రాజేశ్వరి, కుమారుడు రాజేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ.. వెంకట రమణమూర్తి కుటుంబ పరిస్థితిని సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి రూ.5 లక్షల ఆర్థిక సహాయం పంపించి ఆదుకున్నారని చెప్పారు. వెంకట రమణమూర్తి కుమార్తె రాజేశ్వరి కాకినాడ 3వ డివిజన్‌లో వలంటీర్‌గా పని చేస్తోందన్నారు.

శ్రీశైలం డ్యాంను సందర్శించిన కేఆర్ఎంబీ చైర్మన్



శ్రీశైలం డ్యాం వద్ద శివనందన్‌కుమార్

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయాన్ని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) చైర్మన్ శివనందన్‌కుమార్ ఆదివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా శ్రీశైలం చేరుకున్న ఆయన ఉదయం శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లను దర్శించుకున్నారు. సాయంత్రం డ్యాంకు చేరుకుని టెలీమెట్రిక్ పని విధానం, క్రస్ట్‌గేట్ల పనితీరు, గేజింగ్ సెక్షన్‌లో నీటి వివరాల నమోదు, గ్యాలరీలో పంపింగ్ విధానాలను పరిశీలించారు. రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని ఇంజనీర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రాన్ని కూడా సందర్శించారు.

ఐదుగుర్ని బలిగొన్న రోడ్డు ప్రమాదం

- మరో 8 మందికి తీవ్ర గాయాలు
- టెంపో ట్రావెలర్‌ను ఢీకొట్టిన లారీ ట్యాంకర్
- తిరుపతి జిల్లా ఎస్వీ పురం టోల్‌ప్లాజా సమీపంలో దుర్ఘటన



ప్రమాదానికి గురైన టెంపో



గిరిజ, రేఖ మృతదేహాలు, శివకుమార్ (ఫైల్)

వడమాలపేట/తిరుమల: టెంపోలో వెళ్తున్న భక్తులను తిరుపతి జిల్లా ఎస్వీ పురం టోల్‌ప్లాజా సమీపంలో ఎదురుగా వస్తున్న టెంపో ట్రావెలర్ వాహనాన్ని హెరిటేజ్ మిల్క్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఐదుగురు మృతి చెందగా.. 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వడమాలపేట మండలం పుత్తూరు–తిరుపతి జాతీయ రహదారిపై అంజేరమ్మ కనుమ వద్ద ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తిరుపతిలోని ఎస్ఆర్ ఇండియా ప్రైమ్ ప్రాపర్టీస్ రియల్ ఎస్టేట్ నిర్వాహకులు సుబ్రహ్మణ్యం, రాజశేఖర్‌రెడ్డి వడమాలపేట మండలం ఎస్వీ పురంలోని అంజేరమ్మకు మొక్కు చెల్లించుకునేందుకు ఆదివారం మధ్యాహ్నం కారులో బయలుదేరగా.. వారి కార్యాలయంలో పనిచేసే 12 మంది సిబ్బంది టెంపో ట్రావెలర్‌లో బయలుదేరారు. టెంపో టోల్‌ప్లాజా దాటి అంజేరమ్మ ఆలయానికి వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న దానిని హెరిటేజ్ ట్యాంకర్ ఢీకొట్టింది. ప్రమాదంలో టెంపోలో ప్రయాణిస్తున్న 12 మందితోపాటు మిల్క్ ట్యాంకర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది, టోల్ ప్లాజా అంబులెన్స్‌లో క్షతగాత్రులను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ ఐరాల మండలానికి చెందిన రేవంత్ (44), ఆర్సీ పురానికి చెందిన గిరిజ (45) మృతి చెందారు. అక్కడి నుంచి క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ గంగాధర నెల్లూరుకు చెందిన హెరిటేజ్ మిల్క్ ట్యాంకర్ డ్రైవర్ శివకుమార్ (57), పాకాల మండలం శ్రీరంగరాజపురానికి చెందిన రేఖ (24), కుప్పానికి చెందిన అజయ్‌కుమార్ అలియాస్ అంజి (25) మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన నెల్లూరుకు చెందిన రాజశేఖర్, తిరుపతి కొత్తపల్లెకి చెందిన లతారెడ్డి, సత్యనారాయణపురానికి చెందిన కాంతిరేఖ, నారాయణరెడ్డి, రెడ్డిగుంటకు చెందిన కుమారస్వామిరెడ్డి, అన్నమయ్య జిల్లా రామాపురానికి చెందిన నరసింహులు, రాజంపేటకు చెందిన సుజాత, సత్యసాయి జిల్లాకు చెందిన ఆంజనేయులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే టెంపో డ్రైవర్ పరారయ్యాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వడమాలపేట పోలీసులు తెలిపారు.

ఘాట్ రోడ్డులో రెండు టెంపోలకు బ్రేక్ ఫెయిల్

కాగా, తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో రెండు టెంపో ట్రావెలర్ వాహనాలకు బ్రేక్ ఫెయిల్ కావడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. తిరుమల ట్రాఫిక్ డీఎస్పీ కొండయ్య తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు, చెన్నైకి చెందిన 12 మంది భక్తులు తిరుమల శ్రీవారి దర్శనం చేసుకుని ఆదివారం తిరుపతికి తిరిగి వెళుతుండగా.. మొదటి ఘాట్ రోడ్డుపై నాలుగో మలుపు వద్ద వాహనం బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది క్షతగాత్రులను అంబులెన్స్‌లో తిరుపతి రుయా ఆస్పత్రికి, అక్కడి నుంచి ఇద్దరిని టీటీ బర్డ్ ఆస్పత్రికి తరలించారు. మరో ప్రమాదంలో తిరుపతికి చెందిన టెంపో ట్రావెలర్ వాహనంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తిరుమల నుంచి తిరుపతికి దిగుతుండగా 9వ మలుపు వద్ద వాహనం బ్రేక్ ఫెయిలై రక్షణ గోడను ఢీకొని ఆగిపోయింది. ఈ ప్రమాదంలో భక్తులెవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ఉద్దానం చెంతకు ఆధునిక వైద్యం

▶ మొదటి పేజీ తరువాయి

దయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశారు. దయాలసిస్‌కు వెళ్లాల్సిన రోజు 108కు ఫోన్ చేస్తే అంబులెన్స్ ఇంటి వద్దకే వచ్చి తెవ్వయ్యను ఆస్పత్రికి తీసుకెళ్తోంది. నెఫ్రాలజిస్ట్ సమీపంలోని హరిపురం ఆస్పత్రికి షెడ్యూల్ ప్రకారం వస్తున్నారు. ఈ క్రమంలో ఏదైనా సమస్య ఉంటే వెంటనే వైద్యం అందుతోంది. మరోవైపు సీఎం జగన్ ఇతని పింఛన్‌ను రూ.10 వేలకు పెంచారు. వీటన్నింటికీ తోడు ఇప్పుడు త్వరలో పలాసలో కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి రానుంది. ఈ క్రమంలో తెవ్వయ్య మాట్లాడుతూ 'నా లాగా మహమ్మారి జబ్బుతో బాధపడుతున్న వారికి సీఎం జగన్ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పింఛన్ రూ.10 వేలకు పెంపుతో ఆర్థికంగా అండగా నిలవడమే కాకుండా, మా ఊళ్లకు శుద్ధి చేసిన నీటిని అందించడానికి చర్యలు తీసుకున్నారు. మెరుగైన వైద్యాన్ని మాకు చేరువ చేశారు. ఇంతకంటే మాకేం కావాలి?' అని ఆనందపడ్డాడు. ప్రభుత్వ చర్యల కారణంగా ఉద్దానం ప్రాంతంలో ఇలా ఎంతో మంది కిడ్నీ బాధితులకు ఊరట లభిస్తోంది.

అత్యాధునిక ఆస్పత్రితో భరోసా

కిడ్నీ వ్యాధులకు మూల కారణంగా భావిస్తున్న నీటి సమస్యకు చెక్ పెట్టడంతో పాటు వైద్య పరంగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. పలాసలో 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేపట్టారు. దీన్ని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. రూ.60 కోట్లతో నిర్మిస్తున్న రీసెర్చ్ సెంటర్, ఆస్పత్రి నిర్మాణ పనులు 85 శాతం మేర పూర్తయ్యాయి. తుది దశ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ర్యాంప్ బ్లాక్‌తో కలిపి మూడు బ్లాక్‌లుగా నాలుగు అంతస్తుల్లో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటవుతోంది. మొదటి అంతస్తులో క్యాజువాలిటీ, రేడియో డయాగ్నోసిస్, హాస్పిటల్ స్టోర్స్, సెంట్రల్ ల్యాబ్స్ ఉంటాయి. రెండో అంతస్తులో నెఫ్రాలజీ, యూరాలజీ, జనరల్ మెడిసిన్, సర్జరీ, మూడో అంతస్తులో డయాలసిస్, నెఫ్రాలజీ వార్డులు, నాలుగో అంతస్తులో ఓటీ కాంప్లెక్స్, పోస్ట్ ఆపరేటివ్/ఐసీయూ, యూరాలజీ వార్డ్స్, రీసెర్చ్ ల్యాబ్స్ ఉంటాయి. వీటన్నింటి కారణంగా కిడ్నీ రోగులకు భరోసా లభించనుంది.



హరిపురం సీహెచ్‌సీలో దయాలసిస్ వార్డు


అధునాతన పరికరాల సమకూర్పు

కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు అత్యంత అధునాతన పరికరాలను ప్రభుత్వం సమకూరుస్తోంది. కిడ్నీ వ్యాధులకు సంబంధించిన అన్ని రకాల చికిత్సలతో పాటు, పరిశోధనలు చేయడానికి వీలుగా పరికరాల సమకూర్పు ఉంటోంది. ఎంఆర్ఐ, సీటీ స్కాన్, 2డీ ఎకో, హైఎండ్ కలర్ డాప్లర్, మొబైల్ ఎక్సరే – డిజిటల్, ఏబీజీ అనలైజర్ పరికరాలతో పాటు, ఫుల్లీ రిమోట్ కంట్రోల్ ఐసీయూ కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో ఉండనున్నాయి. మొత్తంగా 117 రకాల వైద్య పరికరాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. ఇప్పటికే పలు పరికరాల సరఫరా కూడా మొదలైంది. రీసెర్చ్ సెంటర్‌లో శాశ్వత ప్రాతిపదికన 41 మంది స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యుల నియామకానికి ఇటీవల కేబినెట్ ఆమోదం తెలిపింది. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, యూరాలజీ, నెఫ్రాలజీ, ఇతర వైద్యులను ఇక్కడ నియమించనున్నారు.

ఇప్పటికే ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఇలా..

- గత ప్రభుత్వంలో తీవ్రమైన కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.2,500 ఇచ్చే పెన్షన్‌ను సీఎం జగన్ ప్రభుత్వం ఏకంగా రూ.10 వేలకు పెంచింది. ప్రతి నెల 1వ తేదీనే లబ్ధిదారుల గుమ్మం వద్దకు రూ.10 వేల చొప్పున వలంటీర్లు పెన్షన్ అందజేస్తున్నారు.
- టెక్కలి, పలాస, సోంపేట, కవిటి, హరిపురం ఆస్పత్రుల్లో 69 మెషిన్‌లతో డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. 2020లో హరిపురంలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. మరో 25 మిషన్లతో కొత్తగా గోవిందపురం, అక్కుపల్లి, కంచిలి, బెలగాంలో డయాలసిస్ సెంటర్లు మంజూరయ్యాయి. ఇలా వరుసగా 2019–20లో 37,454 సెషన్‌లు, 2020–21లో 46,162 సెషన్‌లు, 2021–22లో 54,520 సెషన్‌లు, 2022–23లో 55,708 సెషన్‌లు కిడ్నీ బాధితులకు డయాలసిస్ చేశారు.
- ఇచ్ఛాపురం, కంచిలి సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో 25 మిషన్‌లతో డయాలసిస్ సెంటర్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది.
- కిడ్నీ వ్యాధులపై వైద్య పరీక్షల కోసం ఉద్దానం ప్రాంతంలోని 18 పీహెచ్‌సీలు, ఐదు యూపీహెచ్‌సీలు, ఆరు సీహెచ్‌సీల్లో సెమీ ఆటో ఎనలైజర్లు, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్లు, యూరిన్ ఎనలైజర్లు అందుబాటులో ఉంచారు.
- టీడీపీ హయాంలో డయాలసిస్ రోగులకు 20 రకాల మందులే అందిస్తుండగా, అవి కూడా అరకొరగానే అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం ప్రతి ఆస్పత్రిలో 37 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.
- కొత్త కేసుల గుర్తింపునకు వైద్య శాఖ నిరంతరాయంగా స్క్రీనింగ్ కొనసాగిస్తోంది. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో)లకు ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించారు. వీరు ఈ ప్రాంతంలోని ప్రజలను స్క్రీనింగ్ చేసి, అనుమానిత లక్షణాలున్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించి దగ్గరలోని పీహెచ్‌సీలకు సీరమ్ క్రియాటిన్ పరీక్షలకు తరలిస్తున్నారు.


ఇబ్బందులు తొలగిపోతాయి



సంవత్సరం నుంచి నేను డయాలసిస్ చేయించుకుంటున్నాను. మా గ్రామానికి దగ్గరలోని హరిపురం ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ఉండటంతో రవాణా, వ్యయ ప్రయాసలు లేవు. డయాలసిస్ చేయించుకోవడానికి వెళ్లాల్సిన రోజు 108కు ఫోన్ చేస్తే అంబులెన్స్ ఇంటి వద్దకు వచ్చి ఆస్పత్రికి తీసుకుని వెళుతోంది. ప్రభుత్వం రూ.10 వేల పెన్షన్ కూడా ఇస్తోంది. షెడ్యూల్ ప్రకారం నెఫ్రాలజిస్ట్ హరిపురంకు వస్తున్నారు. మిగిలిన రోజుల్లో ఏదైనా అనారోగ్య సమస్య వస్తే శ్రీకాకుళం వెళ్లాల్సి వస్తుంది. ఇప్పుడు పలాసలో కిడ్నీ సెంటర్ ప్రారంభిస్తే ఆ ఇబ్బంది కూడా తొలగిపోతుంది.

– శ్రీరాములు, కిడ్నీ వ్యాధిగ్రస్తుడు, బేతాలపురం, శ్రీకాకుళం జిల్లా

నీళ్ల దిగులుండదిక..



కిడ్నీ వ్యాధి ప్రభావిత గ్రామాల్లో మా ఊరు కూడా ఒకటి. ప్రభుత్వం మా కోసం రక్షిత నీటి పథకం అందు బాటులోకి తెస్తోంది. పనులు దాదాపు పూర్తికావచ్చాయని చెబుతున్నారు. త్వరలో మా గ్రామానికి నీళ్లు వస్తాయి. బోర్ నీళ్లు తాగడం వల్లే కిడ్నీ జబ్బులు వస్తున్నాయని చాలా మంది చెప్పారు. దీంతో మేం పక్క ఊరి నుంచి సరఫరా చేస్తు న్న ఫిల్టర్ నీరు కొనుక్కుని తాగుతున్నాం. ప్రభుత్వమే ఉచితంగా కొళాయి ద్వారా మంచినీటిని సరఫరా చేయ బోతుండటం మాకెంతో ఊరట కలిగిస్తోంది. ఆ మహమ్మారి జబ్బుకు శాశ్వత పరిష్కారం చూపితే ఆయన మేలు ఎప్పటికీ మరువం.

– ఎం.సరోజిని, రంగోయి, శ్రీకాకుళం జిల్లా

వ్యాధిగ్రస్తులకు పెద్ద ఊరట

కిడ్నీ రీసెర్చ్ సెంటర్ భవన నిర్మాణం తుది దశలో ఉంది. మరోవైపు వైద్య పరికరాలు సమకూరుస్తున్నాం. త్వరలోనే రీసెర్చ్ సెంటర్ అందుబాటులోకి వస్తుంది. భవన నిర్మాణం, పరికరాల సమకూర్పునకు కలిపి రూ.60 కోట్ల మేర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఇది అందుబాటులోకి వస్తే కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పెద్ద ఊరట లభిస్తుంది.

– మురళీధర్ రెడ్డి, ఎండీ, ఏపీఎంస్ఐడీసీ

లోయలో పడిన యాత్రికుల వ్యాన్

- ఐదుగురికి గాయాలు.. అందరూ క్షేమమే
- తప్పిన పెను ప్రమాదం



క్షతగాత్రులను స్ట్రెచర్ సాయంతో లోయలో నుంచి పైకి తీసుకొస్తున్న 108 సిబ్బంది

చింతూరు (అల్లూరి సీతారామరాజు): యాత్రికులతో వెళ్తున్న వ్యాన్ అదుపు తప్పి లోయలో పడిన ఘటన మారేడుమిల్లి– చింతూరు ఘాట్‌రోడ్డులో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే... అనకాపల్లి జిల్లా మార్టూరుకు చెందిన 12 మంది భక్తులు రాముడిని దర్శించుకునేందుకు శనివారం రాత్రి వ్యాన్‌లో భద్రాచలం బయలుదేరారు. ఆదివారం ఉదయం మారేడుమిల్లి– చింతూరు ఘాట్‌రోడ్డులోని కనకదుర్గ గుడి సమీపంలో కిందకు దిగుతున్న క్రమంలో వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి సుమారు 150 అడుగుల లోయలో పడిపోయింది. అందులో ఉన్నవారంతా గాయాలతో బయటపడ్డారు. వీరిలో కొందరు అతి కష్టం మీద రహదారిపైకి చేరుకుని 108కు సమాచారం ఇచ్చారు. స్పందించిన 108 సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని లోయలో గాయాలతో ఉన్నవారిని పైకి తీసుకొచ్చారు. అక్కడి నుంచి క్షతగాత్రులను చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రంపచోడవరం పంపించారు. ఘటన జరిగిన ప్రాంతంలో ప్రమాదకరమైన మలుపు ఉంది. ఇక్కడ తరచూ వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మించి ప్రమాదాలు నివారించాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా...

గిన్నిస్ పెళ్లిళ్లు



జైపూర్: రాజస్తాన్ పెళ్లిళ్లలో రికార్డు సాధించింది. కేవలం 12 గంటల్లో 2 వేలకు పైగా జంటలకు ముడిపెట్టి గిన్నిస్ వరల్డ్ రికార్డులకెక్కింది. బారన్‌లో ఈ సామూహిక వివాహ కార్యక్రమం మే 26న జరిగినట్టుగా గిన్నిస్ వరల్డ్ బుక్ అధికారులు వెల్లడించారు. శ్రీ మహావీర్ గోశాల కళ్యాణ్ సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మెగా కార్యక్రమంలో హిందువులు, ముస్లిం జంటలు కూడా ఒక్కటయ్యారు. 2013లో 24 గంటల్లో 963 పెళ్లిళ్లు జరిపి యెమన్ పేరిట ఉన్న ఈ రికార్డుని బద్దలు కొడుతూ కేవలం 12 గంటల్లోనే 2,413 మంది జంటలకి వివాహం జరిపించారు. అప్పటికప్పుడు ఈ పెళ్లిళ్లను అధికారికంగా రిజిస్టర్ కూడా చేయించారు.

స్పేస్ ఎక్స్‌లో పద్నాలుగేళ్ల ఇంజనీర్

కాలిఫోర్నియా: ఎలన్ మస్క్‌కు చెందిన ప్రైవేటు అంతరిక్ష సంస్థ స్పేస్ ఎక్స్‌కి ఇకపై ఒక బుల్లి ఇంజనీర్ సేవలందించనున్నాడు. 14 ఏళ్ల వయసున్న కైరాన్ క్వాజీ అనే ఇంజనీర్‌కి ఉద్యోగమిచ్చింది. స్పేస్ ఎక్స్ నిర్వహించిన సాంకేతిక పరీక్ష, ఇంటర్వ్యూల్లో క్వాజీ ఉత్తీర్ణుడు కావడంతో ఇంజనీర్‌గా నియమించినట్టు సంస్థ వెల్లడించింది. పదకొండేళ్లకే క్వాజీ ఇంజనీరింగ్‌లో చేరాడు. కంప్యూటర్ సైన్స్‌లో పట్టా తీసుకున్న క్వాజీకి వెంటనే స్పేస్ ఎక్స్‌లో ఉద్యోగం లభించింది. అంగారక గ్రహంపైకి మనుషుల్ని తీసుకువెళ్లే ప్రాజెక్టులో క్వాజీ ఉన్నాడు.



అవి 2జీ, 3జీ, 4జీ పార్టీలు

కాంగ్రెస్, డీఎంకేపై అమిత్ షా ఆగ్రహం

వెల్లూరు: కాంగ్రెస్, డీఎంకే పార్టీలు వారసత్వ రాజకీయాలు సాగిస్తున్నాయని హోం మంత్రి అమిత్ షా విరుచుకుపడ్డారు. అవి 2జీ, 3జీ, 4జీ పార్టీలని ఎద్దేవా చేశారు. తాను 2జీ స్పెక్ట్రం కుంభకోణంపై మాట్లాడడంలేదని, ఆయా పార్టీల్లో రెండు, మూడు, నాలుగో తరాల గురించి మాట్లాడుతున్నానని వివరించారు. ఆ పార్టీలు పూర్తిగా అవినీతిలో కూరుకుపోయాయని మండిపడ్డారు. మారన్ కుటుంబం రెండు తరాలుగా, కరుణానిధి కుటుంబం మూడు తరాలుగా, సోనియా గాంధీ కుటుంబం నాలుగు తరాలుగా అవినీతికి పాల్పడుతోందని ధ్వజమెత్తారు. తమిళనాడులోని వెల్లూరులో ఆదివారం జరిగిన బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించారు.

ఎవరెస్ట్.. యమ డేంజర్!

మంచులో కూరుకుపోతున్న పర్వతారోహకులు ● విచ్చలవిడిగా అనుమతులు ఇస్తున్న నేపాల్ ప్రభుత్వం ● ఈ ఏడాది 12 మంది మృతి, ఏడుగురు గల్లంతు

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పర్వత శిఖరం మౌంట్ ఎవరెస్ట్. ఆకాశానికి నిచ్చెన వేసినట్టుగా వెండి కొండలా ధగధగలాడిపోతూ మంచుతో నిండిపోయిన ఈ పర్వత శిఖరం చేరుకోవడమంటే ప్రపంచాన్ని తమ పాదాక్రాంతం చేసుకోవడమే. అందుకే ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో అడుగడుగునా ప్రమాదాలు పొంచి ఉన్నా, ప్రాణాలతో తిరిగి వస్తామన్న భరోసా లేకపోయినా ప్రతీ ఏడాది ఎందరో సాహసికులు ఈ పర్వత శిఖరాన్ని చేరుకోవాలని తమ దేశ జెండాని పాతాలని ఆరాటపడుతుంటారు. మౌంట్ ఎవరెస్ట్‌ను తొలిసారి ఎక్కడం ప్రారంభించి 70 ఏళ్లయింది. 1953 సంవత్సరం మే 29న న్యూజిలాండ్‌కు చెందిన ఎడ్మండ్ హిల్లరీ భారత్‌కు చెందిన టెన్జింగ్ నార్గేలు ఎవరెస్ట్ శిఖరాగ్రం చేరుకున్నారు. ఈ 70 ఏళ్లలో కనీవినీ ఎరుగని మార్పులు వచ్చాయి. సాంకేతిక పరిజ్ఞానం పెరిగి, ఆధునిక సదుపాయాలు చోటు చేసుకోవడంతో ఎవరెస్ట్ అధిరోహించే వారి సంఖ్య భారీగా పెరిగింది.

ఎవరెస్ట్‌పై ట్రాఫిక్ జామ్

పర్వతారోహకులకు ఈ ఏడాది నేపాల్ ప్రభుత్వం విచ్చలవిడిగా అనుమతులు మంజూరు జారీ చేయడంతో ఎవరెస్ట్ అధిరోహణ మరింత ప్రమాదకరంగా మారింది. అసాధారణ రీతిలో 900 మంది పర్వతారోహకులకు అనుమతులు మంజూరు చేసింది. దీంతో కొండపై భారీగా ట్రాఫిక్ జామ్‌లు కనిపించాయి. శిఖరాగ్రం చేరుకోవాలంటే 26 వేల అడుగులు పైకి వెళ్లాలి. పది వేల అడుగులు దాటితే ఇంక మృత్యువు ముఖంలోకి అడుగు పెట్టినట్టే. అంత ఎత్తులో ఆక్సిజన్ సరిగా అందదు. ఊపిరి పీల్చుకోవడమే కష్టంగా మారుతుంది. రక్తం గడ్డ కట్టేలా వాతావరణం మైనస్ 20 డిగ్రీలకు పడిపోతుంది. శారీరకంగా ఎంత ఫిట్‌నెస్ ఉన్నప్పటికీ అనారోగ్య సమస్యలు చుట్టుముట్టి ప్రాణాలు పోతాయి. సముద్ర మట్టానికి అంత ఎత్తుకు చేరుకుంటే ఒక్కోసారి మెదడు, ఊపిరితిత్తులకు వాపు వచ్చి శరీరంపై స్వాధీనం కోల్పోతారు. ఈ సారి ఏకంగా 12 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఏడుగురు మంచులో గల్లంతయ్యారు. ఇటీవల ఈ స్థాయిలో మరణాలు ఎప్పుడూ సంభవించలేదు. ''ఒకేసారి పర్వతారోహకులు కొండ ఎక్కుతూ ఉంటే వారికి ఆక్సిజన్ అవసరం ఎక్కువగా ఉంటుంది. దానికి తగ్గట్టుగా ఆక్సిజన్ ఏర్పాటు చేయడం అత్యంత ముఖ్యం. మా ద్వారా ఎవరెస్ట్ అధిరోహించే పర్వతారోహకులెవరూ ఇప్పటివరకు ఏ సమస్య ఎదుర్కోలేదు''అని ఆస్ట్రియాకు చెందిన లుకాస్ ఫర్టెన్‌బాచ్ అనే కంపెనీ ప్రతినిధి వెల్లడించారు. ఈ ఏడాది తమ సంస్థ తరఫున 100 మంది దిగ్విజయంగా ఎవరెస్ట్ ఎక్కి వచ్చారని చెప్పారు.

వాతావరణ మార్పులతో పెరుగుతున్న ముప్పు

ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో వస్తున్న మార్పులు ఎవరెస్ట్ అధిరోహకులకు అతి పెద్ద ప్రతిబంధకంగా మారుతోంది. 1979 నుంచి చూస్తే గత 40 ఏళ్లలో ఎవరెస్ట్‌పై ఉష్ణోగ్రతలు సగటున 2 డిగ్రీల సెంటీగ్రేడ్ పెరిగాయి. దీంతో హిమానీ నదాలు కరిగి మంచు చరియలు విరిగి పడటం వంటి ప్రమాదాలు ముంచుకొస్తాయి. కొన్నేళ్లుగా ఎవరెస్ట్ అధిరోహించే వారు ఈ మార్పుల ప్రభావం విపరీతంగా ఉంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. మరో పదేళ్లలో ఎవరెస్ట్ ఎక్కే మార్గం ఎలా మారుతుందో ఊహకి కూడా అందడం లేదని నేపాల్ మౌంటనీరింగ్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఆంగ్ షెరింగ్ పేర్కొన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



ఎవరెస్ట్ ఎక్కే మార్గంలో పర్వతారోహకుల క్యూ

ఆదాయానికి ఆశపడి..?

నేపాల్‌కు పర్యాటకమే ప్రధాన ఆధారం. ఎవరెస్ట్ అధిరోహణ నుంచే అధికంగా ఆదాయం సమకూరుతుంది. పశ్చిమ దేశాల నుంచి వచ్చే పర్వతారోహకుల నుంచి11 వేల డాలర్లు (రూ.9 లక్షలు) చొప్పున వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు. అదే కాకుండా వెంట తీసుకు వెళ్లే ఆక్సిజన్, ఆహారం, గైడ్‌ల కోసం మొత్తంగా ఒక్కొక్కరికి 27 వేల డాలర్లు (దాదాపుగా రూ.22 లక్షలు) ఖర్చు అవుతుంది. అయితే నేపాల్ ప్రభుత్వం ఆదాయానికి ఆశపడే అనుమతులు ఎక్కువగా ఇస్తున్నామన్న ఆరోపణల్ని తోసిపుచ్చింది. ప్రతీ పర్వతారోహకుడి ప్రాణ రక్షణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, బేస్ క్యాంప్‌లో వైద్యులు, అధికారుల బృందం ఈ సాహస యాత్రను పర్యవేక్షిస్తుందని స్పష్టం చేసింది.

ఏదైనా సాధ్యమే

ప్రపంచంలో ఎవరెస్ట్ మ్యాన్‌గా పేరు పొందిన నేపాల్‌కు చెందిన షెర్పా కామి రిటా 28 సార్లు ఎవరెస్ట్ ఎక్కిన వ్యక్తిగా నిలిచి తన రికార్డు తానే బద్దలు కొట్టాడు. ఈ ఏడాది వారం రోజుల తేడాలో రెండు సార్లు శిఖరాగ్రానికి చేరుకున్నాడు. తన రికార్డుని పసాంగ్ దావా అనే షెర్పా సమం చేయడంతో ఆ మరుసటి రోజే మళ్లీ ఎక్కి అత్యధికసార్లు ఎవరెస్ట్‌ని ఎక్కిన వ్యక్తిగా సరికొత్త రికార్డు నెలకొల్పాడు. ఇక బ్రిటన్‌కు చెందిన మాజీ సైనికుడు హరి బుధా మాగర్ కృత్రిమ కాలుతో ఎవరెస్ట్ ఎక్కిన వ్యక్తిగా అరుదైన ఘనత సాధించాడు. మనిషి తలచుకుంటే ఏదైనా సాధ్యమేనని నిరూపించాడు. ఒక మలేసియన్ పర్వతారోహకుడు అనారోగ్యం బారిన పడితే నేపాలీ గైడ్ గెల్జీ అతనిని మోసుకుంటూ కొండ దిగడం మరో అరుదైన ఫీట్‌గా నమోదైంది. ఎవరెస్ట్ శిఖరాగ్రానికి చేరితే ప్రపంచాన్నే జయించినంత ఆనందం వస్తుంది కాబట్టే ప్రాణాలకు తెగించి మరీ ఎవరెస్ట్ ఎక్కే వారి సంఖ్య ఏడాదికేడాది పెరుగుతోంది.

ఉగ్ర నెట్‌వర్క్‌లోకి చిన్నారులు, మహిళలు..!

ఐఎస్‌ఐ ప్రమాదకర పన్నాగాన్ని వెల్లడించిన ఆర్మీ



శ్రీనగర్: భారత్‌లో ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న పాకిస్తాన్ నిఘా సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ) మరో ప్రమాదకర పన్నాగాన్ని అమలు చేస్తోంది.కశ్మీర్ లోయలో ఉగ్రవాదుల సంప్రదాయ సమాచార నెట్‌వర్క్‌ను సైన్యం దాదాపు నిర్వీర్యం చేసింది. దీంతో ఐఎస్ఐ మరో ప్రత్యామ్నాయాన్ని తీసుకువచ్చింది. దీని ప్రకారం ఉగ్ర మూకల మధ్య సమాచార మార్పిడికి మహిళలు, బాలికలు, మైనర్లను పావులుగా వాడుకుంటోంది. ఇటీవలి కాలంలో ఇందుకు సంబంధించిన పలు ఆధారాలు తమకు దొరికాయని శ్రీనగర్ కేంద్రంగా పనిచేస్తున్న 15 కార్ప్స్ లెఫ్టినెంట్ జనరల్ అమన్‌దీప్ సింగ్ అవుజ్లా తెలిపారు. ముఖ్యంగా సమాచారం ఇచ్చిపుచ్చుకునేందుకు, డ్రగ్స్, ఆయుధాల రవాణాకు మహిళలు, బాలికలు, మైనర్లను వాడుకోవడం అనే కొత్త ప్రమాదం వచ్చిపడిందన్నారు. ఉగ్రమూకలు సమాచార బట్వాడాకు ప్రస్తుతం సెల్‌ఫోన్ల వినియోగాన్ని గణనీయంగా తగ్గించాయని చెప్పారు. లోయలో ప్రశాంతతకు భగ్నం కలిగించేందుకు నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంబడి ఉగ్రమూకలు వ్యూహాలు పన్నుతుండటంతో బలగాలు సమన్వయంతో పనిచేస్తూ అప్రమత్తంగా ఉన్నాయన్నారు. కశ్మీర్‌లో చొరబాట్లు తగ్గినట్లు కనిపిస్తున్నప్పటికీ, పీర్ పంజాల్ దక్షిణ ప్రాంతం, పంజాబ్‌ల్లో పెరిగాయన్నారు. ఉత్తర కశ్మీర్‌లోని మచిల్‌లో ఇటీవలి చొరబాటు యత్నమే ఇందుకు తాజా ఉదాహరణ అని చెప్పారు. హింస పట్ల స్థానిక ప్రజల్లోనూ మార్పు కనిపిస్తుండటం ప్రశంసనీయమైన విషయమన్నారు. భద్రతా బలగాలకు కశ్మీర్ ప్రజలు సహకరిస్తున్నారని తెలిపారు.

క్యూబాలో చైనా గూఢచారులు

అమెరికా ఆరోపణలు

వాషింగ్టన్: కమ్యూనిస్ట్ చైనా తమ పొరుగు దేశం క్యూబాలో 2019 నుంచి గూఢచార స్థావరాన్ని నడుపుతోందని అమెరికా ఆరోపించింది. ప్రపంచవ్యాప్తంగా చైనా నిఘా సమాచార సేకరణ సామర్థ్యాలను బలోపేతం చేసుకుంటున్న ప్రయత్నాల్లో ఇదో భాగమని పేర్కొంది. పేరు వెల్లడించటానికి ఇష్టపడని ఓ అధికారి ఈ మేరకు డ్రాగన్ దేశంపై ఆరోపణలు గుప్పించారు. క్యూబాలోని చైనా నిఘా కేంద్రంపై అమెరికా నిఘా సంస్థలు ఓ కన్నేసి ఉంచాయని ఆయన తెలిపారు. చైనా నిఘా కార్యకలాపాల విస్తరణ ప్రయత్నాలను అడ్డుకునే ప్రయత్నాలను బైడెన్ ప్రభుత్వం ముమ్మరం చేసిందన్నారు. దౌత్యపరమైన, ఇతర మార్గాల్లో చేపట్టిన ఈ ప్రయత్నాలు కొంత సఫలీకృతమయ్యాయని ఆయన అన్నారు. అమెరికాకు అత్యంత సమీపంలో ఉన్న క్యూబా గడ్డపై నుంచి చైనా గూఢచర్యం కొత్త విషయం కాదు, ఇది ఎప్పటి నుంచో జరుగుతున్నదేనని తమ నిఘా వర్గాలు అంటున్నాయని ఆ అధికారి ఉటంకించారు. అట్లాంటిక్ సముద్రం, లాటిన్ అమెరికా, మధ్యప్రాచ్యం, సెంట్రల్ ఆసియా, ఆఫ్రికా, ఇండో–పసిఫిక్ ప్రాంతాల్లో నిఘా కేంద్రాల ఏర్పాటుకు చైనా యత్నిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే క్యూబాలోని నిఘా కేంద్రాన్ని 2019లో చైనా అప్‌గ్రేడ్ చేసిందని ఆ అధికారి వివరించారు. క్యూబాలో సిగ్నల్ ఇంటెలిజెన్స్ సేకరణ వ్యవస్థ ఏర్పాటుపై రెండు ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరినట్లు గురువారం వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో కథనం వచ్చింది. బదులుగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న క్యూబాకు భారీగా ముట్టజెప్పేందుకు చైనా సిద్ధమైందని కూడా అందులో పేర్కొంది. అయితే, వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనాన్ని క్యూబా డిప్యూటీ విదేశాంగ మంత్రి ఖండించారు.



ప్రజా విశ్వాసమే నా ఆస్తి

డిమాండ్లపై వెనక్కి తగ్గేదే లేదు ● సచిన్ పైలట్ స్పష్టీకరణ

దౌసా: ప్రజలకు న్యాయం చేకూర్చాలన్నదే తన ధ్యేయమని, అందుకోసం పోరాటం కొనసాగిస్తానని రాజస్తాన్ కాంగ్రెస్ అసంతృప్త నాయకుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ వెల్లడించారు. తన డిమాండ్లపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. ప్రజా విశ్వాసమే తన ఆస్తి అని తేల్చిచెప్పారు. వసుంధర రాజే నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న అవినీతిపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని సచిన్ పైలట్ డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై అశోక్ గహ్లోత్ ప్రభుత్వం స్పందించడం లేదని ఆయన మండిపడుతున్నారు. ఈ రోజు కాకపోయినా రేపైనా న్యాయం జరిగి తీరుతుందని సచిన్ పైలట్ అన్నారు. పరీక్షల నిర్వహణలో విఫలమైన రాజస్తాన్ పబ్లిక్ సర్వీసు కమిషన్‌ను పునర్వ్యస్థీకరించాలని కోరారు. పేపర్ లీకుల వల్ల నష్టపోయిన అభ్యర్థులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. దౌసా పట్టణంలోని గుర్జర్ హాస్టల్‌లో తన తండ్రి, కేంద్ర మాజీ మంత్రి రాజేశ్ పైలట్ విగ్రహాన్ని సచిన్ పైలట్ ఆదివారం ఆవిష్కరించారు.

వ్యోమగాముల మెదడుకు ముప్పు!

- ఆరు నెలలకుపైగా అంతరిక్షంలో ఉంటే జఠరికల్లో మార్పులు
- ఉత్పన్నమవుతున్న మానసిక అనారోగ్య సమస్యలు
- అమెరికా సైంటిస్టుల అధ్యయనంలో వెల్లడి



అంతరిక్ష ప్రయోగాలంటే అందరికీ ఆసక్తే. అంతరిక్ష రహస్యాలను ఛేదించడానికి వ్యోమగాములు (ఆస్ట్రోనాట్స్) శ్రమిస్తుంటారు. ఇందుకోసం సుదీర్ఘకాలం గగనతలంలోనే ఉండాల్సి వస్తుంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్), నాసా స్పేస్ షటిల్స్‌లో వ్యోమగాములు నెలల తరబడి గడపాల్సి ఉంటుంది. ప్రయోగాల్లో భాగంగా కొన్నిసార్లు సంవత్సరానికిపైగానే అంతరిక్షంలో ఉండిపోవాలి. భూమిపై గురుత్వాకర్షణ శక్తి ఉన్నట్లుగా అక్కడ ఎలాంటి గురుత్వాకర్షణ శక్తి ఉండదన్న సంగతి తెలిసిందే. మరి అలాంటి ప్రతికూల పరిస్థితుల్లో ఎక్కువ కాలం గడిపే వ్యోమగాముల శరీరంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయి? ప్రధానంగా మెదడులో జరిగే మార్పులేమిటి? దీనిపై అమెరికా సైంటిస్టులు అధ్యయనం చేశారు. ఆశ్చర్యకరమైన ఫలితాలు వెలువడ్డాయి. ఈ వివరాలను 'సైంటిఫిక్ రిపోర్ట్స్' జర్నల్‌లో ప్రచురించారు.

- అధ్యయనంలో భాగంగా 30 మంది ఆస్ట్రోనాట్స్ బ్రెయిన్ స్కానింగ్‌లను క్షుణ్నంగా పరిశీలించారు. అంతరిక్షంలోకి వెళ్లడానికి ముందు, వెళ్లివచ్చిన తర్వాత బ్రెయిన్ స్కానింగ్‌లను సేకరించి, పరిశీలించారు.
- 30 మందిలో 8 మంది రెండు వారాల పాటు అంతరిక్షంలో ఉన్నారు. 18 మంది ఆరు నెలలు, నలుగురు దాదాపు సంవత్సరంపాటు అంతరిక్షంలో ఉండి వచ్చారు.
- ఆరు నెలలకుపైగా అంతరిక్షంలో ఉన్న వ్యోమగాముల మెదడులోని జఠరికలు(వెంట్రికల్స్) కొంత వెడల్పుగా విస్తరించినట్లు గుర్తించారు. ఈ మార్పు చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఉందంటున్నారు.
- మెదడులోని ఖాళీ భాగాలనే జఠరికలు అంటారు. ఇందులో సెరిబ్రోస్పైనల్ ద్రవం ఉంటుంది. వర్ణ రహితమైన ఈ ద్రవం మెదడుచుట్టూ నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. మెదడుకు రక్షణ కల్పిస్తుంది. వ్యర్థాలను తొలగిస్తుంది.
- జఠరికల విస్తరణ వల్ల మెదడులోని కణజాలం ఒత్తిడికి గురవుతున్నట్లు సైంటిస్టులు భావిస్తున్నారు. దీనిపై మరింత అధ్యయనం జరగాల్సి ఉందని చెబుతున్నారు. జఠరికల్లో మార్పుల కారణంగా ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్న దానిపై పరిశోధకులు దృష్టి పెట్టారు.
- అంతరిక్షంలో ఎంత ఎక్కువ కాలం ఉంటే అంత ఎక్కువగా జఠరికల్లో మార్పులు సంభవిస్తాయని, తద్వారా మెదడు పరిమాణం పెరిగి, మానసిక సమస్యలు ఉత్పన్నమవుతాయని గమనించినట్లు సైంటిస్టు రేచల్ సీడ్లర్ చెప్పారు. ఆరు నెలలకుపైగా ఉన్నవారికే ముప్పు ఉన్నట్లు తేలిందని అన్నారు. అంతరిక్షం నుంచి తిరిగి వచ్చాక మెదడు ఎప్పటిలాగే సాధారణ స్థితికి చేరుకోవడానికి 3 సంవత్సరాలు పడుతున్నట్లు వివరించారు.
- భూమిపై మనిషి శరీరంలో రక్తప్రసరణ ఒక క్రమపద్ధతిలో సాగుతుంది. నరాల్లో కవాటాలు(వాల్వులు) ఉంటాయి. గురుత్వాకర్షణ శక్తితో రక్తం పైనుంచి పాదాల్లోకి ప్రవహించి, అక్కడే స్థిరపడకుండా ఈ కవాటాలు అడ్డుకుంటాయి. గురుత్వాకర్షణ శక్తి లేని అంతరిక్షంలో ఇందుకు వ్యతిరేక దిశలో జరుగుతుంది. రక్తం, ఇతర ద్రవాలు నరాల గుండా తలలోకి చేరుకుంటాయి. తలపై ఒత్తిడిని కలుగజేస్తాయి. దీనివల్ల మెదడులో జఠరికలు విస్తరిస్తున్నట్లు, కపాలంలో మెదడు పరిమాణం పెరుగుతున్నట్లు సైంటిస్టులు అంచనా వేస్తున్నారు.
- ఆరు నెలల్లోగా అంతరిక్షం నుంచి తిరిగివచ్చేవారికి ప్రమాదం ఏమీ లేదని, వారి మెదడులో చెప్పుకోదగ్గ మార్పులేవీ కనిపించడం లేదని పరిశోధకులు చెబుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఈ ఓటమిని పట్టించుకోకండి..!

జపాన్ రాయబారికి ప్రధాని మోదీ సూచన



న్యూఢిల్లీ: భారత్‌లో జపాన్ రాయబారి హిరోషి సుజుకి దంపతులు పుణెలో భారతీయ వంటకాల రుచిని ఆస్వాదించారు. 'భారత్‌లో స్ట్రీట్‌ఫుడ్ అంటే నాకెంతో ఇష్టం. కానీ, కారం కాస్త తక్కువుంటే బాగుంటుంది'అంటూ ఆయన ట్వీట్ చేశారు. ఎక్కువ కారం ఉన్న వడాపావ్‌ను తన భార్య ఇష్టంగా లాగించేయగా, తాను తక్కువ ఘాటున్న వడాపావ్‌తో సరిపెట్టుకున్నట్లు తెలిపారు. భార్యతో కలిసి మిసాల్ పావ్ తింటున్నట్లున్న వీడియోను కూడా ఆయన పోస్ట్ చేశారు. 'నా భార్య నన్ను ఓడించింది'అంటూ మిరపకాయ ఇమోజీతో ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌ను ప్రధాని మోదీని ఆకర్షించింది. ఆయన రీ ట్వీట్ చేస్తూ..'ఈ పోటీలో మీరు ఓడిపోయిన విషయం పట్టించుకోకండి. భారతీయ వంటకాల్లో వైవిధ్యాన్ని ఈ విధంగా సృజనాత్మకతతో ప్రజెంట్ చేయడం బాగుంది. మీ నుంచి ఇలాంటి వీడియోలు మరిన్ని రావాలని కోరుకుంటున్నా'అని పేర్కొన్నారు.

కర్ణాటక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

అధికారికంగా ప్రారంభించిన సీఎం సిద్దరామయ్య



శక్తిపథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య, డీకే శివకుమార్

సాక్షి, బెంగళూరు: రాష్ట్రంలోని మహిళలు, విద్యార్థినులు ప్రభుత్వ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పించే శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రారంభించారు. శక్తి యోజనకు సంబంధించి 'మహిళా సాధికారిత ప్రయాణం' అనే నినాదంతో ఉన్న లోగో స్మార్ట్ కార్డును ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆదివారం విడుదల చేశారు. దీనికి సంబంధించిన స్టిక్కర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ తాము ఎన్నికల ముందు ఇచ్చిన ఐదు గ్యారెంటీ స్కీములను ఎంత కష్టం వచ్చినా అమలు చేసి తీరుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో 5 గ్యారెంటీ హామీ పథకాలను ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో మొట్టమొదటి పథకమే ఈ శక్తి. ఈ పథకంతో రోజుకి 41.8 లక్షల మందికి పైగా మహిళ ప్రయాణికులకు లబ్ధి చేకూరుతుంది. ఏడాదికి రాష్ట్ర ఖజానాకు రూ.4,052 కోట్లు ఖర్చు అవుతుందని ఒక అంచనా.

లవ్ జిహాద్‌కు మదర్సాలే కేంద్రాలు

సాధ్వి ప్రాచీ వివాదాస్పద వ్యాఖ్యలు

బరేలీ: 'లవ్ జిహాద్, ప్రపంచ కలహాలకు కేంద్రాలకు మారిన మదర్సాలను మూసివేయాలని వీహెచ్‌పీ నేత సాధ్వి ప్రాచి వ్యాఖ్యానించారు. 'హిందువులు డబ్బు సంపాదన గురించే ఆలోచిస్తారు. ఒక ప్రత్యేకవర్గం మాత్రం భారత్‌ను పాలించాలని ఆలోచిస్తుంటుంది. వెయ్యేళ్లు భారత్‌ను పాలించడమే వారి ఎజెండా'అని యూపీలోని బరేలీలో ఆదివారం ఆమె మీడియాతో అన్నారు. 'లవ్ జిహాద్ మదర్సాల నుంచే మొదలవుతోంది. అక్కడ్నుంచే వ్యాప్తి చెందుతుంది. దేశంలో మదర్సాలు మూసేసిన రోజున లవ్ జిహాద్ ఉనికిలోనే ఉండదు. అప్పుడు ఒక్క భారతదేశంలోనే కాదు, ప్రపంచం మొత్తంలో శాంతి సామరస్యాలు వెల్లివిరుస్తాయి'అని ఆమె మీడియాతో అన్నారు.

ఆమె సేవ అనూహ్యం



శవాన్ని తరలిస్తూ..

లక్నో: ఈ ఫొటోలో మహిళ పేరు వర్ష వర్మ. వయసు 44 సంవత్సరాలు. ఉత్తరప్రదేశ్‌లో లక్నోకు చెందిన ఆమెలో సమాజానికి ఏదో ఒక విధంగా సేవ చేయాలనే తపన ఉంది. దీంతో అయిదేళ్లుగా ఎవరూ చేయలేని ఒక అనూహ్యమైన పనికి పూనుకున్నారు. ఏక్ కోషిష్ ఏసీ భీ అనే సంస్థను స్థాపించి మార్చురీల్లో గుర్తు పట్టని మృతదేహాలకు శాస్త్రోక్తంగా అంతిమ సంస్కారం జరిపిస్తున్నారు. దీనివల్ల మరణించిన వారిని గౌరవంగా పైలోకాలకు పంపిస్తున్నట్టుగా ఆమె భావిస్తున్నారు. 72 గంటల సేపు మృత దేహం కోసం కుటుంబ సభ్యులెవరూ రాకపోతే స్థానిక అధికారులు ఆమెకే చెబుతారు. ఇలా వారానికి సగటున మూడు మృతదేహాలకు వర్ష అంతిమ సంస్కారం నిర్వహిస్తున్నారు. ప్రపంచం నుంచి శాశ్వతంగా వెళ్లిపోయిన వారికి గౌరవప్రదంగా వీడ్కోలు పలకాలని వర్ష చెబుతున్నారు.

అతి తీవ్ర తుపానుగా బిపర్‌జోయ్

న్యూఢిల్లీ/అహ్మదాబాద్: అరేబియా సముద్రంలో ఏర్పడిన తుపాను 'బిపర్‌జోయ్' ఆదివారం ఉదయానికి అతి తీవ్ర తుపానుగా మారిందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. ఇది ఈ నెల 15 నాటికి గుజరాత్‌లోని కచ్, పాకిస్తాన్‌లోని కరాచీల మధ్య తీరాన్ని తాకే అవకాశం ఉందని అంచనా వేసింది. తుపాను తీరాన్ని తాకే ప్రాంతంపై రానున్న రోజుల్లో స్పష్టత వస్తుందని వివరించింది. ఈ మేరకు గుజరాత్‌లోని సౌరాష్ట్ర, కచ్ తీరాలకు తుపాను హెచ్చరికలు జారీ చేసింది. దీని ప్రభావంతో కచ్, ద్వారక, పోరుబందర్, జామ్‌నగర్, రాజ్‌కోట్, జునాగఢ్, మోర్బిల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ నెల 13–15 తేదీల్లో తీరం వెంబడి గరిష్టంగా గంటకు 150 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. తుపాను హెచ్చరికలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించింది. తుపాను షెల్టర్లను ఏర్పాటు చేసింది.

ఈ ఇంటర్నెట్ మాకొద్దు బాబోయ్..!

ఇండోనేసియాలో నినదిస్తున్న బదూయీ తెగ



కనెకేస్ గ్రామంలో పనిలో నిమగ్నమైన బదూయీ తెగ నేత కార్మికురాలు



కనెకేస్ గ్రామంలోని నది ఒడ్డున ఆడుకుంటున్న చిన్నారులు

జకార్తా: స్మార్ట్ ఫోన్‌లు, సోషల్ మీడియా లొచ్చాక ప్రపంచమే మారిపోయింది. ఎప్పుడు ఎవరిని చూసినా అన్ని పనులు మానేసి తమ ఫోన్‌ల్లో తలదూర్చి కాలం గడిపేస్తున్నారు. ఈ ఆన్‌లైన్ ప్రపంచం జనంపై చూపిస్తున్న వ్యతిరేక ప్రభావం నుంచి తమని తాము కాపాడుకోవడానికి ఇండోనేసియాలోని జావా దీవుల్లో నివసించే ఒక స్థానిక తెగ అసలు ఇంటర్నెట్ వద్దని నినదిస్తోంది. బాంటెన్ ప్రావిన్స్‌లో 26 వేల మంది వరకు ఉండే బదూయీ అనే వర్గం ప్రజలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తమకి వద్దే వద్దని అంటున్నారు. ఈ తెగ ప్రజలు మొత్తం మూడు గ్రామాల్లో నివసిస్తారు. తమ ప్రాంతంలో ఉండే టెలికాం టవర్లను తొలగించాలని అప్పుడు సిగ్నల్స్ రాక తాము ఆన్‌లైన్ ఉచ్చులో ఇరుక్కోమని వారి వాదనగా ఉంది. ఈ మేరకు గ్రామ పెద్దలు ప్రభుత్వ అధికారులకు ఒక లేఖ కూడా రాశారు. స్మార్ట్ ఫోన్ వల్ల దుష్ప్రభావాలు తమ జీవితంపై లేకుండా ఉండడానికే తాము ఈ ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఇంటర్నెట్ అందుబాటులో ఉంటే యువత అందులో కూరుకుపోతారని, ఇది వారి నియమబద్ధమైన జీవితంపై ప్రభావం చూపిస్తుందని ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఆందోళనను గుర్తించిన లెబాక్ జిల్లా అధికారులు ఈ విషయాన్ని ఇండోనేసియా సమాచార శాఖ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజలు ఏం కోరుకుంటే అదే తాము ఇస్తామని, వారి సంప్రదాయాలు, స్థానికతను కాపాడడమే తన లక్ష్యమని ప్రభుత్వ అధికారి ఒకరు చెప్పారు.

ఊరుకుంటే మిగతా రాష్ట్రాలకూ అదే గతి

- కేంద్రం ఆర్డినెన్స్‌పై ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ హెచ్చరిక
- రామ్‌లీలా మైదానంలో 'ఆప్' మహా ర్యాలీ



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో పరిపాలనా సర్వీసులను నియంత్రిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌పై ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత ఢిల్లీపై దాడి చేస్తున్నారని, ప్రజల హక్కులను లాక్కొనే ఈ ఆర్డినెన్స్‌ను వ్యతిరేకించపోతే ఇతర రాష్ట్రాలకు సైతం అదే గతి పడుతుందని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల్లోనూ అధికారాలను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌లు తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో 'ఆప్' ఆధ్వర్యంలో నిర్వహించిన మహార్యాలీలో కేజ్రీవాల్ మాట్లాడారు. కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్ ఢిల్లీ ప్రజలను కించపర్చేలా ఉందని ఆరోపించారు. బీజేపీ నాయకులు తనను దూషించినా పట్టించుకోనని, ప్రజలను కించపరిస్తే మాత్రం సహించబోనని తేల్చిచెప్పారు. భారత రాజ్యాంగంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నమ్మకం లేదని కేజ్రీవాల్ విమర్శించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు మనీశ్ సిసోడియా, సత్యేంద్ర జైన్‌లను అరెస్టు చేసినప్పటికీ ఢిల్లీలో అభివృద్ధి ఆగదని అన్నారు. తమకు 100 మంది సిసోడియాలు, 100 మంది జైన్‌లు ఉన్నారని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. మహార్యాలీలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్, 'ఆప్' సీనియర్ నేతలు, వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

సోమవారం । 12 । జూన్ । 2023



చకచకా స్మృతివనం పనులు

విజయవాడ స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ స్మృతి వనం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పనులపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి సమీక్షిస్తున్నారు. -8లో▸



బంగారు తలపాగాకు విరాళం

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ ఆలయంలోని గోపయ్యస్వామి బంగారు తలపాగా తయారీకి ఎన్‌ఆర్‌ఐ సాయికృష్ణ, ఆశాగౌరీ దంపతులు రూ.లక్ష విరాళాన్ని అధికారులకు అందజేశారు.

నేడు స్పందన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ ఢిల్లీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



బడి గంట మోగేది నేడే

నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం

- తొలి రోజే జగనన్న విద్యాకానుక పంపిణీ
- ఎండల దృష్ట్యా 17 వరకూ ఒంటి పూట బడులు
- ఎన్టీఆర్ జిల్లాలో 1,453 విద్యాసంస్థల్లో 2,70,330 మంది విద్యార్థులు

బడి తెరిచే రోజు వచ్చేసింది. బడి గంట మోగే వేళ సమీపించింది. వేసవి సెలవులు ముగియడంతో సోమవారం నుంచి విద్యార్థులు కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టనున్నారు. విద్యార్థుల సందడితో పాఠశాలలు కొత్తందాలు సంతరించుకోనున్నాయి. విద్యార్థులకు అందజేయడానికి రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యాకానుక కిట్లను సిద్ధం చేసింది. నాడు–నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా నిర్మించిన తరగతి గదులు, వివిధ వర్ణాల చిత్రాలతో అలంకరించిన గోడలు, ఆకర్షణీయమైన బొమ్మలు, చక్కని క్రీడామైదానాలు, ఇతర అదనపు హంగులు విద్యార్థులను ఆకట్టుకోనున్నాయి. పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేశారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో ఈ నెల 17 వరకు ఒంటి పూట బడులు నిర్వహించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు.



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వేసవి సెలవులు ముగియడంతో ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సోమవారం నుంచి బడి గంటలు మోగనున్నాయి. సెలవులు పూర్తి కావటంతో 2023–2024 విద్యాసంవత్సం ప్రారంభం కానుంది. ప్రభుత్వ యజమాన్య పరిధిలో కొనసాగే వివిధ విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు ఇతర బాధ్యులు ఇప్పటికే పాఠశాలల ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

జిల్లాలో 1,453 పాఠశాలలు

ఎన్టీఆర్ జిల్లాలో జిల్లా విద్యాశాఖ లెక్కల ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ యజమాన్యాల పరిధిలో 1,453 విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. వీటిలో సుమారుగా 2,70,330 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూల్ ఇతర పేర్లతో కొనసాగే పాఠశాలలు 951 ఉండగా అందులో సుమారుగా 97,090 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రైవేట్ యజమాన్యాల పరిధిలో 502 విద్యాసంస్థలు ఉండగా 1,73,240 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు.

తొలి రోజే జగనన్న విద్యాకానుక

పాఠశాలలు ప్రారంభించిన రోజే విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను అందించడానికి అధికారులు కసరత్తు పూర్తి చేశారు. ప్రభుత్వ యజమాన్యానికి సంబంధించి వివిధ పేర్లతో నడిచే విద్యాసంస్థల్లోని విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పేరుతో వస్తువులను అందిస్తారు. వీటిలో ఎనిమిది రకాల వస్తువులు ఉంచుతారు. అందులో మూడు జతల యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఇంగ్లిష్ డిక్షనరీ, బెల్ట్, బూట్లు, రెండు జతల సాక్స్, బ్యాగ్‌లో పెట్టి విద్యార్థులకు అందిస్తారు. ప్రభుత్వ విద్యాసంస్థలో అడ్మిషన్ తీసుకునే ప్రతి విద్యార్థి చదువుకు అవసరమైన సామగ్రిని ఉచితంగా అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇప్పటికే కానుకలు ఆయా విద్యాసంస్థలకు చేరుకున్నాయి.

నేటి నుంచే జగనన్న గోరుముద్ద

పాఠశాలలు ప్రారంభం కానుండటంతో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని సైతం తొలి రోజు నుంచి ప్రారంభిస్తున్నారు. అంతేకాకుండా రాగిజావ పంపిణీని కూడా ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది. అందులో భాగంగా ఉదయం 8.30 నుంచి 9.00 గంటల మధ్య పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావ ఇస్తారు. అలాగే పాఠశాల ముగియగానే 11.30 నుంచి 12.00 గంటల వరకూ మధ్యాహ్న భోజనం పంపిణీ చేస్తారు.



స్టాక్‌పాయింట్ నుంచి జగనన్న విద్యాకానుక కిట్లను పాఠశాలలకు పంపుతున్న దృశ్యం

నాణ్యమైన వస్తువులతో విద్యాకానుక



ప్రభుత్వం అందించే జగనన్న విద్యాకానుక విషయంలో ఎక్కడా రాజీ పడకుండా అత్యంత నాణ్యతతో కూడిన వస్తువులను విద్యార్థులకు అందిస్తున్నాం. ఇప్పటికే అన్ని మండలాలకు, వాటి పరిధిలోని ప్రభుత్వ విద్యాసంస్థలకు విద్యాకానుక సామగ్రి చేరింది. వాటిని తొలి రోజే పాఠశాలకు హాజరైన విద్యార్థులకు అందజేస్తారు. రాగిజావ, జగనన్న గోరుముద్దకు సంబంధించిన సామగ్రిని ఆయా ఏజన్సీల నుంచి ప్రధానోపాధ్యాయులు తీసుకెళ్లారు. గోరుముద్దను కూడా తొలిరోజే ప్రారంభిస్తున్నాం. 2023–2024 విద్యా సంవత్సరం క్యాలెండర్ ప్రకారం చక్కగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– సీవీ రేణుక, డీఈఓ, ఎన్టీఆర్ జిల్లా

17 వరకు ఒంటిపూట బడులు

వేసవి తీవ్రత దృష్ట్యా ఎండలు అధికంగా ఉండటంతో ఒంటిపూట బడులు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా 12వ తేదీ నుంచి 17 వరకూ ఒంటి పూట బడులను కొనసాగిస్తారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకూ పాఠశాలలు కొనసాగుతాయి. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

‘వడ్డెర’లను గుర్తించిన ఏకైక సీఎం జగన్

ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గడచిన ఏడున్నర దశాబ్దాల కాలంలో వడ్డెర సామాజిక వర్గానికి చట్టసభల్లో తమ వాణిని వినిపించే అవకాశం రాలేదని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం అన్నారు. రాష్ట్రంలో 25 లక్షల పై చిలుకు జనాభా కలిగిన వడ్డెర్లను గుర్తించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారన్నారు. తమ జాతిని గుర్తించిన వైఎస్ జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విజయవాడలోని ఐలాపురం కన్వెన్షన్‌లో ఆదివారం వడ్డెర, వడ్డే, వడియ రాజుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం ఆత్మీయ సన్మానం జరిగింది. ఈ సందర్భంగా ఏసురత్నం మాట్లాడుతూ నవరత్న పథకాల ద్వారా వడ్డెర్లకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. అందరికంటే వడ్డెర్లకే ఎక్కువ పథకాలు అందుతున్నాయని చెప్పారు. తమ జాతి గతంలో ఎస్టీ జాబితాలో ఉండేదని, ప్రస్తుతం బీసీ జాబితాలో ఉందన్నారు. వడ్డెర్లను తిరిగి ఎస్టీ జాబితాలో చేర్చే అంశాన్ని శాసనమండలిలో ప్రస్తావిస్తానని తెలిపారు. వడ్డెర సామాజిక వర్గం ఎన్నో సమస్యలను ఎదుర్కొంటోందని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. భవిష్యత్తులో తమ సామాజిక వర్గానికి మరింత ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రస్తుత ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలోని గనుల శాఖ ద్వారా తమ జాతికి లభించే ప్రయోజనాలు, ఉపాధి అవకాశాలను గుర్తించి అవన్నీ వారికి లభించేలా కృషి చేస్తానన్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు తన్నీరు ధర్మరాజు, రాజు శరాబందిరాజు, బత్తుల రామారావు, శివరాత్రి కోటేశ్వరరావు, గండికోట సీతయ్య, తురకా లవకుమార్, బత్తుల వెంకటరమణ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఎన్టీటీపీఎస్ 8వ యూనిట్ గ్రిడ్‌కు అనుసంధానం



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో 800 మెగా వాట్లు థర్మల్ విద్యుత్‌ప్లాంట్ ట్రయల్‌రన్ విజయవంతమైందని సంస్థ అధికారులు వెల్లడించారు. ఈ నెల 2వ తేదీ ఆయిల్‌తో ట్రయల్‌రన్ ప్రారంభించారు. ఆదివారం థర్మల్ ప్లాంట్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రాజు సమక్షంలో బొగ్గుతో ట్రయల్‌రన్ వేశారు. బొగ్గును బంకర్లలో నింపి బాయిలర్‌లోకి పంపించి తయారైన నీటి ఆవిరితో టర్బైన్‌లు తిరగడంతో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైంది. తొలుత 30 మెగావాట్ల నుంచి సాయంత్రం 208 మెగా వాట్లుకు చేరింది. ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. బొగ్గుతో ట్రయల్‌రన్ విజయవంతమైందని సీఈ పి.నవీన్‌గౌతమ్ తెలిపారు. లోపాలు సరిచేసుకుంటూ త్వరలో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి చేస్తామన్నారు. ఏడు యూనిట్లతో 1,760 మెగావాట్లు ఉండగా 8వ యూనిట్ చేరికతో మరో 800మెగావాట్లు కలిస్తే మొత్తం 2,660 మెగావాట్లకు చేరుతుంది. సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తజన సందడి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై భక్తుల సందడి అధికంగా ఉంది. వేసవి సెలవులు ముగియడంతో ఆదివారం ఇళ్ల నుంచి కళాశాలలు, కాలేజీలు, యూనివర్సిటీలకు బయలుదేరిన విద్యార్థులు దుర్గమ్మ దర్శనం కోసం ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. ఆది దంపతులకు జరిగిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు పాల్గొనేందుకు ఆసక్తి చూపారు. దీంతో ఉదయం 6 గంటల నుంచి ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయంలోని ఇంజినీరింగ్, పరిపాలనా విభాగం అధికారులు, ఈవో భ్రమరాంబ ఆలయంలో క్యూలైన్లు పర్యవేక్షించారు. దుర్గగుడి ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు, మహామండపం, ఘాట్‌రోడ్డు క్యూలైన్లను పర్యవేక్షించారు. ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్ట్ మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వ దర్శనం, రూ.100, రూ.300, రూ. 500 టికెట్లు కొనుగోలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మహా నివేదన అనంతరం మధ్యాహ్నం 2.30 గంటల వరకు రద్దీ కొనసాగింది. సాయంత్రం అమ్మవారికి జరిగిన పంచహారతులు, పల్లకీ సేవలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం సూర్యోపాసన సేవ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి అర్చకులు పూజలు చేశారు. సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు సేవలో పాల్గొన్నారు. ఆర్జిత సేవలో పాల్గొన్న ఉభయదాతలను ప్రత్యేక క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

నేటి నుంచి మిర్చి క్రయవిక్రయాలు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో సోమవారం నుంచి యథావిధిగా మిర్చి క్రయ విక్రయాలు జరుగుతాయని మార్కెట్ యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారులు, హమాలీల అభ్యర్థన మేరకు మే 13 నుంచి జూన్ 11 వరకు యార్డుకు సెలవులు ప్రకటించినట్టు వివరించారు. నెల రోజుల అనంతరం యార్డులో క్రయవిక్రయాలకు అనుమతిచ్చినట్టు తెలిపారు. మిర్చి రైతులు తమ సరుకును ఆదివారం అర్ధరాత్రి నుంచి మిర్చి యార్డుకు తీసుకువచ్చి అమ్మకాలు చేసుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు వివరించారు.

సాగుకు సన్నాహాలు



కంకిపాడు మండలం దావులూరులో దుక్కిదున్నుతున్న పొలం



కంకిపాడు మండలం మద్దూరులో నారుమడికి సిద్ధం చేసిన పొలం

- ఖరీఫ్‌కు కార్యాచరణ సిద్ధం చేసిన వ్యవసాయశాఖ
- ఆర్బీకేల్లో విత్తనాలు
- అందుబాటులో ఎరువులు
- కృష్ణా జిల్లాలో సాగు పనుల్లో నిమగ్నమైన రైతులు

కంకిపాడు: ఖరీఫ్‌కు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. పొలాల్లో గత పంట అవశేషాలు (మోడు, వ్యర్థాలు) తొలగించి పొలాలను దుక్కి దున్నుతున్నారు. ఆ ప్రాంతాల పరిస్థితుల మేరకు అనువైన పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. ఖరీఫ్‌కు వ్యవసాయశాఖ కార్యాచరణ రూపొందించింది. రైతులకు అవసరమైన విత్తనాలను ప్రధానంగా వరి, పచ్చిరొట్ట విత్తనాలను రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచింది. సీజన్‌కు అవసరమైన ఎరువుల నిల్వలపై దృష్టి సారించింది. కొరత లేకుండా ఎరువులు అందించడానికి సిద్ధంగా ఉంది.

సమాయత్తం

కృష్ణా జిల్లాలో 1,82,861 హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణం. 2021లో 1,79,305 హెక్టార్లు, 2022లో 1,65,868 హెక్టార్లు వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది 1,70,000 హెక్టార్లలో సాగు చేస్తారని సాగు వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. ఈ ఏడాది కూడా సాగు ఆరంభానికి ముందుగానే ప్రభుత్వం సాగునీటిని కాలువలకు విడుదల చేయటంలో సఫలీకృతమైంది. దీంతో కాలువలు, బోరు సదుపాయం ఉన్న ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. పొలాలు దుక్కులు దున్ని ప్రధానంగా వరి సాగు కోసం నారుమడులు పోసుకునేందుకు యాజమాన్య చర్యలు చేపడుతున్నారు.

అందుబాటులో విత్తనాలు

2023 సీజన్‌కు అవసరమైన విత్తనాలను జిల్లాలోని రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచింది. ప్రాథమికంగా వరి 6,690 క్వింటాళ్లు ఆర్‌బీకేలకు తరలించింది. విత్తనాలను కిలో రూ.5 సబ్సిడీపై రైతులకు సరఫరా చేస్తున్నారు. నారుమడులు పోయడానికి ముందుగానే పొలాల్లో పచ్చిరొట్ట సాగుకు సబ్సిడీపై విత్తనాలను అందించింది. పచ్చిరొట్ట సాగుతో భూములు సారవంతమవుతున్నాయి. దీంతో దిగుబడులు ఆశాజనకంగా వస్తుండటంతో రైతులు ఇప్పటికే పచ్చిరొట్ట పైర్లు వేసుకున్నారు. జీలుగ 3,655 క్వింటాళ్లు, జనుము 680 క్వింటాళ్లు, పిల్లిపెసర 1,530 క్వింటాళ్లు ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందించింది. వీటిని 50 శాతం రాయితీపై విత్తనాలను రైతులు పొందారు. దిగుబడులు అధికంగా ఇచ్చే విత్తన రకాలు, సాగుకు అనువైన రకాలపై వ్యవసాయశాఖ క్షేత్రస్థాయిలో ప్రచారం తీసుకెళ్లింది. దీంతో రైతుల్లో అవగాహన పెరిగింది.

సమృద్ధిగా ఎరువులు

ఖరీఫ్ సీజన్‌లో జిల్లాకు 80,638 మెట్రిక్ టన్నులు ఎరువుల అవసరం ఉంది. సాగు ఆరంభంలో రైతులకు ఇబ్బంది కలగకుండా ఆర్‌బీకేల్లో ఇప్పటికే 1377 మెట్రిక్ టన్నుల నిల్వలను అందుబాటులో ఉంచింది. ఇవి కాకుండా రిటైలర్లు, హోల్‌సేలర్స్ వద్ద 51,335 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వలు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంది. ఎరువుల కొరత సమస్య రాకుండా పర్యవేక్షిస్తోంది. 80,638 మెట్రిక్ టన్నుల్లో 31,364 మెట్రిక్ టన్నుల ఎరువులను ఆర్‌బీకేల ద్వారా రైతులకు సరఫరా చేయడానికి అవసరమైన నివేదికలు రూపొందించింది.

రైతు సంక్షేమానికి కృషి



రైతాంగ సంక్షేమానికి వ్యవసాయశాఖ కృషి చేస్తోంది. సీజన్‌లో అవసరమైన విత్తనాలను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచాం. ఎరువుల లభ్యతపై దృష్టి పెట్టాం. కొరత రానివ్వకుండా చూస్తాం. అధిక ధరలకు అమ్మకుండా నిరంతరం పర్యవేక్షిస్తాం. దుకాణాల్లో తనిఖీలు కొనసాగుతాయి.

–ఎం.విజయభారతి, జిల్లా వ్యవసాయాధికారి, కృష్ణాజిల్లా

ఎరువుల అవసరం (మెట్రిక్ టన్నులు)	రిటైలర్స్	హోల్‌సేల్స్ వద్ద ఉన్నది	ఆర్‌బీకేల్లో ఉన్నది (మెట్రిక్ టన్నుల్లో)
యూరియా	34513	14356	699
డీఏపి	10008	7088	307
ఎస్ఎస్‌పి	6700	2873	9
ఎంఒపి	5456	2078	119
కాంప్లెక్స్	23961	24940	243
మొత్తం	80638	51335	1377

పంట	సాధారణ సాగు విస్తీర్ణం హెక్టార్లలో	అంచనా సాగు విస్తీర్ణం హెక్టార్లలో
వరి	168459	170000
జొన్న	0	5
మొక్కజొన్న	148	180
కందులు	15	30
పెసర	7	10
మినుము	901	1000
వేరుశనగ	790	820
మిర్చి	16	25
పత్తి	360	370
చెరకు	6294	4500
పసుపు	2128	2200
మొత్తం	179118	179140

ఈదురు గాలుల బీభత్సం

- భారీగా విరిగిపడిన చెట్లు
- పోలీసుల ఆధ్వర్యంలో తొలగింపు
- కూలిన వందేళ్ల వృక్షం

చల్లపల్లి: ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. శనివారం రాత్రి వచ్చిన హోరుగాలి ప్రభావానికి చల్లపల్లి మండలం వెలువోలు, నడకుదురు, నిమ్మగడ్డ, యార్లగడ్డ, పురిటిగడ్డ, చల్లపల్లి గ్రామాల్లో వృక్షాలు పెద్ద సంఖ్యలో విరిగిపోయాయి. కృష్ణానది కరకట్టపై దారి పొడవునా చెట్లు విరిగి పడిపోవడంతో ద్విచక్ర వాహనాల రాకపోకలు కూడా నిలిచిపోయాయి. ఆదివారం తెల్లవారుజామున సీఐ బి.భీమేశ్వర రవికుమార్, ఎస్ఐ సీహెచ్ చినబాబు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు కలిసి వెలువోలు నుంచి మోపిదేవి మండలం బొబ్బర్లంక వరకు కరకట్టపై పడిపోయిన చెట్లను తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేశారు. యార్లగడ్డ సమీపంలో వందేళ్ల వయస్సున్న భారీ వృక్షం వేళ్లతో సహా పెకలించుకుని నేలకొరిగింది. చల్లపల్లిలో జమిందారు కోటలోని కొబ్బరి చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండలంలో అనేక చోట్ల విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. విద్యుత్ శాఖ డీఈఈ పులి శివ నాగేశ్వరరావు, ఏఈఈ కె.అరవింద్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది శ్రమించి తెల్లవారుఝామున విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించారు.



కరకట్టపై విరిగిన చెట్లను తొలగిస్తున్న సీఐ రవికుమార్, ఎస్ఐ చినబాబు



యార్లగడ్డ వద్ద నేలకూలిన వందేళ్ల వృక్షం

హజ్‌యాత్ర ఆనందంగా సాగాలి

పెదకాకాని: హజ్ యాత్ర ఆనందంగా సాగాలని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ అన్నారు. పెదకాకాని మండలం నంబూరు మదరసా ప్రాంగణంలో శనివారం రాత్రి హజ్ కమిటీ సమావేశం నిర్వహించింది. నంబూరు మదరసాలో హజ్ యాత్రికులకు ఏర్పాటు చేసిన బస ప్రాంతం నుంచి ఆదివారం ఉదయం 170 మంది భక్తులు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో హజ్ యాత్రకు తరలి వెళ్లారు. వెలంపల్లి శ్రీనివాస్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ నాయకుడు దేవినేని అవినాష్, హజ్ కమిటీ సభ్యులు జెండా ఊపి యాత్ర ప్రారంభించారు. ముందుగా హజ్ యాత్రికులకు స్వీట్లు అందజేసి అభినందనలు తెలిపారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా, హజ్ కమిటీ సభ్యులు మన్సూర్ అహమ్మద్, బాసిత్, ఇమ్రాన్, ఇబదుల్లా తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో వెంకీమామ



ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులో ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ 250వ షోరూమ్‌ను ఆదివారం సినీ హీరో వెంకటేష్ ప్రారంభించారు. అనంతరం ఆయనకు సంస్థ చైర్మన్ కేఆర్ నాగరాజన్ జ్ఞాపిక అందించి సత్కరించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

1,748 మంది ఎస్జీటీల బదిలీలు

పెడన: ఉమ్మడి కృష్ణా జిల్లాలో విద్యాశాఖ చేపట్టిన ఉపాధ్యాయుల సాధారణ బదిలీల ప్రక్రియలో.. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలు ఆదివారం వెల్లడయ్యాయి. బదిలీ అయిన 1,748 మంది ఎస్జీటీల పేర్లను వెబ్‌సైట్‌లో ఉంచారు. పేర్లు పరిశీలించుకుని వారి ఉత్తర్వు కాపీలను డౌన్ లోడ్ చేసుకుని ఏ పాఠశాల అయితే కేటాయించారో అక్కడ చేరాలని విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే గ్రేడ్–2 హెచ్‌ఎంలు 217 మంది, స్కూలు అసిస్టెంట్లు 1,976 మంది ఆన్‌లైన్ ద్వారా బదిలీ అయిన విషయం విదితమే. క్రాఫ్ట్, డ్రాయింగ్, మ్యూజిక్‌లకు సంబంధించిన 18 మంది బదిలీ అయ్యారు. ఎస్జీటీల బదిలీల జాబితాలను వెల్లడించడంతో 98 శాతం ఉపాధ్యాయుల ప్రక్రియ పూర్తయినట్లేనని సంఘ నాయకులు పేర్కొంటున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 1,748 మంది ఎస్జీటీలు ఉన్నారు. 1546 మంది తప్పనిసరిగా బదిలీ అయిన వారున్నారు. రిక్వెస్టు కోరిన సెకండరీ గ్రేడ్ టీచర్లు 202 మంది ఉన్నారు. ఆది, సోమవారాల్లో బదిలీ అయిన పాఠశాలల్లో విధుల్లో చేరతారని నోడల్ అధికారి, డీఈఓ తాహెరాసుల్తానా తెలిపారు.

క్లుప్తంగా

ఏపీఆర్‌జేసీలో ఫ్లోరా విద్యార్థిని ప్రతిభ



ఉయ్యూరు(పెనమలూరు): ఏపీఆర్‌జేసీ – సెట్‌లో స్థానిక ఫ్లోరా పాఠశాల విద్యార్థిని తుమ్మలచర్ల హారిక సత్తా చాటింది. ఎంపీసీ కేటగిరీలో 150 మార్కులకు 145 సాధించి రాష్ట్రంలో రెండో ర్యాంకును సొంతం చేసుకుంది. ఆ విద్యార్థినిని పాఠశాల కార్యదర్శి డి.వి.వి.ఎస్.ప్రసాద్ ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల తరఫున ప్రోత్సాహక బహుమతిగా రూ.10 వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. పదో తరగతి ఫలితాల్లో హారిక 589 మార్కులు సాధించి ఉయ్యూరు, తోట్లవల్లూరు, పమిడిముక్కల మండలాల స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఏపీఆర్‌జేసీలోనూ సత్తాచాటి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, లావణ్య, సదాశివ పాల్గొని విద్యార్థిని హారికను అభినందించారు.

బాలిక అదృశ్యంపై కేసు

పెనమలూరు: మండలంలోని కానూరులో బాలిక అదృశ్యమైన ఘటనపై పెనమలూరు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కానూరు పరిధిలోని మురళీనగర్‌లో ఓ భార్యాభర్తలు తమ నలుగురు కుమార్తెలతో కలిసి నివసిస్తున్నారు. అయితే ఈ నెల ఆరో తేదీన ఇంట్లో ఓ వేడుక నిర్వహించారు. ఆ కార్యక్రమానికి బంధువులను ఆహ్వానించారు. ఈ నెల ఎనిమిదో తేదీన భార్యాభర్తలు పనులకు వెళ్లగా వారి కుమార్తెలు ఇంటి వద్దనే ఉన్నారు. మహిళ అన్న కుమారుడైన తెలంగాణ రాష్ట్రం పాల్వంచకు చెందిన శంకర్ కూడా వారి ఇంటి వద్దే ఉన్నాడు. పనులకు వెళ్లిన భార్యాభర్తలు ఇంటికి వచ్చేసరికి వారి 16 ఏళ్ల పెద్ద కుమార్తె, శంకర్ కనిపించలేదు. వెంటనే శంకర్‌కు ఫోన్ చేయగా తన వెంటే బాలిక ఉందని చెప్పి, ఆ తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. కుమార్తె కోసం వెంటనే ఆ దంపతులు పాల్వంచ వెళ్లారు. అయితే అక్కడికి శంకర్, బాలిక రాలేదని బంధువులు తెలిపారు. దీంతో తన కుమార్తె కనిపించటం లేదని ఆ దంపతులు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చకచకా అంబేడ్కర్ స్మృతి వనం పనులు

- రాష్ట్రానికే తలమానికంగా అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు
- 18.18 ఎకరాల్లో రూ.248 కోట్లతో సాగుతున్న పనులు
- తాజాగా రూ.106 కోట్లకు అనుమతులు మంజూరు
- రేయింబవళ్లూ పని చేస్తున్న కార్మికులు
- పనులను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్న మునిసిపల్ శాఖ స్పెషల్ సీఎస్, వీఎంసీ కమిషనర్
- జూలై 15వ తేదీ నాటికి పనులను పూర్తి చేసేలా చర్యలు



నిర్మాణంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం



పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి

సాక్షి ప్రతినిధి, విజయవాడ: నగరంలోని స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ స్మృతి వనం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ అద్భుత ప్రాజెక్టు పనులను ఓ మహాయజ్ఞంలా నిర్వహిస్తున్నారు. 125 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహం నిర్మాణం పూర్తిచేసుకుని రాష్ట్రానికే తలమానికంగా నిలవనుంది. 18.18 ఎకరాల్లో రూ.220 కోట్లతో స్మృతి వనం, అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే 74 అడుగుల ఎత్తు వరకు అంటే ఉదర భాగం వరకు విగ్రహ నిర్మాణం పూర్తయింది. ఇప్పటి వరకు దాదాపు రూ.120 కోట్లకు పైగా పనులు పూర్తయ్యాయి. ఈ పనులే కాకుండా అంబేడ్కర్ జ్ఞాపకాలను గుర్తు చేసుకొనేందుకు వీలుగా మ్యూజియం, పూర్తి ప్రహరీ, మరికొన్ని అదనపు పనుల కోసం ప్రభుత్వం తాజాగా రూ.106 కోట్లకు అనుమతినిచ్చింది. వందలాది మంది కార్మికులు భారీ యంత్రాలతో రాత్రింబవళ్లు పనులను కొనసాగిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా అంబేడ్కర్ స్మృతి వనం ప్రాజెక్టుపై దృష్టి సారించి పనులను సమీక్షిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. దీంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జూలై 15వ తేదీ నాటికి పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఉన్నతాధికారుల స్వీయ పర్యవేక్షణ

మంత్రుల సబ్ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ అంబేడ్కర్ స్మృతి వనం, విగ్రహ నిర్మాణపు పనులను పరిశీలిస్తోంది. మునిసిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి ఈ ప్రాజెక్టు పనులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రాజెక్టుపై నిత్యం సమీక్ష నిర్వహిస్తున్నారు. వారంలో మూడు నాలుగు సార్లు పనులను స్వయంగా పరిశీలిస్తున్నారు. రాత్రి సమయాల్లో సైతం పనులను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు, అధికారులకు దిశానిర్దేశం చేస్తూ పనుల్లో వేగం పెంచుతున్నారు. ఈ భారీ ప్రాజెక్టు పనులను విజయవాడ నగర పాలక సంస్థ (వీఎంసీ) కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నిత్యం క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. రాత్రి వేళల్లో సైతం అధికారులతో కలిసి పనులను పరిశీలించి అంబేడ్కర్ విగ్రహానికి సంబంధించిన డిజైన్లలో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కార్మికుల భద్రతకు సంబంధించి అన్ని చర్యలూ తీసుకుంటున్నారు.

పనుల నిర్వహణ ఇలా..

స్వరాజ్య మైదానంలో ఎంతో అద్భుతంగా 125 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఢిల్లీ నుంచి వచ్చిన స్మృతి నిర్మాణం డిజైన్ల ఆధారంగా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనుల్లో వేగం పెంచారు. సీలింగ్, ప్లాస్టింగ్ పనుల్లో జాప్యం లేకుండా చేస్తున్నారు. పనుల నాణ్యతా ప్రమాణాలను క్వాలిటీ కంట్రోల్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గ్రానైట్ ఫుట్‌పాత్, ల్యాండ్ స్కేప్, కాంపౌండ్ నిర్మాణం తుది దశకు చేరుకుంటున్నాయి. పార్కింగ్ ఏరియా ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాంగణంలో అందమైన రకరకాల పూలు, ఆకర్షణీయమైన మొక్కలతో గ్రీనరీ ఏర్పాటు చేయనున్నారు.

9 మంది అరెస్టు.. 10 కిలోల గంజాయి స్వాధీనం



పెనమలూరు: గంజాయితో ఉన్న తొమ్మిది మందిని అరెస్టు చేశామని పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన సీఐ ఆదివారం ఈ కేసు వివరాలను తెలిపారు. ఆయన కథనం మేరకు.. కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు మండలంలోని గ్రామాల్లో పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. కానూరు ప్రాంతంలో గంజాయితో పది మంది వ్యక్తులు ఉన్నారన్న సమాచారం పోలీసులకు వచ్చింది. దీంతో వారిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో కానూరుకు చెందిన దగాని మహేష్, అసిలేటి నవీన్‌కుమార్, కస్తూరి రత్నాకర్, జట్టి రాహుల్, దగాని సన్నీ, మరీదు మణికాంత్, కందుల దుర్గాప్రసాద్, ఉమ్మడి నరేంద్రబాబు, పటమటకు చెందిన పామర్తి శివనాగప్రసాద్ ఉన్నారు. ఇందులో ముగ్గురు బీటెక్ విద్యార్థులు. గంజాయి తాగినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని సీఐ కిషోర్ బాబు హెచ్చరించారు.

మణిపూర్‌లో ఎస్టీ క్రైస్తవులపై మారణకాండ ఆపాలి

ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు

సాక్షి, అమరావతి: మణిపూర్‌లో ఎస్టీ క్రైస్తవులపై మారణకాండ ఆపాలని, క్రైస్తవులకు, మత స్వేచ్ఛ హక్కుల రక్షణ కల్పించాలని ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మణిపూర్‌లో చర్చిలను లక్ష్యంగా ఎంచుకుని మైత్రి కమాండోలు దాడులు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటన చేసినప్పటికీ అక్కడ అల్లర్లు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తక్షణం జోక్యం చేసుకుని గిరిజన క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. మరణించిన క్రైస్తవులకు సంబంధించి ఒక్కొక్క కుటుంబానికి కోటి రూపాయల చొప్పున పరిహారం అందించాలని ఈ సందర్భంగా వరప్రసాదరావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

దేశానికి బీజేపీ ఒరగబెట్టిందేమీ లేదు

- స్థాయి దిగజారి నడ్డా వ్యాఖ్యలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వామపక్ష నాయకులు రామకృష్ణ, బాబూరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశానికి ఏం మేలు చేశారని, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒరబెట్టింది ఏముందని వామపక్ష పార్టీల నేతలు ప్రశ్నించారు. కేంద్ర హోం మంత్రి విశాఖ పర్యటనను వ్యతిరేకిస్తూ పది వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం లెనిన్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రానికి పదే పదే అన్యాయం చేస్తున్న బీజేపీ నాయకులు ఏ ముఖం పెట్టుకుని ఏపీకి వస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదని దుయ్యబట్టారు. పైగా ప్రభుత్వ రంగంలో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తున్నారని విమర్శించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాష్ట్ర ప్రభుత్వంపై శనివారం తిరుపతిలో చేసిన వ్యాఖ్యలపై రామకృష్ణ ధ్వజమెత్తారు. నడ్డా బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా కాకుండా ఏపీ అసెంబ్లీలో ప్రతిపక్ష బీజేపీ నాయకుడు స్థాయికి దిగజారి మాట్లాడారని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్.బాబూరావు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం ఏపీకి తీరని అన్యాయం చేసిందన్నారు. ఏ ఘన కార్యాలు చేశారని ప్రచారం చేయటానికి కేంద్ర మంత్రి వస్తున్నారని ప్రశ్నించారు. బీజేపీతో జతకట్టే పార్టీలను ప్రజలు తరిమికొడతారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఎం రాష్ట్ర నాయకులు దోనేపూడి కాశీనాథ్, సీపీఐ (ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర నాయకుడు ఎం.రామకృష్ణ, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బుడ్డి రమేష్, నక్కా వీరభద్రరావు, డి.రమణారావు, సంగుల పేరయ్య, తూనం వీరయ్య, దుగ్గిరాల సీతారావమ్మ, డి.రాంబాబు, కరోతి వెంకటేశ్వరరావు, బయ్యపు కృష్ణారావు, దాసరి నారాయణరావు, పూసర్ల లక్ష్మణ రావు, పడాల కనకారావు తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ క్రీడాభివృద్ధి కోసమే నూతన సంఘం

సంఘ కార్యదర్శి రాజేంద్రప్రసాద్



మాట్లాడుతున్న ది ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్

విజయవాడ స్పోర్ట్స్: బాస్కెట్‌బాల్ క్రీడకు రాష్ట్రంలో పూర్వవైభవం తీసుకొచ్చేందుకే ది ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశామని అసోసియేషన్ కార్యదర్శి కె.రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశం విజయవాడలోని ఓ ప్రయివేటు హోటల్‌లో ఆదివారం జరిగింది. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. నాలుగేళ్లలో అసోసియేషన్ ప్రతినిధులు నిర్వాకంతో బాస్కెట్ బాల్ క్రీడ మరుగున పడిందన్నారు. బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ పేరుతో ఏర్పాటైన సంఘంలోని ప్రతినిధులు పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులపై రాష్ట్రంలోని పలు పోలీస్ స్టేషన్‌లలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయని గుర్తు చేశారు. దీని కారణంగానే ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్), ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ (ఏపీఓఏ), బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఎఫ్ఐ) ఆ సంఘం గుర్తింపును రద్దు చేసిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బాస్కెట్‌బాల్ క్రీడాకారులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వివరించారు. ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాలకు సర్టిఫికెట్‌లు పని చేయకపోవడంతో సత్తా ఉన్న ఎంతో మంది క్రీడాకారులు బాస్కెట్ బాల్‌ను వదిలేసే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ వివాదాల కారణంగా క్రీడాకారులు నష్టపోకూడదనే ఉద్దేశంతోనే నూతన సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. తమ సంఘానికి శాప్, ఏపీఓఏ గుర్తింపు వచ్చిందని, బీఎఫ్ఐ సైతం తమకు మద్దతుగా నిలిచేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. 22 జిల్లాల క్రీడా సంఘాల మద్దతు తమకు ఉందన్నారు. బాస్కెట్ బాల్ రిటైర్డ్ కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు కలిసి ఈ సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. రానున్న రోజుల్లో కోచింగ్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తామని, అన్ని వయసు కేటగిరిల్లో పోటీలు నిర్వహిస్తామని, క్రీడానైపుణ్యం ఉన్న వ్యక్తులను గుర్తించి ప్రత్యేకంగా శిక్షణ ఇప్పించి అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. సంఘ ప్రతినిధులు జి.మదన్‌మోహన్, జి.వి.ఎస్.కృష్ణారెడ్డి, వై.శ్రీకృష్ణ, ఉపేంద్ర, హరికృష్ణప్రసాద్ పాల్గొన్నారు.


మాస్టర్ అథ్లెట్ సుబ్బలక్ష్మికి ఘన సత్కారం



సుబ్బలక్ష్మిని సన్మానిస్తున్న కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు

విజయవాడ స్పోర్ట్స్: విద్య, క్రీడా రంగాల్లో రాణించి ఏడు పదుల వయసులోనూ మూడు అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పతకాలు సాధిస్తున్న ఎ.వి.సుబ్బలక్ష్మి జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు అన్నారు. ఇటీవల దక్షిణ కొరియాలో జరిగిన ఏషియన్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి స్విమ్మింగ్, 100 మీటర్ల రన్నింగ్, జావెలిన్‌త్రో విభాగాల్లో విజయవాడ క్రీడాకారిణి సుబ్బలక్ష్మి పతకాలు సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఆమెను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అడపా శేషు మాట్లాడుతూ.. చిన్నచిన్న ఘటనలకే యువతీయువకులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, సరైన వ్యాయామం లేక అనేక వ్యాధుల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. అయితే 70 ఏళ్ల పై బడిన వయసులోనూ వేరే దేశానికి వెళ్లి అక్కడి వాతావరణ పరిస్థితులను తట్టుకుని సుబ్బలక్ష్మి పతకాలు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. మూడు అంతర్జాతీయ పతకాలతో జిల్లా, రాష్ట్ర, దేశ ఖ్యాతిని నలుదిశలా చాటారని కొనియాడారు. మచిలీపట్నం, విజయవాడ తదితర ప్రాంతాల్లోని కళాశాలల్లో అధ్యాపకురాలిగా పని చేస్తూనే క్రీడల్లో రాణించి ఇప్పటి వరకు స్విమ్మింగ్, అథ్లెటిక్స్‌లో 121 రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పతకాలను సాధించడం అద్భుతమని పేర్కొన్నారు. సుబ్బలక్ష్మిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడాకారిణి సుబ్బలక్ష్మిని ఘనంగా సత్కరించారు. కృష్ణాజిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షకార్యదర్శులు కె.గంగాధరరావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న యువకుడు



పోలీసుల సమక్షంలో పరుసు అందజేస్తున్న యువకుడు

బంటుమిల్లి(పెడన): దొరికిన పర్సును పోగొట్టుకున్న వృద్ధురాలికి అందజేసి తన నిజాయతీని చాటుకున్నాడు ఓ యువకుడు. కృత్తివెన్ను మండలం నిడమర్రు గ్రామానికి చెందిన 62 ఏళ్ల ముప్వల మరియమ్మ ఆదివారం ఉదయం బంటుమిల్లిలోని నాగలక్ష్మి హోటల్ వద్ద టిఫిన్ చేసేందుకు వచ్చింది. ఆ సమయంలో ఆమె చేతిలోని పరుసు పడిపోయింది. ఇది గమనించకుండా ఆమె వెళ్లిపోయింది. పోకల శశికాంత్‌కు ఆ పర్సు దొరకడంతో అతను పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్‌ఐ ఎ.పైడిబాబుకు అందించాడు. ఆ పర్సులో రూ.22,840 నగదు ఉంది. పర్సులో ఉన్న సమాచారం మేరకు ఎస్‌ఐ పైడిబాబు మరియమ్మని పిలిపించి విషయం తెలుసుకున్నాడు. యువకుడు శశికాంత్ చేతుల మీదుగా మరియమ్మకు పర్సు అందజేశారు. శశికాంత్ నిజాయతీని ఎస్‌ఐ, పోలీసులు, మరియమ్మ అభినందించారు.

లారీని ఢీకొట్టిన టీఎస్ ఆర్టీసీ బస్సు



జగ్గయ్యపేట అర్బన్: జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న లారీని తెలంగాణ ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఆదివారం జరిగిన ప్రమాదంలో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. వైజాగ్ నుంచి మియాపూర్ వెళ్తున్న తెలంగాణ ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు షేర్‌మహ్మద్‌పేట క్రాస్ రోడ్డు వద్ద ఫుడ్ ప్లాజా సమీపంలో జగ్గయ్యపేట వైపు వస్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వారిలో ఒకరిని విజయవాడకు తరలించారు. గాయపడిన మరో ఇద్దరితో పాటు ప్రయాణికులు అందరినీ వేరొక బస్సులో హైదరాబాద్‌కు పంపించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని పట్టణ ఎస్‌ఐ బి.వి.రామారావు తెలిపారు.

మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మచిలీపట్నంలోని ఏపీఆర్ఎస్ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో ప్రవేశాలకు 2023–24 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ పి.సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకు ఐదో తరగతిలో ప్రవేశం కోసం రెగ్యులర్ సీట్లు 80, ఆరో తరగతిలో 29 సీట్లు, ఏడో తరగతిలో 14 సీట్లు, ఎనిమిదో తరగతిలో 17 సీట్లు (బ్యాక్‌లాగ్)కు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. గురుకుల పాఠశాలలో 5, 6, 7, 8 తరగతుల్లో మైనార్టీ (ముస్లిం, దూదేకుల, బీసీ–సీ క్రిస్టియన్) విద్యార్థులకు ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు పూర్తి చేసిన దరఖాస్తులను నేరుగా మచిలీపట్నం చిలకలపూడిలోని ఏపీఆర్ఎస్ మైనార్టీ బాలుర పాఠశాలలో ఈ నెల 30వ తేదీకల్లా సమర్పించి అడ్మిషన్ పొందాలని సూచించారు. పూర్తి వివరాలకు పాఠశాలతోపాటు ప్రిన్సిపాల్‌ను 9000 900473 సెల్ నంబరులో సంప్రదించాలని కోరారు.

బ్లేడ్‌తో గాయపరుచుకున్న యువకుడి మృతి

పెనమలూరు: వ్యసనాలకు బానిసగా మారిన ఓ వ్యక్తి సొమ్ము కోసం బ్లేడ్‌తో గాయపరుచుకుని మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు కథనం మేరకు.. కానూరు మురళీనగర్‌లో చెందిన బత్తుల మురుగేష్, అతని సోదరుడు బత్తు కనకయ్య నివసిస్తున్నారు. మురుగేష్ తాపీపని, కనకయ్య (30) కూలి పనులు చేస్తూ జీవిస్తున్నారు. ఇటీవల వారి తల్లి అనారోగ్యానికి గురవడంతో స్థలం విక్రయించి వైద్యం చేయిస్తున్నారు. స్థలం విక్రయించిన సొమ్ము రూ.8 లక్షల వరకు మురుగేష్ వద్ద ఉంది. కనకయ్య అన్న మురుగేష్ వద్ద సొమ్ము తీసుకుని కొద్ది రోజులుగా మద్యం తాగుతున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి కనకయ్య మద్యం తాగి వచ్చి బ్లేడ్‌తో చేతులు కోసుకొని అన్న మురుగేష్‌ను సొమ్ము అడిగాడు. అన్న సొమ్ము ఇవ్వక పోవటంతో కోపంతో కనకయ్య బ్లేడ్‌తో తనను గాయపరుచుకున్నాడు. రక్తం ఎక్కువ పోవటంతో అపస్మారకస్థితికి చేరుకున్నాడు. అతడిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో కారు బీభత్సం



ప్రమాదానికి కారణమైన కారు

యువకుడు మృతి



పారుపల్లి లక్ష్మణ్ (ఫైల్)

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున ఓ కారు బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో రాపిడో ద్విచక్రవాహనం చోదకుడు పారుపల్లి లక్ష్మణ్ (21) మృతి చెందగా మరో వ్యక్తి గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లా మధిరకు చెందిన పారుపల్లి లక్ష్మణ్ అద్దాల దుకాణంలో పని చేస్తూ విజయవాడ పటమటలో నివసిస్తున్నాడు. ఖాళీగా ఉన్నప్పుడు, సెలవు రోజుల్లో రాపిడో ద్వారా డ్రైవింగ్ వెళ్తుంటాడు. ఆదివారం తెల్లవారుజామున సుమారు 3.20 గంటలకు రామవరప్పాడుకు చెందిన ఇళ్ల శ్రీనివాసరావు హైదరాబాద్ నుంచి విజయవాడకు వచ్చారు. ఇంటికి వెళ్లేందుకు ర్యాపిడో బైక్ బుక్ చేసుకున్నారు. శ్రీనివాసరావును పారుపల్లి లక్ష్మణ్ పికప్ చేసుకుని బీఆర్‌టీఎస్ రోడ్డు మీదుగా రామవరప్పాడు బయలుదేరాడు. ఈ క్రమంలో ఓ కారు వెనుక నుంచి వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో పారుపల్లి లక్ష్మణ్ మృతి చెందగా, ఇళ్ల శ్రీనివాసరావు గాయపడ్డాడు. అతడిని హుటాహుటిన స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఈ సమాచారం అందుకున్న గుణదల సీఐ పి.కృష్ణమోహన్ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కారు నడుపుతున్న జమీర్ బాషాను అదుపులోకి తీసుకున్నారు. సెలవు రోజున ఎంతో కొంత ఆదాయం వస్తుందని రాపిడోకు వెళ్లిన లక్ష్మణ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పోలీస్‌స్టేషన్ వద్ద హైడ్రామా

ప్రమాదానికి కారణమైన కారు ఎమ్మెల్సీకి చెందినదని ప్రచారం జరగటంతో మీడియా ప్రతినిధులు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. విచారణ చేసిన తరువాత వివరాలు వెల్లడిస్తామని పోలీసులు చెప్పటంతో వారు పోలీస్ స్టేషన్ వద్దే పడిగాపులు కాశారు. అయితే ఆ కారు ఎమ్మెల్సీకి చెందినది కాదని పోలీసులు నిర్ధారించారు.

క్లుప్తంగా

నేడు వీఎంసీ స్పందన

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే స్పందనలో నగరవాసులు తమ ప్రాంతాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. కమాండ్ కంట్రోల్ రూంలో, సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు నగరవాసుల నుంచి ఫిర్యాదులు, అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.

ఆకట్టుకున్న స్వరాంజలి



విజయవాడ కల్చరల్: తెలుగు సినీ రంగ త్రిమూర్తులు అక్కినేని, ఎన్టీఆర్, కృష్ణ నట జీవితాలను నేటి తరం నటులు ఆదర్శంగా తీసుకోవాలని సీనియర్ గాయకుడు మారేపల్లి జోషి అన్నారు. చిత్రలహరి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికమీద ఆదివారం స్వరాజంలి కార్యక్రమం నిర్వహించారు. జోషి మాట్లాడుతూ అక్కినేని, ఎన్టీఆర్, కృష్ణలు తెలుగు సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే చిత్రాలను నిర్మించారని తెలిపారు. తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డలుగా అభివర్ణించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు కృష్ణకుమారి, రూపాశ్రీ, సింధూ, డేవిడ్‌రాజు, ఆదిరాల జయప్రభ, సయ్యద్ ఆలీ, పి.శ్రీనివాసరావు, ఒమ్మి రామశంకర్, పసుపులేటి బాబూరావు చిత్రగీతాలను ఆలపించారు.

దుర్గమ్మ సేవలో కమలానంద భారతీ స్వామిజీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): గన్నవరంలోని భువనేశ్వరి పీఠం ఉత్తర పీఠాధిపతి కమలానంద భారతీ స్వామిజీ ఆదివారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన స్వామిజీని అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు స్వామిజీకి వేదస్వస్తి పలికారు. ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందచేయగా, స్వామిజీ ఆలయ సిబ్బందికి అనుగ్రహ భాషణం చేశారు.

ఇంటీరియర్ వర్కు పేరిట మోసం

పెనమలూరు: నూతన భవనంలో ఇంటీరియర్ వర్కు చేస్తానని రూ.25 లక్షలు తీసుకుని మోసగించిన మహిళపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు కథనం మేరకు.. కానూరులో గేటెడ్ కమ్యూటీలో ఫ్లాట్ నంబర్ 302ను డాక్టర్ జైయోస్నా, డాక్టర్ సంజయ్ సాల్మన్‌రాజ్ కొనుగోలు చేశారు. ఫ్లాట్‌లో ఇంటీరియర్ డిజైన్ వర్కను రూ.35 లక్షలకు ఎస్‌ఆర్‌కే ఇన్నోవేటివ్ ఇంటీరియర్స్ యజమాని కళారాణి కుదుర్చుకున్నారు. ఆమె మాటలు నిమ్మన జైయోస్నా, డాక్టర్ సంజయ్ సాల్మన్‌రాజ్ పలు దఫాలుగా రూ.25 లక్షలు ఇచ్చారు. అయితే కళారాణి నాణ్యత లేని పనులు చేయటమే కాకుండా సకాలంలో పూర్తి చేయలేదు. ఆమెకు జైయోస్నా, డాక్టర్ సంజయ్ సాల్మన్‌రాజ్ ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. గత ఫిబ్రవరిలో కొందరు వ్యక్తులతో కళారాణి వచ్చి తాను ఇక పనులు చేయబోనంటూ జైయోస్నా, డాక్టర్ సంజయ్ సాల్మన్‌రాజ్‌ను బెదిరించింది. కళారాణి ఒప్పుకున్న వర్క్‌ను చేయకపోవటంతో తమను నమ్మించి మోసం చేసి సొమ్ము తీసుకుందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కోడిపందేల శిబిరంపై దాడి

కంకిపాడు: కోడిపందేల శిబిరంపై కంకిపాడు పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఎస్ఐ కె.సుధాకర్ కథనం మేరకు.. మండలంలోని మారేడుమాక ఎస్సీ కాలనీ సమీపంలో కోడిపందేలు ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడులు నిర్వహించారు. నలుగురు పందెంరాయుళ్లను పట్టుకున్నారు. వారి వద్ద రూ.10,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

శ్రీనివాసుని సేవలో ఫైనాన్స్ డెప్యూటీ డైరెక్టర్



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేంద్ర ఆర్థిక శాఖ డెప్యూటీ డైరెక్టర్ కె. రోహిన్ ఆదివారం చిట్టినగర్‌లోని పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనానికి విచ్చేసిన రోహిన్‌ను ఆలయ కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు సాదరంగా స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందచేశారు. బ్రహ్మోత్సవాల విశేషాలను వివరించారు.

రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

ఆటోనగర్(విజయవాడతూర్పు): అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని విజయవాడ సెంట్రల్ ఏసీపీ భాస్కరరావు రౌడీషీటర్‌లను హెచ్చరించారు. ఆదివారం పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్‌లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గంజాయి అమ్మకాలు.. గొడవల్లో ప్రమేయం ఉన్నవారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాల్లో నిమగ్నమయ్యేవారిని జైలుకు పంపిస్తామన్నారు. గొడవల్లో ఉండేవారిపై నిఘా పెట్టామన్నారు. ఎప్పటికప్పుడు కదలికలను పరిశీలిస్తున్నామన్నారు. పటమట సీఐ కాశీవిశ్వనాథ్, ఎస్ఐలు జాన్‌బాషా, శాతకర్ణి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రౌడీషీటర్‌లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ భాస్కరరావు



రౌడీషీటర్లు, సస్పెక్టు షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ దుర్గారావు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవు

కృష్ణలంక(విజయవాడతూర్పు): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని సీఐ ఎం.వి.దుర్గారావు హెచ్చరించారు. ఆదివారం రౌడీషీటర్లు, సస్పెక్టుషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ దుర్గారావు మాట్లాడుతూ నేర ప్రవృత్తిని విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్టేషన్ పరిధిలో బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్‌లపై, అసాంఘిక కార్యకలాపాలు సాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. అటువంటి వారిపై సమాచారం ఉంటే కృష్ణలంక పోలీసులకు గానీ, కంట్రోల్ రూమ్‌కు గానీ సమాచారం అందించాలని కోరారు. ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్ఆర్‌కేలో 1110 మందికి విద్యా కానుక కిట్‌లు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థానిక జమ్మిచెట్టు సెంటర్‌లోని బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్ స్కూల్ (బీఎస్ఆర్‌కే)లో జగనన్న విద్యాకానుక కిట్‌లను పంపిణీ సిద్ధం అయ్యాయి. ఇప్పటికే కిట్‌లలో ఉండాల్సిన అన్ని బీఎస్ఆర్‌కే స్కూల్‌కు చేరడంలో వాటినన్నింటి స్కూల్ బ్యాగ్‌లో సర్ది సోమవారం విద్యార్థులకు అందించనున్నారు. ఈ స్కూల్‌లో మొత్తం 1110 మంది విద్యార్థులు ఉన్నారు. హై స్కూల్‌లో 790 మంది, ఎలిమెంటరీ స్కూల్‌లో 320 మంది మొత్తం విద్యార్థులు ఈ కిట్‌లను అందచేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పాఠశాల తెరచిన కొన్ని నెలల తర్వాత కూడా అన్ని పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందని పరిస్థితి. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత వేసవి సెలవులు ముగిసిన తర్వాత పాఠశాల పునఃప్రారంభం రోజునే జగనన్న విద్యాకానుక పేరుతో విద్యార్థులకు అవసరమైన పాఠ్య,నోట్ పుస్తకాలు అందచేస్తున్నారు. షూ-1 జత, సాక్స్‌లు-2 జతలు, బెల్ట్, స్కూల్ బ్యాగ్-1, తెల్ల పేజీలు, బ్రాడ్ రూల్స్, సింగల్ రూల్ పేజీల నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, ఆరో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా ఆక్స్‌ఫర్డ్ డిక్షనరి, 8,9,10 తరగతుల విద్యార్థులకు గ్రాఫ్ బుక్స్ విద్యార్థులందరికి రెండు జతల యూనిఫామ్ జగనన్న విద్యాకానుక కిట్‌లో భాగంగా అందచేస్తున్నారు. విద్యార్థుల యూనిఫామ్ కుట్టించుకోడానికి (స్టిచ్చింగ్) అయ్యే ఖర్చు కూడా ప్రభుత్వమే విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంక్ ఎకౌంట్‌లో నేరుగా జమ చేయనున్నారు. బీఎస్ఆర్‌కే హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ కిట్‌ల పంపిణీ ప్రారంభించిన వెంటనే స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అతిథులు చేతుల మీదుగా విద్యార్థులకు అందచేస్తామని చెప్పారు. పేరంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సమక్షంలో పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.



విద్యాకానుక కిట్‌ను సిద్ధం చేస్తున్న సిబ్బంది

ఆధ్యాత్మిక చింతన అభినందనీయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వెలంపల్లి, చిత్రంలో మాతా శివానంద సరస్వతి, సునీతా మధుసూదన్

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థుల్లో ఆధ్యాత్మిక చింతన పెంపొందించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శ్రీగోవిందనామ ప్రచార సేవా సంఘం 6వ వార్షికోత్సవం సందర్భంగా గొల్లపూడి బైపాస్ రహదారి పక్కనగల శ్రీరస్తు ఫంక్షన్ హాల్లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ప్రజల ఆరాధ్య దైవం శ్రీవేంకటేశ్వరస్వామి గోవిందనామాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేస్తూ నిస్వార్థంగా సేవలందిస్తున్న సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు టి.సునీత మధుసూదన్ దంపతులు అభినందనీయులని చెప్పారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని శ్రీ శివకేశవ పీఠం సంస్థాపక పీఠాధీశ్వరి (చైతన్య తపోవనం) మాతా శివానంద సరస్వతి మాట్లాడుతూ భగవద్గీత ప్రగతి పథం పేరుతో చిన్నారులతో ప్రతి రోజూ భగవద్గీత శ్లోక పఠనం చేయిస్తుండటం శుభపరిణామమని తెలిపారు. భగవద్గీత శ్లోకాల్లోని పరమార్థం తెలుసుకోవడం ద్వారా చిన్నారుల్లో వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందన్నారు. అలాగే విద్యార్థులకు జీవిత మార్గదర్శకత్వాన్ని నిర్దేశించేది భగవద్గీత అన్నారు. శ్రీగోవిందనామ ప్రచార సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు టి. సునీత మధుసూదన్ దంపతులు మాట్లాడుతూ తిరుమల తిరుపతి, ద్వారకా తిరుమల దేవస్థానాలతోపాటు వివిధ ప్రాంతాల్లోని శ్రీవారి దేవాలయాల్లో సేవలు అందిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా శ్రీవారి గోవిందనామాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రచారం చేయడమే సంఘం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు భగవద్గీతలోని శ్లోకాలను పఠింప చేసి ప్రతిభ కనబరిచినవారికి బహుమతులు అందచేశారు.

ఎల్ఐసీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఎల్ఐసీ సంస్థలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ అన్నారు. ఆదివారం గవర్నర్‌పేటలోని ఎం.బి.వి జ్ఞాన కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ బుద్దిస్ట్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్స్ ఎంప్లాయీస్/ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మచిలీపట్నం డివిజన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ ఎల్ఐసీలో రోస్టర్ సిస్టం పాటించకపోతే కమిషన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉద్యోగులందరూ ఐక్యంగా పనిచేయాలని సూచించారు.

అసోసియేషన్ ఆలిండియా జనరల్ సెక్రటరీ కె.పి. చౌదరి, సీఈసీ మెంబర్ జె.వరప్రసాద్ మాట్లాడుతూ తక్షణమే ఎల్ఐసీ సంస్థలో బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఇన్స్యూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీని తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొల్ల వరప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కె.బుల్లయ్య, ఇతర కమిటీ సభ్యులను ఎన్నికయ్యారు.

కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలి

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని ఉషోదయ సింగర్స్ అసోసియేషన్ సన్ రైజర్స్ వ్యవస్థాపకురాలు ఉషారెడ్డి అన్నారు. గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం ఎగిసే రాగాలె ఉష స్వరాలు పేరుతో అమర గాయకులకు స్వరనీరాజనం, కళా సంస్థల ప్రతినిధులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఉషారెడ్డి మాట్లాడుతూ సాంస్కృతిక సంస్థలు నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పించాల్సిన అవసముందన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వందలాది కార్యక్రమాలు నిర్వహిస్తూ కొత్త వారికి ప్రోత్సాహం ఇస్తునట్లు తెలిపారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబును నిర్వాహకులు సత్కరించారు. చిట్టిబాబు మాట్లాడుతూ ఇప్పటికి నగరంలో 30 ఏళ్లుగా రెండువేలకు పైగా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. సంస్థ ప్రతినిధులు టీఎస్ రావు, శేషగిరి, గాయని దుర్గానాగమణి పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం తదితరుల గీతాలు ఆలపించారు.



చిట్టిబాబును సత్కరిస్తున్న ఉషారెడ్డి టీఎస్‌రావ్, శేషగిరి, దుర్గా నాగమణి తదితరులు

శతజయంతి ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): చిత్రకళ అభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రముఖ చిత్రకారులు, ఆంధ్ర అకాడమీ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి ఎంఎస్ మూర్తి శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అట్లూరి వెంకట రత్నప్రసాద్ తెలిపారు. ముత్యాలంపాడు ఎంఎస్‌మూర్తి ఆర్ట్ గ్యాలరీలో ఆంధ్ర అకాడమీ ఆర్ట్స్ ఆధ్వర్యాన ఆదివారం ఎంఎస్ మూర్తి శత జయంతి ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి అభ్యుదయానికి, వారిలో నూతన ఉత్సాహం నింపటానికి, క్రమబద్ధమైన జీవనానికి కళలు ఎంతో అవసరం అన్నారు. గతంలో కళలను రాజులు ప్రోత్సహించే వారని నేడు కళలకు ఆదరణ కరువయిందన్నారు. చిత్రకళారంగానికి ఎంఎస్‌మూర్తి చేసిన సేవలు నిరుపమానమని కొనియాడారు. ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం .ఆనందస్వరూప్, ఎంవీ సాయిబాబు మాట్లాడుతూ ఎంఎస్‌మూర్తి శత జయంతి వేడుకలు నవంబర్ 2023 నుంచి నవంబర్ 2024 వరకు జరుగుతాయన్నారు. చిత్రకళ ప్రదర్శనలు, లెక్చర్స్, చిత్రకళ పోటీలు, సెమినార్‌లతో పాటు చిత్రకళలో విశేష సేవలు అందిస్తున్న ప్రముఖ చిత్రకారులను సత్కరిస్తామన్నారు. ఎంఎస్‌మూర్తి శత జయంతి ఉత్సవాలలో చిత్ర కళాకారులు, కళాభిమానులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో చిత్ర కళాకారులు సృజన్, మల్లిక్, సునీల్, బీడీసీఎన్ ప్రసాద్, డీ దుర్గాప్రసాద్, పీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ వెంకట రత్న ప్రసాద్

అభయాంజనేయ స్వామివారికి విశేష పూజలు



హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జన్మనక్షత్రం పూర్వభాద్రను పురస్కరించుకుని ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాన్ని, స్వామివారిని పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు అభయాంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. దేవస్థానం ప్రాంగణంలోని ఆధ్యాత్మిక వేదికపై స్వామి వారి పంచలోహ విగ్రహానికి అష్టోత్తర శతకలశాలతో విశేష పూజలు, నారికేళ జలంతో అభిషేకాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామ్మోహన్ గ్రంథాలయంలో ముగిసిన పుస్తక వితరణ

1100 మంది పుస్తక ప్రియులకు 5500 పుస్తకాలు పంపిణీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని రామ్మోహన గ్రంథాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన పుస్తక వితరణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. 1100 మంది పుస్తక ప్రియులు, విద్యార్థులకు మొత్తం 5500 పుస్తకాలు పంపిణీ చేశారు. ముగింపు సందర్భంగా గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు మాట్లాడుతూ పుస్తక ప్రియుల కోసం గ్రంథాలయంలో పుస్తక వితరణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో న్యాయవాదులు, వైద్యులు, ఉపాధ్యాయులు, కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారన్నారు. 400 మందికి పైగా విద్యార్థులు తమ తల్లిదండ్రులతో వచ్చి బాలల సాహిత్యం, వ్యక్తిత్వ వికాసం , పాఠ్యాంశాలకు సంబంధించిన పుస్తకాలు తీసుకెళ్లారన్నారు. ఆధ్యాత్మిక పుస్తకాలు పుస్తక ప్రియులను ఆకర్షించాయన్నారు.ఈ మూడు రోజులు గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు విశిష్ట సేవలు అందించారన్నారు. పుస్తక వితరణ కార్యక్రమం ముగింపు సందర్భంగా విద్యార్థి వికాస వాహిని 'నాకు నచ్చిన పుస్తకం' అనే అంశం పై నిర్వహించిన వక్తృత్వ పోటీల విజేతలకు ప్రశంస పత్రాలు , బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

మధురంగా సాగిన గాత్ర కచేరీలు

విజయవాడ కల్చరల్: హరిద్ర మ్యూజిక్ అకాడమీ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన గాత్ర కచేరీలు మధురంగా సాగాయి. ఉదయం 9 గంటలకు హరిద్ర, రిషిత కచేరీతో వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. సీనియర్ సంగీత కళాకారులు గాయత్రి, లలిత, సౌమ్య, సీహెచ్ పద్మ, అంజన,విష్ణుప్రియలతో పాటు హరిద్ర సంగీత శిక్షణా కేంద్రానికి చెందిన 50 మందికి పైగా చిన్నారులు అన్నమయ్య, రామదాసు, త్యాగరాజ స్వామి రచించిన సంకీర్తనలను గానం చేశారు. కార్యక్రమాలను ప్రారంభించిన సంస్థ వ్యవస్థాపకుడు కె.సుబ్రహ్మణ్యరాజు తమ లక్ష్యాలను వివరించారు. సంగీత కళాశాల విశ్రాంత గాత్ర విభాగం అధ్యాపకుడు ఎస్‌సీహెచ్ బుచ్చయ్యాచార్యులు, చిన్నారులను ఆశీర్వదిస్తూ ప్రసంగించారు. నగరానికి చెందిన సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, పోపూరి గౌరీనాథ్ పాల్గొన్నారు. గుంటూరు సంగీత కళాశాల పూర్వపు అధ్యాపకురాలు పాటిబండ్ల జానకిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.



సంప్రదాయ కీర్తనలను ఆలపిస్తున్న చిన్నారులు

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్రంథాలయాలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తున్నాయని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. పౌర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి ఆదివారంతో శిక్షణ శిబిరం ముగిసింది. విద్యార్థులు శిబిరంలో నేర్చుకున్న అంశాలను ప్రదర్శించారు. పాటలు, దేశ భక్తి గేయాలు ఆలపించారు. ముగింపు సభలో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని శిక్షణకు హాజరైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 రోజులపాటు సాగిన శిక్షణ శిబిరంలో విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చామని చెప్పారు. క్రాఫ్ట్, డ్రాయింగ్, డ్యాన్స్, చెస్, క్యారమ్స్ వంటి వాటిలో శిక్షణనిచ్చి వారిలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీశారన్నారు. వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం గ్రంథాలయాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహించడం శుభపరిణామమని చెప్పారు. విద్యార్థుల్లో దాగిన సృజనను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. 35 రోజుల పాటు విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణనిచ్చిన అధ్యాపకులను అభినందించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తిప్పరమల్లి ఆనందరావు,, గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, సిబ్బంది జి. ఉమారాణి, వై.ధనలక్ష్మి, కె.రాంబాబు, కుమార్, గోపాలరావు, దుర్గాంబ, అధ్యాపకులు శ్రీనివాస శర్మ, వి.తేజస్విని, గంధం ఝాన్సీ, పిల్లి నాగమణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

తిరుపతమ్మ ఆలయానికి రూ.20 వేల విరాళం



ఆలయ ఈఓ, చైర్మన్‌కు విరాళం అందజేస్తున్న దాతలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి ఆదివారం ప్రకాశం జిల్లా, మార్టూరు మండలం, వలపర్ల గ్రామానికి చెందిన ఆవల ఏడుకొండలు, అంకమ్మ దంపతులు రూ.20 వేలు విరాళాన్ని ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు చేతుల మీదుగా అందజేశారు. నగదును అమ్మవారి గోశాలలో గోవుల సంరక్షణకు వినియోగించాలని దాతలు కోరారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావటంతో పాటు పలు శుభకార్యాలు ఉండటం, వేసవి సెలవులు ముగుస్తుండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో గ్రామం జనసంద్రంగా మారింది. భక్తుల రద్దీతో ఆలయంలో క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. వేలాది వాహనాలు తరలిరావటంతో ఆదివారం పెనుగంచిప్రోలు పుణ్యక్షేత్రం పెద్ద నగరాన్ని తలపించింది. తెలుగు రాష్ట్రాల నుంచి వందలాది వాహనాల్లో భక్తులు తరలివచ్చారు. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు వాహనాల రద్దీ కొనసాగింది. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు. తెలంగాణా రాష్ట్రం, సూర్యాపేటకు చెందిన భక్తులు విజయ్, సావిత్రి, విజయవాడకు చెందిన ఐ.దుర్గాప్రసాద్ సౌజన్యంతో మజ్జిగ పంపిణీ చేశారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలు

మహిళల రక్షణకు దిశ యాప్ వజ్రాయుధం

ఏసీపీ జనార్దననాయుడు

జగ్గయ్యపేటఅర్బన్: ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ఏర్పాటుచేసిన దిశ యాప్ మహిళలకు వజ్రాయుధం లాంటిదని ఏసీపీ జనార్దననాయుడు అన్నారు. ఆదివారం రాత్రి జగ్గయ్యపేట పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం కూడలిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా దిశ యాప్ డౌన్‌లోడ్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పలువురు మహిళల చేత దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి యాప్‌పై వారికి అవగాహన కల్పించారు. ఏసీపీ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ఈ దిశ యాప్‌ను దేశంలో ఎక్కడా లేని విధంగా అమలులోకి తీసుకువచ్చిందన్నారు. ప్రతి మహిళ మొబైల్ ఫోన్‌లో ఉండాలన్న లక్ష్యంతో డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాప్‌ను ప్రతి మహిళ డౌన్‌లోడ్ చేసుకోని, సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేట సీఐ జానకీరామ్, ఎస్ఐ బీవీ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.



దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ జనార్దననాయుడు, సీఐ, ఎస్ఐలు

అలరించిన కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కళావేదికపై రాజమండ్రికి చెందిన శ్రీ కళా నృత్య నికేతన్‌కు చెందిన పలువురు నృత్యకారులు ప్రదర్శించిన కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నృత్యనికేతన్‌కు చెందిన వేదామృత, జిష్విత, సాహితి, చేతన, దుర్గా, నందిని, ప్రియాంక, మనీష, సృజన, భువన, సౌమ్య, సాన్విక, ఝాన్సీభారతీ పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తితో వీక్షించారు. అనంతరం నృత్యకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు ప్రసాదాలను అందచేశారు.

క్లుప్తంగా...

భక్తులతో నిండిన తిరుమల కొండ

- ముగియనున్న వేసవి సెలవులతో పెరిగిన రద్దీ



క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ ఆదివారం అధికంగా ఉంది. బాటగంగమ్మ ఆలయం వరకు క్యూలైన్లలో భక్తులు వేచి ఉన్నారు. వేసవి సెలవులు ముగుస్తుండడం, వారాంతపు సెలవుల నేపథ్యంలో దేశం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో తిరుమల పోటెత్తింది. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద సముదాయంలోనే మధ్యాహ్నానికి దాదాపు 80 వేల మందికి పైగా అన్న ప్రసాదం స్వీకరించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ క్యూలైన్లలో 75 వేల మందికి అన్నప్రసాదాలు (ఇందులో ఉప్మా, పొంగల్ ఉన్నాయి) పంపిణీ చేశారు. క్యూలైన్లలో తొక్కిసలాట జరగకుండా టీటీడీ విజిలెన్స్, పోలీస్ సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు దాదాపు 50 వేల మంది భక్తులు శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకున్నారు. భక్తుల అధిక రద్దీ కారణంగా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెన్లు, ఎస్ఎస్డీ టోకెన్లు, దివ్య దర్శనం టోకెన్లు కలిగిన భక్తులు మాత్రమే తిరుమలకు రావాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. తిరుమల శ్రీవారిని శనివారం 88,626 మంది దర్శించుకున్నారు. కానుకల రూపంలో రూ.3.29 కోట్లు లభించాయి. తిరుమల శ్రీవారిని ఆదివారం సినీనటి సోనాల్ చౌహాన్ దర్శించుకున్నారు.

తెలంగాణ

కుటుంబ పరువు బజారుకీడ్వొద్దు

- సోషల్ మీడియాలో దుష్ప్రచారంపై అప్సర తల్లి అరుణ ఆవేదన

హుడా కాంప్లెక్స్ (హైదరాబాద్): 'అల్లారు ముద్దుగా పెంచుకున్న నా కూతురు చనిపోయింది. ఆ బాధలో నుంచి ఇప్పటికీ మా కుటుంబం బయటికి రాలేదు. హంతకుడు సాయికృష్ణ కుటుంబ సభ్యులు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారు. నా కూతురు ఆత్మశాంతికి భంగం కలిగిస్తున్నారు' అంటూ మృతురాలు అప్సర తల్లి అరుణ ఆవేదన వ్యక్తం చేశారు. కూతురు చనిపోయిన బాధలో తాము ఉంటే.. తమ పరువును బజారుకీడ్చే పనులు చేయడమేంటని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నెల 3న సాయికృష్ణ చేతిలో హత్యకు గురైన అప్సరకు గతంలోనే వేరే వ్యక్తితో వివాహమైనట్లు ఫొటోలు, వీడియోలు ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. విషయం తెలిసి అప్సర తల్లి కన్నీరుమున్నీరుగా విలపించారు. సంబంధం లేని ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేయించి తమ కుమార్తె క్యారెక్టర్‌ను తప్పుబట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సాయికృష్ణను కఠినంగా శిక్షించాల్సింది పోయి తన కుమార్తెనే తప్పు పడతారా అని అన్నారు. ఇదిలాఉండగా అప్సర మొదటి భర్త వివాహమైన కొంత కాలానికే ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది.

సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తు.. 'పింక్ వాట్సాప్'!

- వాట్సాప్ అప్‌డేట్ ఫీచర్ పేరిట లింక్‌లు పంపుతున్న వైనం
- వాటిని తెరిస్తే ఫోన్లోని డేటా అంతా సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి..



సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ ద్వారా ప్రజల నుంచి భారీగా డబ్బు కాజేసేందుకు సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త మార్గాలను తెరపైకి తెస్తున్నారు. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ల వినియోగదారుల్లో ఎక్కువమంది ఉపయోగించే వాట్సాప్ ద్వారా మాల్‌వేర్‌లను చొప్పించే ప్రణాళికను ఇటీవల కాలంలో అమలు చేస్తున్నారు. ఆకుపచ్చ రంగులో కనిపించే వాట్సాప్... సరికొత్త ఫీచర్లతో గులాబీ రంగులో (పింక్) వచ్చిందంటూ బురిడీ కొట్టిస్తున్నారు. ఇందుకోసం వాట్సాప్‌ను అప్‌డేట్ చేసుకోవాలంటూ సైబర్ నేరగాళ్లు లింక్‌లు పంపుతున్నట్లు పోలీసులు హెచ్చరిస్తున్నారు. సాధారణ ఎస్ఎంఎస్‌లతో పాటు వాట్సాప్ మెసేజ్‌ల రూపంలో ఈ లింక్‌లు పంపుతున్నట్లు తెలిపారు. ఎవరైనా ఈ లింక్‌లను క్లిక్ చేసి అది అడిగే అప్‌డేట్ కోసం ఫోన్ నంబర్, ఓటీపీ ఎంటర్ చేస్తే ఫోన్లోని ఫొటోలు, కాంటాక్ట్ నంబర్లు, బ్యాంకుల పాస్‌వర్డ్‌ల వంటి వివరాలన్నీ సైబర్ నేరస్తుల చేతుల్లోకి వెళ్లిపోతాయని పోలీసులు చెబుతున్నారు. అలాగే ఆయా వ్యక్తులు సభ్యులుగా ఉండే వాట్సాప్ గ్రూప్‌లలోకి ఆటోమెటిక్‌గా పింక్ వాట్సాప్ పేరిట లింక్‌లు షేర్ అవుతాయని పేర్కొన్నారు. కీబోర్డ్ ఆధారిత మాల్‌వేర్‌లను పింక్ వాట్సాప్‌లోకి చొప్పించడం ద్వారా బ్యాంకు పాస్‌వర్డ్‌లను తస్కరించి సైబర్ నేరగాళ్లు డబ్బు కొట్టేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే పింక్ వాట్సాప్ పేరిట వచ్చిన లింక్‌లను ఓపెన్ చేసి ఎవరైనా ఇన్‌స్టాల్ చేసుకొని ఉంటే వాటిని వెంటనే అన్‌ఇన్‌స్టాల్ చేయాలని సూచిస్తున్నారు. అన్‌ఇన్‌స్టాల్ చేస్తేనే ఆ నకిలీ లింక్‌లను షేర్ కాకుండా ఆపగలుగుతామని చెబుతున్నారు. మనకు తెలిసిన వారి నుంచి ఇలా పింక్ వాట్సాప్ పేరిట ఏవైనా మెసేజ్‌లు వస్తే వారిని వెంటనే అప్రమత్తం చేయాలని సూచిస్తున్నారు.



రోగులకు వైద్యసేవల కల్పన, వారి సంరక్షణలో కీలకపాత్ర పోషించే నర్సుల అందుబాటు విషయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రభాగాన ఉంది. క్షేత్రస్థాయిలో వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలులో ముఖ్యపాత్ర పోషించే ఏఎన్ఎంలు ఎక్కువగా ఉన్న రాష్ట్రం కూడా మనదే కావడం గమనార్హం. నర్సులు, ఏఎన్ఎం, జీఎన్ఎంల సంఖ్యలో సంబంధిత విద్యలో ఏపీ ముందంజలో ఉందని ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ (ఐఎన్‌సీ) వెల్లడించింది. ఇందుకు సంబంధించి 2021-22 వార్షిక నివేదికను ఐఎన్‌సీ విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం.. నర్సులు, జీఎన్ఎం, ఏఎన్ఎంల సంఖ్యలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్రలు ముందున్నాయి.

\- సాక్షి, అమరావతి

ఏపీలో 1.39 లక్షల మంది ఏఎన్ఎంలు..

దేశవ్యాప్తంగా రిజిస్టర్డ్ ఏఎన్ఎంలు 9.82 లక్షల మంది ఉన్నారు. అయితే, ఏపీలోనే అత్యధికంగా 1.39 లక్షల మంది ఉన్నారు. రాజస్థాన్‌లో 1.10 లక్షలు, ఉత్తరప్రదేశ్‌లో 75వేల మంది ఉన్నారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణ కేవలం 10,219 మందితో 19వ స్థానంలో ఉంది. అయితే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్రవ్యాప్తంగా 15వేలకు పైగా గ్రామ, వార్డు సచివాలయాలను నెలకొల్పి సచివాలయానికొక ఏఎన్ఎంను నియమించిన విషయం తెలిసిందే.

ఏపీలోనే ఏఎన్ఎంలు ఎక్కువ

దేశంలో 9.82 లక్షల మంది ఉంటే ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 1.39 లక్షల మంది

- నర్సుల అందుబాటులో దేశంలో మూడో స్థానంలో ఏపీ
- నర్సింగ్ విద్యలోనూ ఏపీ టాప్-5లో
- ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ 2021-22 వార్షిక నివేదిక వెల్లడి

రిజిస్టర్డ్ నర్సులు దేశవ్యాప్తంగా 24.71 లక్షల మంది ఉన్నారు. తమిళనాడులో అత్యధికంగా 3.32 లక్షల మంది ఉండగా, కేరళలో 3.15 లక్షల మంది, మూడోస్థానంలో ఉన్న ఏపీలో 2.62 లక్షల మంది ఉన్నారు. తెలంగాణ 53,314 మందితో 14వ స్థానంలో ఉంది.

కొత్త కోర్సులు.. సెమిస్టర్ విధానం

నర్సింగ్ విద్యలో కౌన్సిల్ అనేక మార్పులు చేసింది. వైద్య రంగంలో వస్తున్న ఆధునిక మార్పుల నేపథ్యంలో సిలబస్‌లో సవరణలు చేసింది. బీఎస్సీ నర్సింగ్ విద్యలో ఇప్పుడు సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ సంవత్సరమే ఇది అమల్లోకి వచ్చింది. మరోవైపు.. డాక్టర్ ఆఫ్ నర్సింగ్ ప్రోగ్రాంను, ఈ-లెర్నింగ్ కోర్సులను ప్రవేశపెట్టింది. ఫౌండేషన్, కోర్, ఎలక్టివ్ కోర్సులు ప్రారంభించింది. గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో పేషెంట్ సెంటర్డ్ కేర్‌ను తీసుకొచ్చింది. ఇందులో రోగి వ్యక్తిగత ప్రాధాన్యతలు, అవసరాలను గుర్తించి సంపూర్ణమైన సేవలు అందించాల్సి ఉంటుంది.

నర్సింగ్ కౌన్సిల్ కొన్ని సూచనలు కూడా చేసింది. అవి..

- హెల్త్‌కేర్ రంగంలో వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి.
- రోగి విషయంలో తీసుకోవాల్సిన నిర్ణయాలపై సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి.
- వ్యక్తిగత పనితీరుతో రోగికి ఎలాంటి ప్రమాదం కలిగించకుండా వ్యవహరించాలి.
- స్కిల్ ల్యాబ్, క్లినికల్ లెర్నింగ్ పద్ధతులపై దృష్టి సారించాలి.

నర్సింగ్ విద్యలోనూ టాప్-5లో..

ఇక నర్సింగ్ విద్యలోను ఏపీ దేశంలోని టాప్-5 రాష్ట్రాల్లో ఒకటిగా ఉంది. 2022 మార్చి నాటికి ప్రభుత్వ, ప్రైవేట్ నర్సింగ్ కాలేజీల్లో బీఎస్సీ నర్సింగ్ సీట్లకు సంబంధించి కర్ణాటక మొదటి స్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో మొత్తం 19,860 సీట్లు ఉండగా, తమిళనాడులో 12వేలు, మధ్యప్రదేశ్‌లో 9వేలు, రాజస్థాన్‌లో 8,165 ఉన్నాయి. ఏపీ 8,030 సీట్లతో ఐదో స్థానంలో ఉంది. తెలంగాణ 4,980 సీట్లతో తొమ్మిదో స్థానంలో ఉంది. ఇక ఏఎన్ఎం విద్యకు సంబంధించి 910 సీట్లతో ఏపీ దేశంలో 12వ స్థానంలో, 455 సీట్లతో తెలంగాణ 17వ స్థానంలో ఉంది. మరోవైపు.. జీఎన్ఎం (జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ) సీట్లు తెలంగాణలో 3,962 ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో 7,125 ఉన్నాయి. ఇవి దేశంలోనే అత్యధికంగా కర్ణాటకలో 24,731 సీట్లున్నాయి. ఇక ఏఎన్ఎం స్కూళ్లు ఆంధ్రప్రదేశ్‌లో 31 ఉండగా, తెలంగాణలో 16 మాత్రమే ఉన్నాయి. అత్యధికంగా మహారాష్ట్రలో 545 స్కూళ్లు ఉన్నాయి. ఈ విషయంలో తెలంగాణ 18వ స్థానంలో ఉంది. జీఎన్ఎం స్కూళ్లు ఆంధ్రప్రదేశ్‌లో 163 ఉండగా, తెలంగాణలో 88 ఉన్నాయి. కర్ణాటకలో ఇవి అత్యధికంగా 520 ఉన్నాయి.

దిగులొద్దు తల్లీ!



- గర్భధారణ సమయంలో డిప్రెషన్‌తో ప్రసవం అనంతరం గుండె సమస్యలు
- అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్ వెల్లడి

సాక్షి, అమరావతి: గర్భధారణ సమయంలో మహిళల శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ మార్పుల మధ్య వారిలో మనస్థితి ఊగిసలాట (మూడ్ స్వింగ్స్), ఒత్తిడి, కోపం, నిరాశ (డిప్రెషన్) వంటివి కనిపిస్తుంటాయి. ఈ లక్షణాలు మరీ తీవ్రంగా మారితే తల్లీ, బిడ్డ ఇద్దరికీ ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయి. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం పడుతుంటుంది. ఇదిలావుంటే.. గర్భధారణ సమయంలో తీవ్రమైన డిప్రెషన్‌కు లోనైతే ప్రసవానంతరం గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెంచుతుందని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్ ఓ అధ్యయనాన్ని ప్రచురించింది.

1.20 లక్షల మంది గర్భిణులపై అధ్యయనం

అధ్యయనంలో భాగంగా 2007 నుంచి 2019 మధ్య ప్రసవించిన 1.20 లక్షల మంది స్త్రీల ఆరోగ్య వివరాలను పరిశోధకులు విశ్లేషించారు. అధిక రక్తపోటు కలిగిన గర్భిణులను అధ్యయనం నుంచి మినహాయించారు. ఈ క్రమంలో గర్భధారణ సమయంలో తీవ్ర డిప్రెషన్‌తో బాధపడిన మహిళల్లో 6 రకాల గుండె సంబంధిత జబ్బులు ప్రమాదం ఎక్కువగా ఉన్నట్టు తేల్చారు. ఇస్కిమిక్ గుండె జబ్బు (గుండె రక్తనాళాల సంకోచ వ్యాధి) ప్రమాదం 83 శాతం అధికంగా ఉందని గుర్తించారు. అదేవిధంగా కార్డియోమయోపతి (గుండె కండరాల వ్యాధి) బారినపడే ప్రమాదం 61 శాతం, అరిథ్మియా/కార్డియాక్ అరెస్ట్ (రక్తప్రసరణ లోపం/గుండెపోటు) ప్రమాదం 60 శాతం ఉన్నట్టు నిర్ధారించారు. కొత్తగా అధిక రక్తపోటు నిర్ధారణకు 32 శాతం, పక్షవాతం వచ్చే ప్రమాదం 27 శాతం ఉన్నట్టు తేల్చారు. ఈ నేపథ్యంలో గర్భధారణ సమయంలో స్త్రీలు వివిధ జాగ్రత్తలు తీసుకోవాలని పరిశోధకులు సూచించారు. తద్వారా తమకు దీర్ఘకాలంలో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా, ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారని తెలియజేశారు. గర్భంతో ఉన్న సమయంలో ప్రతి ఒక్కరూ మధుమేహం, కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకుని, వాటిని అదుపులో ఉంచుకోవాలని వైద్యులు పేర్కొన్నారు.

కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



మన దగ్గర కూడా ప్రసవానంతర కార్డియోమయోపతి (గుండె కండరాల వ్యాధి) కేసులు చూస్తుంటాం. గర్భధారణ సమయంలో తీవ్ర ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్‌కు లోనవడం వల్ల ఇది సంభవిస్తుంది. గర్భిణుల ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ఆ సమయంలో శరీరంలో అనేక మార్పులు సంభవిస్తుంటాయి. దీంతో గర్భిణులు ఆందోళన, ఒత్తిడి, నిరాశకు గురవుతుంటారు. దీనికి తోడు ఒత్తిడికి సంబంధించిన హార్మోన్లు ఎక్కువగా విడుదల అవుతుంటాయి. ఈ నేపథ్యంలో క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదిస్తుండాలి. ప్రస్తుతం ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్యులు గ్రామాలకు నెలలో రెండుసార్లు వెళుతున్నారు. దీంతో గర్భిణులు తమ సొంత ఊళ్లలోనే వైద్యుల సేవలు పొందొచ్చు. ఒత్తిడి, ఆందోళనను తగ్గించుకుని మనసు ప్రశాంతంగా ఉంచుకోవడానికి యోగా, ధ్యానం వంటివి చేయాలి. ఇష్టమైన సంగీతం వినాలి.

\- డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్, కర్నూలు

ఎస్సీ ప్రాంతాలకు రూ.3,853.93 కోట్లతో మంచినీరు

- జల్‌జీవన్ మిషన్ ద్వారా 45,13,256 మందికి మేలు
- తలసరి 55 లీటర్లు అందించేలా ప్రణాళిక
- నీటి ట్యాంకులు, పైపులైన్ నిర్మాణం
- ప్రతి ఇంటికి ట్యాప్ కనెక్షన్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎస్సీ నివాసిత ప్రాంతాల్లో మంచినీరు అందించేందుకు రూ.3,853.93 కోట్లు ఖర్చు చేస్తున్నారు. జల్‌జీవన్ మిషన్(జేఎంఎం) ద్వారా 45,13,256 మంది ఎస్సీలకు మేలు కలగనుంది. రాష్ట్రంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఎస్సీ, ఎస్టీ, మైదాన ప్రాంతాల్లో మొత్తం రూ.25,485.36 కోట్ల అంచనాతో 71,201 పనులు చేపట్టాలని ప్రతిపాదించారు. ఎస్సీ ప్రాంతాల్లో రూ.3,853.93 కోట్లతో తొలిదశ పనులు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో ఎస్సీలకు చెందిన 7,917 శివారు ప్రాంతాలున్నాయి. వాటిలో 4,852 ప్రాంతాలకు సమృద్ధిగా నీరు అందుతోంది. మరో 3,065 ప్రాంతాలకు నిర్దేశించినంత (మనిషికి 55 లీటర్లు) నీటి సరఫరాలేదని అధికారులు అంచనా వేశారు. దీంతో ఎస్సీ ప్రాంతాల్లో నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా మొత్తం 19,619 పనులు ప్రతిపాదించారు. నీటి ట్యాంకు (రక్షిత నీటిపథకాలు), పైపులైను వంటి నిర్మాణాలు చేపట్టనున్నారు. ఎస్సీ నివాసిత ప్రాంతాల్లో ప్రతి ఇంటికి ట్యాప్ కనెక్షన్ ఇచ్చేలా చర్యలు చేపట్టారు. 2024 నాటికి మొత్తం మూడుదశల్లో పనులు పూర్తిచేయాలని నిర్ణయించారు. ఎస్సీ కాలనీలు, ఎస్సీలు అత్యధికంగా నివసిస్తున్న ప్రాంతాలు, జగనన్న కాలనీల్లో వాటర్ ట్యాంకులు, పైపులైన్లు, ట్యాప్ కనెక్షన్లు ఇచ్చే పనులు పూర్తయితే 45,13,256 మంది ఎస్సీలకు లబ్ధికలుగుతుంది.

వేగంగా పనులు పూర్తి చేస్తాం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల భాగస్వామ్యంతో చేపట్టిన పనుల్ని వేగవంతంగా పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాం. అత్యవసరమైన రక్షిత మంచినీటి సౌకర్యాన్ని మెరుగుపరచాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాలతో ఇప్పటికే పనుల పురోగతిపై సమీక్షించాం. పనులకు అడ్డంకులు లేకుండా చూడటం, వేగంగా జరిగేలా చూడటం, బిల్లుల చెల్లింపు వంటి అన్ని అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ కార్యక్రమాన్ని ఉపయోగించుకుని రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, మైదాన ప్రాంతాల్లో అవసరమైనమేరకు మంచినీటిని అందించడం కోసం కృషిచేస్తోంది. గ్రామీణ నీటిసరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) యంత్రాంగం సమన్వయంతో ప్రస్తుత వేసవిలో ఎక్కడా మంచినీటి కొరత తలెత్తకుండా చేశాం.

\- మేరుగు నాగార్జున, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి

ఎన్నికలవేళ బాబు కపట ప్రేమ!

- నాడు అధికారంలో ఉండగా హజ్ యాత్రికులపై ఎంతో నిర్లక్ష్యం..
- ఐదేళ్లు అధికారంలో ఉండగా ఏమాత్రం పట్టించుకోని వైనం
- 2018లో తన వద్దకే హాజీలను రప్పించుకుని పడిగాపులు పెట్టించిన చంద్రబాబు..
- నేడు తాత్కాలిక హాజ్‌హౌస్‌కి వెళ్లి రాజకీయాలు..

సాక్షి, అమరావతి: ప్రతి విషయంలోను రాజకీయ లబ్ధిని వెతికే చంద్రబాబు పవిత్ర హజ్ యాత్రను కూడా వదల్లేదు. నాడు వారిని ఎంతో నిర్లక్ష్యం చేసిన ఆయన నేడు మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కపట రాజకీయానికి తెరతీయడంపట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి.. అధికారంలో ఉన్నప్పుడు హజ్ యాత్రికులను పట్టించుకోలేదన్నది జగమెరిగిన సత్యం. అసలు 2018లో హాజీలను ఉండవల్లిలోని తన నివాసానికి పిలిపించుకున్న తీరు అప్పట్లో విమర్శలపాలైంది. పవిత్ర యాత్రకు వెళ్లే వారి దగ్గరకే చంద్రబాబు వెళ్లకుండా ఆయన వద్దకే వారిని పిలుపించుకుని వారిని ఐదు గంటలకుపైగా పడిగాపులు పడేలా చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. అలాగే, ఆ ఐదేళ్లలో విజయవాడ హజ్‌హౌస్ నిర్మాణానికి కనీసం ప్రతిపాదన కూడా చేయని బాబు ఎంబార్కేషన్ పాయింట్‌ను కూడా పట్టించుకోలేదు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మళ్లీ ముస్లింలపై కపట ప్రేమ కనబరుస్తూ హాజీలను కలవడం గమనార్హం.

సీఎం జగన్‌ను ముస్లింలు సొంతం చేసుకున్నారనే..

చెప్పినవే కాకుండా చెప్పనివి కూడా చేసి చూపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముస్లింలు సొంతం చేసుకున్నారనే కలవరంతోనే తాజాగా హజ్ యాత్రికులను చంద్రబాబు కలిశారని స్పష్టమవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా హజ్-2023 యాత్రను గన్నవరం విమానాశ్రయం నుంచి విజయవంతంగా నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో చర్యలు చేపట్టింది. నంబూరులోని మదరసాలో తాత్కాలిక హజ్ హౌస్‌ను నిర్వహించడంతోపాటు హాజీలకు వసతి, భోజన, రవాణా సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం వారి మన్ననలు పొందింది. దీంతో సీఎం వైఎస్ జగన్‌కు ముస్లిం సమాజంలో మరింత ఆదరణ పెరిగింది. దీన్ని గమనించిన చంద్రబాబు.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాత్కాలిక హజ్ హౌస్‌కు వెళ్లి దాన్ని రాజకీయ వేదికగా వాడుకునేందుకు తెరతీశారు. ఈ నేపథ్యంలోనే టీడీపీ సీనియర్ నేత, శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ నేతృత్వంలో ఒక బృందాన్ని ముందుగా పంపి బాబు వస్తారంటూ చెప్పించినట్లు సమాచారం. అందుకు అక్కడి హాజీలు సానుకూలంగా స్పందించలేదు. చివరకు సీఎం వైఎస్ జగన్ గురువారం వెళ్లి హాజీలను ఆప్యాయంగా పలకరించి వారికి ప్రభుత్వం తరఫున భరోసా ఇచ్చి వచ్చిన గంటలోనే చంద్రబాబు అక్కడికి వెళ్లి హైడ్రామా చేయడం కొసమెరుపు.

ఎన్నికల వేళే బాబుకు ముస్లింలపై ప్రేమ



ముస్లింలను ఏనాడు పట్టించుకోని చంద్రబాబు మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయని హాజీలపై ఎక్కడలేని ప్రేమ పుట్టుకొచ్చింది. సీఎం జగన్ మాత్రం రాజకీయాలకు అతీతంగా చిత్తశుద్ధితో పవిత్ర హజ్ యాత్ర విజయవంతం కోసం తగిన చర్యలు చేపట్టారు. గతంలో ఎన్నడులేని విధంగా విజయవాడకు ఎంబార్కేషన్ పాయింట్ సాధించడమే కాకుండా హాజీలపై పడుతున్న అదనపు భారం రూ.14.51 కోట్లు రాష్ట్ర ప్రభుత్వమే భరించేలా, వారి ఖాతాలకు జమ చేయడానికి స్పందించిన తీరు జగన్ పెద్ద మనస్సుకు అద్దంపడుతుంది. విజయవాడలో రాష్ట్ర హజ్‌హౌస్ నిర్మాణానికి అవసరమైన స్థల ఎంపిక చేసేందుకు జగన్ ఆదేశాలిచ్చారు. నంబూరులో నిర్వహించిన తాత్కాలిక హజ్‌హౌస్‌లో హాజీలకు సౌకర్యాలు కల్పించాం.

\- అంజాద్ బాషా, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి

చంద్రబాబుకు ఇది తగదు..



గత ప్రభుత్వం ముస్లింలను పట్టించుకోకపోగా వారిపై దేశద్రోహం కేసులు వంటి చర్యలతో కక్ష సాధింపులకు పాల్పడిన సంగతి ముస్లిం సమాజం ఇంకా మరిచిపోలేదు. చంద్రబాబు గతంలో హజ్ ప్రాంగణానికి వెళ్లి హాజీలను పలకరించిన సందర్భాలు, వీడ్కోలు పలికిన దాఖలాల్లేవు. ఐదేళ్లపాటు హజ్ యాత్రను అంతగా పట్టించుకోని చంద్రబాబు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని వచ్చారు. ముస్లింలకు సరైన పదవులూ ఇవ్వలేదు. కానీ, ఎన్నికల ఏడాది మాత్రం చంద్రబాబుకు ముస్లింలు గుర్తుకొస్తారు. చంద్రబాబు రాజకీయ డ్రామాలను ముస్లింలు నమ్మే స్థితిలో లేరు.

\- షేక్ మునీర్ అహ్మద్, ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) రాష్ట్ర కన్వీనర్

తెలంగాణ

అడ్డదారులు తొక్కితే నిషేధమే!

- ఎంబీబీఎస్ ప్రవేశాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.2 కోట్లు జరిమానా
- మెడికల్ కాలేజీలకు జాతీయ మెడికల్ కమిషన్ హెచ్చరిక
- తప్పుడు పద్ధతుల్లో కోర్సుల్లో చేరితే విద్యార్థులపై వేటు
- దేశవ్యాప్తంగా ఒకేసారి ఉమ్మడి కౌన్సెలింగ్
- కనీస అర్హత మార్కుల ద్వారానే అడ్మిషన్లు
- కాలేజీలకు రేటింగ్, అనుమతుల కోసం 'మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డు'
- దీని ముందస్తు అనుమతితోనే కొత్త కాలేజీలు, కోర్సుల ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: వైద్య విద్య (ఎంబీబీఎస్) ప్రవేశాల్లో అడ్డదారులు తొక్కే మెడికల్ కాలేజీలపై నిషేధం విధిస్తామని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) హెచ్చరించింది. తప్పుడు పద్ధతుల్లో ఇచ్చే మొదటి సీటుకు రూ.కోటి, రెండో సీటుకు రూ.2 కోట్లు జరిమానా విధిస్తామని.. మరోసారి తప్పు చేస్తే తదుపరి ఏడాది సంబంధిత మెడికల్ కాలేజీని నిషేధిస్తామని స్పష్టం చేసింది. దేశంలో పలుచోట్ల అడ్డదారిన మెడికల్ ప్రవేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. దేశవ్యాప్తంగా అన్ని మెడికల్ కాలేజీలు ఒకేసారి కౌన్సెలింగ్ నిర్వహించేలా ఉమ్మడి కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టాలని సూచించింది. ఉమ్మడి కౌన్సెలింగ్ పూర్తయిన వారం రోజుల్లో విద్యార్థుల తుది జాబితాను తమకు సమర్పించాలని ఆదేశించింది. ఈ మేరకు మెడికల్ అడ్మిషన్లు తదితర అంశాలపై వివిధ గెజిట్ నోటిఫికేషన్లను జారీచేసింది.

బ్లాక్ చేసి అమ్ముకుంటూ..

దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీలు ఎంబీబీఎస్ సీట్లను బ్లాక్ చేసి కోట్ల రూపాయలకు అమ్ముకుంటున్న ఉదంతాలు ఎన్నో బయటపడుతున్నాయి. ముఖ్యంగా బీ కేటగిరీ సీట్లను ఎన్నారై సీట్లుగా మార్చుకోవడం, తప్పుడు అర్హతలున్నా సీట్లు ఇవ్వడం, అడ్మిషన్ల కాలపరిమితి ముగిసిన తర్వాత కూడా సీట్లు కేటాయించడం వంటి అక్రమాలు జరుగుతున్నాయి. దీనితో అర్హులైన విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది. ఈ క్రమంలో ఎన్ఎంసీ కఠిన నిర్ణయం తీసుకుంది. ఇక ఎంబీబీఎస్ అడ్మిషన్ల కోసం తప్పుడు మార్గాలు అనుసరించే విద్యార్థులపైనా వేటు వేస్తామని ఎన్ఎంసీ స్పష్టం చేసింది.

ఇక నుంచి మెడికల్ కాలేజీలకు రేటింగ్

వైద్య కాలేజీల ఏర్పాటు, కొత్త కోర్సుల అనుమతి కోసం ఎన్ఎంసీ నిబంధనలను విడుదల చేసింది. వీటి అమలుకు 'మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డు (మార్బ్)'ను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించింది. మార్బ్ నుంచి లిఖితపూర్వక అనుమతులు లేకుండా కొత్తగా వైద్య కాలేజీలు ఏర్పాటు చేయడానికిగానీ, కొత్త కోర్సులు ప్రారంభించడానికిగానీ వీల్లేదు. ఎంబీబీఎస్, పీజీ కోర్సుల కోసం కొత్త కాలేజీల ఏర్పాటుకు ఈ సంస్థ దరఖాస్తులు ఆహ్వానించినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో ఏర్పాటైన స్వయం ప్రతిపత్తి సంస్థలు, సొసైటీస్ రిజిస్ట్రేషన్ యాక్ట్ కింద ఏర్పాటైన కంపెనీలు దరఖాస్తు చేసుకోవచ్చు. మార్బ్ అన్ని కోణాల్లో పరిశీలించి అనుమతి ఇస్తుంది. మార్బ్ అనుమతి లేకుండా ఇప్పటికే తరగతులు నిర్వహిస్తున్న ఏ మెడికల్ కాలేజీలో కూడా సీట్లు పెంచడానికి వీల్లేదు. మార్బ్ థర్డ్ పార్టీ సంస్థల సాయంతో మెడికల్ కాలేజీల పనితీరును పరిశీలించి రేటింగ్ ఇస్తుంది.

గుర్తింపు పొందిన వైద్య అర్హత లేకుంటే ప్రాక్టీస్ చేయొద్దు

గుర్తింపు పొందిన వైద్య అర్హతలు లేకుండా ఏ వ్యక్తి కూడా మెడికల్ ప్రాక్టీస్ చేయకూడదని ఎన్ఎంసీ స్పష్టం చేసింది. ఇందుకోసం 'మెడికల్ ప్రాక్టీషనర్ల నమోదు, మెడిసిన్ నిబంధనల ప్రాక్టీస్ లైసెన్స్-2023'ను విడుదల చేసింది. మెడికల్ ప్రాక్టీస్ చేయడానికి లైసెన్సు కోసం నేషనల్ మెడికల్ రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలి. విదేశాల్లో వైద్యవిద్య చదివినవారు జాతీయ స్థాయిలో సంబంధిత పరీక్ష పాస్ కావాలి. రాష్ట్ర వైద్య మండలిలో దరఖాస్తు ఆమోదం పొందిన తర్వాత, అది జాతీయ వైద్య రిజిస్టర్‌లోనూ, రాష్ట్ర వైద్య రిజిస్టర్‌లో కూడా కనిపిస్తుంది. రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్‌కు జారీచేసిన మెడిసిన్ ప్రాక్టీస్ లైసెన్స్ ఐదేళ్ల వరకు చెల్లుబాటు అవుతుంది. తర్వాత స్టేట్ మెడికల్ కౌన్సిల్‌కు దరఖాస్తు చేసుకుని లైసెన్స్‌ను పునరుద్ధరించుకోవాలి.

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో వైద్యం

అత్యున్నత, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దేశవ్యాప్తంగా వైద్య విద్య ఉండాలని ఎన్ఎంసీ స్పష్టం చేసింది. అందుకోసం 'గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్స్-2023'ను విడుదల చేసింది. విద్యార్థికి ఉన్నతమైన, నాణ్యమైన ఎంబీబీఎస్ లేదా ఇతర అండర్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యను అందించడానికి తగిన ప్రణాళికను అమలు చేయాలని సూచించింది. థియరీతోపాటు క్లినికల్, ప్రాక్టికల్ స్కిల్స్‌లో శిక్షణ అందించాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	223	62,626
నిఫ్టీ ▽	71	18,563

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	13,259	△	21
డోజోన్స్	33,877	△	43
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,562	▽	38
డాక్స్	15,950	▽	40
షాంఘై	3,231	△	18
నికాయ్	32,265	▽	624

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

వృద్ధాప్యంలో ఆదాయానికి ప్రణాళిక..

రిటైర్మెంట్ తర్వాతా సంపద సృష్టి అవసరమే • ఈక్విటీలపైనా దృష్టి అవసరాలకు మించి రాబడులు ఉండాలి • ఇందుకు మెరుగైన ప్రణాళికే మార్గం ముందుగా మొదలు పెడితే సులభతరం

ప్రభుత్వరంగ ఉద్యోగులను మినహాయిస్తే మిగిలిన వారికి పదవీ విరమణ ప్రణాళిక తప్పనిసరి. ఉద్యోగం లేదా వృత్తి జీవితం ప్రారంభించినప్పుడే, దాన్ని విరమించే రోజు కోసం ప్రణాళిక రూపొందించుకోవాలి. విశ్రాంత జీవనాన్ని హాయిగా గడిపేందుకు తగినంత నిధిని సమకూర్చుకోవడమే కాదు, ఆ నిధిపై రాబడికీ అనుకూలమైన వ్యూహం ఉండాలి. మనలో చాలా మంది రిటైర్మెంట్ లక్ష్యానికి పెద్దగా ప్రాధాన్యం ఇవ్వరు. కానీ, ఆలస్యంగా దీని అవసరం తెలిసి వస్తుంది. అప్పుడు మేల్కొన్నా, సంపాదనకు ఎక్కువ కాలం మిగిలి ఉండకపోవచ్చు. కనుక ఆరంభంలోనే దృష్టి పెట్టాల్సిన దీన్ని.. అవగాహన లేమి, నిర్లక్ష్యంతో వాయిదా వేసుకోవద్దు. తగిన ప్రణాళికతోనే రిటైర్మెంట్ లక్ష్యాన్ని అధిగమించగలమని ఆర్థిక నిపుణులు తెలియజేస్తున్నారు.



ఎంత నిధి కావాలి?

రిటైర్మెంట్‌కు కావాల్సినంత నిధి నా దగ్గర ఉందా..? ఎవరికివారు ఈ ప్రశ్న వేసుకోవాలి. ఎందుకంటే అందరికీ ఒక్కటే నిధి ఇక్కడ పనిచేయకపోవచ్చు. మీ అవసరాలు, వ్యయాలపైనే ఇది ఆధారపడి ఉంటుంది. రిటైర్మెంట్ ఫండ్ కోసం మెరుగైన పెట్టుబడుల ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. ఇందుకు వాస్తవిక అంచనాలు వేసుకోవాలి. మీ నెలవారీ వ్యయాలు ఎంత? 12 నెలలకు ఎంత మొత్తం కావాలో లెక్కించాలి. అంత మేర ఏటా ఆదాయం తెచ్చి పెట్టేంత నిధి మీకు రిటైర్మెంట్ తర్వాత అవసరం అవుతుంది. ఇతరత్రా వేరే ఆదాయ వనరులు ఉంటే వాటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. రిటైర్మెంట్ కోసం సన్నద్ధం అయ్యేందుకు ఏఏ అంశాలపై దృష్టి పెట్టాలో తెలుసుకోవడం కీలకం అవుతుంది. తాము ఎంత కాలం పాటు జీవిస్తామనే విషయం ఎవరికీ తెలియదు. కనుక చిరాయువుగా జీవించేందుకు సన్నద్ధం కావాలి. ముఖ్యంగా రాబడులకు మించి జీవించకూడదు. అందుకే ప్రణాళిక అవసరం. మీ అవసరాలకు మించి పెట్టుబడి నిధి కరిగిపోకుండా ఇది మార్గం చూపుతుంది. ప్రస్తుత విలువల ప్రకారం వార్షిక ఖర్చులకు 20 నుంచి 25 రెట్ల సరిపడా నిధిని సమకూర్చుకుంటే అది మీ అవసరాలను తీరుస్తుంది. ఇది అంత సౌకర్యవంతమైన నిధి కాకపోయినా, మీ అవసరాలను తీరుస్తుంది. మీ అవసరాలకు సరిపడా ఆదాయాన్ని ఇవ్వడంతోపాటు, భవిష్యత్తులో పెరిగే ఖర్చులకు తగ్గట్టు ఆదాయాన్ని వృద్ధి చేసే ప్రణాళిక వేరు. మీ ఆదాయం, వెసులుబాటు ఆధారంగా చాలా శ్రద్ధగా ప్రణాళిక వేసుకోవాలి. మధ్యలో అత్యవసరం ఏర్పడినా గట్టెక్కే నిధి వేరుగా ఉండాలి.

రిటైర్మెంట్ తర్వాత కూడా ఈక్విటీల్లో పెట్టుబడులు కలిగి ఉండాలి. ఎందుకంటే నేటి కంటే, రేపటి రోజు మరింత మొత్తం జీవనానికి ఖర్చు అవుతుంది. కనుక మన నిధి మరింత ఆదాయన్నిచ్చే విధంగా వృద్ధి చెందుతూ ఉండాలి. మీ వద్దనున్న నిధి నుంచి ఏటా 5% చొప్పున వెనక్కి తీసుకుంటున్నారనుకోండి. వచ్చే ఏడాది కూడా అదే 5% సరిపోవచ్చు. కానీ ఐదు, పదేళ్ల తర్వాత అంతే మొత్తం సరిపోకపోవచ్చు. ఎందుకంటే పదేళ్ల కాలంలో పెట్టుబడి దాని విలువను కోల్పోతుంది.

ఈక్విటీ పెట్టుబడులూ అవసరమే

కనుక ఇక్కడ నుంచి మరో ఐదు పదేళ్ల తర్వాత అవసరాలకు మరింత మొత్తం కావాలి. మీరు మీ ఫండ్ మొత్తాన్ని స్థిరాదాయ సాధనంలో ఇన్వెస్ట్ చేశారనుకోండి.. అది పెరిగే అవసరాలకు, కరిగిపోయే కరెన్సీ విలువకు తగినంత మద్దతుగా నిలవదు. ఎక్కువ మంది రిటైర్మెంట్ తర్వాత రిస్క్ వద్దని అనుకుంటుంటారు. కానీ, భవిష్యత్తులో వచ్చే భారీ ఖర్చులను భరించేంత ఆదాయానికి తగ్గ ప్రణాళిక ఉండాలి. కనుక మెరుగైన రాబడుల కోసం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయడం మినహా మరో మార్గం లేదు. రిటైర్మెంట్ తర్వాత ఈక్విటీ రిస్క్ తీసుకోవడం ఎందుకని కొందరు అనుకోవచ్చు. అస్థిరతలు/ఆటుపోట్లు అన్నవి రిస్క్ కాదు. ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసినప్పుడు అది రిస్క్ అనుకుంటే.. మరి ఎలక్ట్రిసిటీ గురించి ఏమని అనుకోవాలి. ప్రమాదకరమైన విద్యుత్‌ను వాడుకుంటూ మనం జీవించడం లేదా..? అలాగే, ఈక్విటీలను మనకు అనుకూలంగా వినియోగించుకోవాలి. ఈక్విటీ పోర్ట్‌ఫోలియో ఏర్పాటులో జాగ్రత్తగా వ్యవహరిస్తే చాలు. ఒకేసారి ఇన్వెస్ట్ చేయకుండా, నిర్ణీతకాలం లోపు ఆ మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టాలి. పెట్టుబడులను వైవిధ్యం చేసుకోవాలి. నిర్ణీత కాలానికి ఒకసారి చొప్పున రీబ్యాలన్స్ (మార్పులు చేర్పులు) చేసుకుంటూ వెళ్లాలి.

అస్సెట్ అలోకేషన్

అస్సెట్ అలోకేషన్ అనేది మీ సౌకర్యం కోసం అనుసరించే విధానం. మార్కెట్లు పడిపోయినప్పుడు దీనివల్ల సౌకర్యంగా ఉండొచ్చు. స్వభావ రీత్యా ఈక్విటీల పట్ల రక్షణాత్మకంగా లేదా దూకుడుగా ఉన్నా కానీ.. ఆరంభంలో రక్షణాత్మకంగానే కేటాయింపులు చేసుకోవాలి. ఎంత ధైర్యవంతులైనా సరే మార్కెట్లు పడిపోయినప్పుడు ఆందోళన చెందడం సహజం. కనుక మొదటిసారి ఇన్వెస్టర్ అయినా, రక్షణ ధోరణితో కూడిన ఇన్వెస్టర్ అయినా ఈక్విటీలకు కేటాయింపులు 25 శాతం లేదా 33 శాతంగానే ఉండాలి. దీన్ని పేపర్‌పై రాసుకోవాలి. మొదటి కొన్నేళ్లపాటు ఇదే విధానాన్ని అనుసరించాలి. ఏడాదికోసారి ఈ కేటాయింపులను సమీక్షించుకోవాలి. దీన్నే అస్సెట్ అలోకేషన్ అంటారు. ఉదాహరణకు ఈక్విటీలకు 33 శాతం కేటాయింపులు చేయాలన్నది మీ ప్రణాళిక. ఏడాది కాలంలో మార్కెట్ ర్యాలీతో మొత్తం పెట్టుబడుల్లో ఈక్విటీల వాటా 50 శాతానికి చేరిందని అనుకుందాం. అప్పుడు 33 శాతానికి దిగొచ్చే విధంగా ఈక్విటీ పెట్టుబడులను విక్రయించాలి. మిగిలిన మొత్తాన్ని డెట్‌కు మళ్లించుకోవాలి. ఇలా కొంత కాలం చేసిన తర్వాత ఈక్విటీల పట్ల అవగాహన, నమ్మకం పెరుగుతుంది. అప్పుడు అవసరానికి అనుగుణంగా అస్సెట్ అలోకేషన్‌ను సవరించుకోవచ్చు. రిటైర్మెంట్ ఫండ్‌పై 3.5–4 శాతం రాబడి వచ్చినా సరిపోతుందని అనుకుంటే అప్పుడు మీ దగ్గర మెరుగైన ఫండ్ ఉన్నట్టుగా భావించాలి. ఇలాంటి వెసులుబాటు ఉన్న వారు రిటైర్మెంట్ ఫండ్‌ను ఈక్విటీ, డెట్‌కు సమానంగా కేటాయించుకోవచ్చు. లేదా ఈక్విటీకి 40 శాతం, డెట్‌కు 60 శాతం కేటాయించుకోవచ్చు. 5–20 శాతాన్ని షార్ట్ టర్మ్ డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. పీపీఎఫ్, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్‌నకు కేటాయింపులు చేసుకోవాలి. ఇక తమపై ఆధారపడిన వారు లేకపోతే.. అప్పుడు 25 లేదా 33 శాతాన్ని డెట్‌కు కేటాయించి, మిగిలిన మొత్తాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. దీన్ని రీబ్యాలన్స్ చేసుకుంటూ ఉండాలి.





రిటైర్మెంట్ నాటికి రుణ భారం నుంచి పూర్తిగా బయటకు రావాలి. అన్ని పెట్టుబడులకూ ఒక్కటే బ్యాంక్ ఖాతా వినియోగించాలి. పెట్టుబడుల కేటాయింపులు (అస్సెట్ అలోకేషన్) ఏ విభాగానికి ఎంత మేర ఉండాలో నిర్ణయించుకోవాలి. ఈక్విటీలకు 50 శాతమా లేక 40 లేదా 25 శాతమా.. అలాగే డెట్‌కు ఎంతన్నది తేల్చుకోవాలి. వీటి నుంచి అవసరాలకు సరిపడా ప్రతి నెలా రాబడి వచ్చేలా చూసుకోవాలి. ఇతర వనరుల ద్వారా ఆదాయం వస్తుందేమో చూసుకోవాలి. పింఛను సదుపాయం ఉందా? ఉంటే వచ్చే మొత్తం సరిపోతుందా? అద్దె రూపంలో ఆదాయం వచ్చే మార్గం ఉందా? డివి

కార్యాచరణ ప్రణాళిక..

డెండ్ల రూపంలో ఆదాయం వస్తుందా? విదేశాల్లో స్థిరపడిన పిల్లల నుంచి రెమిటెన్స్ వస్తుందా? ఇలా అన్ని రూపాల్లోని ఆదాయ వనరులను లెక్కించుకోవాలి. అప్పుడు మీ నెలవారీ ఖర్చులకు సరిపడా ఆదాయం వస్తే నిశ్చింతగా ఉండొచ్చు. తరుగు ఉంటే ఆ మేరకు పెట్టుబడుల నుంచి ఆదాయం వచ్చే ఏర్పాటు చేసుకోవాలి. మీ ఖర్చులకు మించి ఆదాయం వస్తుంటే సంతోషంగా విశ్రాంతి జీవనాన్ని గడిపేయొచ్చు. మిగులు ఉంటే ఆ మొత్తాన్ని తిరిగి ఇన్వెస్ట్ చేసుకోవడమే సరైనది. మీ పెట్టుబడి నుంచి తీసుకునే మొత్తం రాబడి కంటే ఎక్కువ ఉండకూడదు. అలాగే, మీ పెట్టుబడి నుంచి తీసుకునే మొత్తం రాబడికి సమాన స్థాయిలోనూ ఉండకూడదు. ఎందుకంటే ఏటా ద్రవ్యోల్బణ ప్రభావంతో 5–6 శాతం మేర పెట్టుబడి విలువ క్షీణిస్తుంది. కనుక పెట్టుబడి నుంచి తీసుకునే మొత్తం రాబడి కంటే తక్కువే ఉండాలి. అప్పుడే మీ పెట్టుబడి భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వృద్ధి చెందుతుంది. ఒకవేళ మీ పెట్టుబడిపై వచ్చే ఆదాయానికి సమాన స్థాయిలో ప్రతి నెలా ఉపసంహరించుకుంటున్నారని అనుకుందాం. అలాంటి సందర్భాల్లో భవిష్యత్తులో పెరిగే ఖర్చులకు సరిపడా ఆదాయం పెంచుకునేందుకు కొంత మొత్తాన్ని ప్రతి నెలా ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లాలి. సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్, పీపీఎఫ్‌లో పెట్టుబడులు కొనసాగించండి. ఎందుకంటే ఇవి సురక్షితమైన, మెరుగైన రాబడులు కలిగిన డెట్ సాధనాలు. ఏటా ఏప్రిల్‌లో సమీక్ష నిర్వహించుకోవాలి. క్రితం ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీలపై రాబడులు ఏ మేరకు ఉన్నాయి? డెట్‌లో ఏ మేరకు రాబడి వచ్చింది? అన్ని పరిశీలించుకోవాలి. ఉదాహరణకు 2013లో రూ.50 లక్షలను ఈక్విటీ, డెట్‌లో సమానంగా ఇన్వెస్ట్ చేశారని అనుకుందాం. ఏటా మీ అవసరాలకు 6 శాతం ఉపసంహరించుకోవాలన్నది ప్రణాళిక. అప్పుడు ఒక ఏడాదికి రూ.3 లక్షలు అవసరం అవుతుంది. అదే 2014లో రూ.3,18,000 అవసరం అవుతుంది. ఇలా ఏటా ఉపసంహరించుకోవాల్సిన మొత్తం పెరుగుతూ వెళుతుంది. ఈ ప్రకారం 2023లో రూ.4,32,000 అవసరం అవుతుంది. 6 శాతం ఉపసంహరించుకోవాలన్నది ప్రణాళిక. కనుక ఇప్పుడు మీ వద్ద రూ.72,00,000 పెట్టుబడి ఉండాలి. అప్పుడే 6 శాతం చొప్పున రూ.4,32,000 తీసుకోగలరు. అందుకే మీ పెట్టుబడి నిధి కూడా వృద్ధి చెందాలి.

జూన్ త్రైమాసికంలో వృద్ధి 6.3 శాతంలోపే..: మూడీస్

ఆర్‌బీఐ అంచనాలకన్నా తక్కువ



న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) 6 నుంచి 6.3 శాతం మధ్య ఉండే అవకాశం ఉందని అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజ సంస్థ– మూడీస్ అంచనావేసింది. ప్రభుత్వానికి అంచనాలకన్నా తక్కువ ఆదాయాలు నమోదయ్యే అవకాశాలు దీనికి కారణంగా పేర్కొంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గత వారం ద్రవ్య పరపతి విధాన సమీక్షలో వేసిన 8 శాతం అంచనాలకన్నా తాజా మూడీస్ అంచనా ఎంతో దిగువన ఉండడం గమనార్హం. 2022–23 చివరి త్రైమాసికం (జనవరి–మార్చి)లో నమోదయిన 6.1 శాతానికి దాదాపు సరిసమానంగా ఉండడం మరో విశేషం. వ్యవస్థలో అధిక వడ్డీరేట్లు పెట్టుబడులపై ప్రభావం చూపుతాయని కూడా మూడీస్ అభిప్రాయపడింది. 2023–24, 2024–25 ఆర్థిక సంవత్సరాల్లో వృద్ధి రేట్లు వరుసగా 6.1 శాతం, 6.3 శాతాలుగా నమదవుతాయని మూడీస్ అంచనా. మూడీస్ భారత్‌కు ప్రస్తుతం 'బీఏఏ3' రేటింగ్ ఇస్తోంది. ఇది అత్యంత దిగువ ఇన్వెస్ట్‌మెంట్ స్థాయి. చెత్త రేటింగ్‌కన్నా ఒక అంచె ఎక్కువ. మరో రెండు అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజాలు ఫిచ్, ఎస్‌అండ్‌పీ కూడా భారత్‌కు ఇదే తరహా రేటింగ్ ఇస్తున్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-6-2023	
విశాఖ	515–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	470–00
విజయవాడ	470–00
రిటైల్ ధర (డజను)	72.00
11-6-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	500–00
వరంగల్	502–00
రిటైల్ ధర	5.60

స్టాక్స్ వ్యూ

హ్యాపీయెస్ట్ మైండ్స్ | చాయిస్ ఇంటర్నేషనల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 915
టార్గెట్: రూ. 1,096



ఎందుకంటే: సాఫ్ట్‌వేర్ సేవల దేశీ కంపెనీ హ్యాపీయెస్ట్ మైండ్స్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో పటిష్ట పనితీరు ప్రదర్శించింది. జనవరి–మార్చి(క్యూ4)లో మొత్తం ఆదాయం వార్షికంగా 26 శాతం జంప్‌చేసింది. రూ. 378 కోట్లను తాకింది. కరెన్సీ నిలకడ(సీసీ) ప్రాతిపదికన 15 శాతం వృద్ధితో 4.6 కోట్ల డాలర్లకు చేరింది. మొత్తం ఆదాయంలో తదుపరి తరం డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ విభాగం నుంచే 96 శాతాన్ని సమకూర్చుకుంది. దీనిలో 94 శాతం ఎగైల్ బిజినెస్ సొల్యూషన్ల నుంచే సాధించింది. క్యూ4 ఫలితాలలో 2023 జనవరిలో సొంతం చేసుకున్న ఎస్‌ఎంఐ బిజినెస్(రూ. 18 కోట్లు) పనితీరు కలసి ఉంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో మరింత పటిష్ట ఫలితాలు సాధించనున్నట్లు యాజమాన్యం పేర్కొంది. ఇందుకు ఇప్పటికే గెలుపొందిన డీల్స్‌తోపాటు.. మరిన్ని కాంట్రాక్టులపై అంచనాలు దోహదపడినట్లు తెలియజేసింది. గతేడాది క్యూ4లో వడ్డీ, పన్ను చెల్లింపునకు ముందు(ఇబిట్) మార్జిన్లు వార్షిక ప్రాతిపదికన నిలకడ చూపుతూ 21 శాతం వద్దే నిలిచాయి. క్యూ3లో సాధించిన 80.1 శాతం వినిమయ(యుటిలైజేషన్) రేటుతో పోలిస్తే 74.6 శాతానికి తగ్గడం మార్జిన్లపై ప్రభావం చూపింది. అయితే పూర్తి ఏడాదికి 26 శాతానికిపైగా నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు సాధించింది. ఇది తొలి అంచనాల(గైడెన్స్) 22–24 శాతానికంటే అధికం. క్లౌడ్ మైగ్రేషన్, లెగసీ అప్లికేషన్లుసహా, ప్లాట్‌ఫామ్స్ ఆధునీకరణ, డేటా ప్లాట్‌ఫామ్స్ ఏర్పాటు, అనలిటిక్స్ వినియోగం తదితర సర్వీసులు కంపెనీకి భవిష్యత్‌లో లబ్దిని చేకూర్చే వీలుంది.

సఫారీ ఇండస్ట్రీస్ | ఐడీబీఐ క్యాపిటల్ ఈక్విటీ రీసెర్చ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 2,871
టార్గెట్: రూ. 3,223



ఎందుకంటే: బ్రాండెడ్ లగేజీ, ఫ్యాషన్ ప్రొడక్టుల తయారీ కంపెనీ సఫారీ ఇండస్ట్రీస్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో అంచనాలను మించిన పనితీరు ప్రదర్శించింది. జనవరి–మార్చి(క్యూ4)లో మొత్తం ఆదాయం వార్షికంగా 57 శాతం జంప్‌చేసింది. రూ. 302 కోట్లను తాకింది. ప్రత్యర్థి కంపెనీ వీఐపీ 27 శాతం వృద్ధిని సాధించగా.. ఇందుకు దేశవ్యాప్తంగా టూరిజం కార్యకలాపాలు ఊపందుకోవడం దోహదపడింది. వార్షిక ప్రాతిపదికన స్థూల మార్జిన్లు 4.47 శాతం మెరుగుపడి 43 శాతాన్ని అధిగమించాయి. ఇందుకు ప్రొడక్టుల ధరల పెంపు, ముడివ్యయాలలో నిలకడ సహకరించాయి. దీంతో నిర్వహణ లాభం(ఇబిటా) 213 శాతం దూసుకెళ్లి రూ. 52 కోట్లకు చేరింది. ఇదే కాలంలో వీఐపీ 97 శాతం పురోభివృద్ధిని అందుకుంది. ఇక ఇబిటా మార్జిన్లు 17.1 శాతంగా నమోదయ్యాయి. అర్బన్ జంగిల్ బ్రాండుతో కంపెనీ ప్రీమియం ప్రొడక్టుల విభాగంలోకి ప్రవేశించింది. తద్వారా వీఐపీ ఇండస్ట్రీస్, శామ్‌సొనైట్‌కు చెందిన ఖరీదైన బ్రాండ్లతో పోటీకి దిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం సఫారీ ప్రీమియం ప్రొడక్టులకు పటిష్ట స్పందన లభిస్తోంది. ఇందుకు కోవిడ్–19 తదుపరి లగేజీ పరిశ్రమ జోరందుకోవడం సైతం దోహదం చేస్తోంది. వెరసి రానున్న రెండు, మూడేళ్లలో కంపెనీ మార్జిన్లకు అదనపు బూస్ట్ లభించనుంది. దీనికితోడు గతేడాది క్యూ4లో సాధించిన ఫలితాలు 2024–25 కాలంలో మార్జిన్ల అంచనాలను పెంచుతున్నాయి. దీంతో ఇబిటా వార్షికంగా 11 శాతం చొప్పున బలపడవచ్చని భావిస్తున్నాం. పటిష్ట యాజమాన్య నిర్వహణ నేపథ్యంలో అమ్మకాలలో పరిశ్రమను మించిన వృద్ధి, అత్యధిక నిర్వహణ లాభ మార్జిన్లను సాధించే వీలుంది.

శ్రీరామ్ లైఫ్ నుంచి గోల్డెన్ జూబ్లీ ప్లాన్



శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ తాజాగా గోల్డెన్ జూబ్లీ పేరిట ప్రత్యేక ప్లాన్‌ను ఆవిష్కరించింది. పాలసీదారుకు ఇటు లైఫ్ కవరేజీ అందిస్తూనే అటు ఆర్థిక లక్ష్యాలకు కూడా తోడ్పాటు అందించేలా ఈ యూనిట్ లింక్డ్ పథకాన్ని తీర్చిదిద్దింది. ఈ పాలసీ లైఫ్ గోల్ (నిర్దిష్ట కాలం వరకు కవరేజీ), లెగసీ (100 ఏళ్ల వరకు కవరేజీ) అని రెండు ఆప్షన్లలో లభిస్తుంది. పాలసీ వ్యవధిలో నిర్దిష్ట ఆర్థిక లక్ష్యాలను సాధించదల్చుకునే వారికి లైఫ్ గోల్ ఆప్షన్ ప్రయోజనకరంగా ఉంటుంది. పాలసీదారులు చివరి వరకు పెట్టుబడులను కొనసాగిస్తూ తమ కుటుంబ సభ్యులకు గణనీయంగా సంపదను అందించేందుకు లెగసీ ఆప్షన్ ఉపయోగపడుతుంది. లైఫ్ గోల్ ఆప్షన్‌లో 35 ఏళ్ల వయస్సు గల వ్యక్తి 30 ఏళ్ల వ్యవధికి పాలసీ తీసుకుని ఏటా రూ. 3 లక్షలు చెల్లిస్తే మార్కెట్ పరిస్థితులు, రాబడి రేటును బట్టి ఆఖర్లో రూ. 1.45 కోట్ల నుంచి రూ. 2.93 కోట్ల వరకు ఫండ్‌ను సమకూర్చుకోవచ్చు. అదే లెగసీ ఆప్షన్‌లో 65 ఏళ్ల కాల వ్యవధిలో రూ. 6.64 కోట్ల నుంచి రూ. 39.72 కోట్ల వరకు లభించవచ్చని సంస్థ తెలిపింది.

వ్యాల్యూ స్టాక్‌ను గుర్తించడం ఎలా?

అంతర్గతంగా ఎంతో విలువ దాగి ఉన్న స్టాక్స్‌ను గుర్తించడం ఎలా? – కపిల్

వాస్తవ విలువ కంటే తక్కువలో ట్రేడ్ అవుతున్న (అండర్ వ్యాల్యూడ్) స్టాక్‌ను గుర్తించం కూడా ఒక కళనని చెప్పుకోవచ్చు. డిస్కౌంటింగ్ సూత్రాన్ని ఇక్కడ అమలు చేసి చూడాల్సి ఉంటుంది. అంటే వచ్చే ఐదు, పదేళ్ల కాలంలో కంపెనీ ఆదాయాలు ఏ మేరకు వృద్ధి చెందుతాయో చూడాలి. అలాగే, యాజమాన్యం ఎంత ఉత్తమమైనది? అన్నది కూడా చూడాలి. కంపెనీ నిధులను నిజాయితీగా నిర్వహిస్తారా? విశ్వసనీయత కలిగిన వారేనా? అలాగే, ఆ కంపెనీ పనిచేస్తున్న రంగంలో మంచి వృద్ధికి అవకాశం ఉందా? భవిష్యత్తు ఉన్నదేనా? అవకాశాలను అనుకూలంగా మార్చుకోగలదా? వీటిని విశ్లేషించుకోవాలి. అలాగే, మీకు మంచిగా కనిపించిన కంపెనీల గురించి ఎన్నో ప్రతికూల వ్యాఖ్యానాలు వినిపిస్తుంటాయి. వాటన్నింటినీ తట్టుకుని పెట్టుబడులను కొనసాగించే బలం కూడా కావాలి.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను మూడు, నాలుగేళ్ల కోసం ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ప్రస్తుతం వడ్డీ రేట్లు గరిష్ట స్థాయిలో ఉన్నందున, ఇక్కడి నుంచి వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలు ఉన్నందున లాంగ్‌టర్మ్ బాండ్లలో ఇన్వెస్ట్ చేయడం మంచిదేనా? దీనికంటే మరేదైనా మెరుగైన ఆప్షన్ ఉందా? – అంకిత్ ముద్రా

వడ్డీ రేట్లు, వీటికి సంబంధించిన సైకిల్ (కాల వ్యవధి) అనేవి ఊహించనివి. పరిస్థితులు, సూక్ష్మ ఆర్థిక అంశాల ఆధారంగా ఇవి మార్పులకు లోనవుతుంటాయి. కరోనా మహమ్మారి రాకతో ఫైనాన్షియల్ మార్కెట్లలో పరిస్థితులను చక్కదిద్దేందుకు 2020 మార్చి–మేలో వడ్డీ రేట్ల కోతను గుర్తుకు తెచ్చుకోండి. ద్రవ్యోల్బణం నియంత్రణకు ఇటీవల వరుసగా చేపట్టిన రేట్ల పెంపులు కూడా ఒక నిదర్శనమే. కచ్చితంగా వడ్డీ రేట్ల సైకిల్‌ను అంచనా వేయడం ఎవరి వల్లా కాదు. ఆ విధమైన అంచనాలతో పోర్ట్‌ఫోలియో ఏర్పాటు చేసుకోవడం రిస్క్ తీసుకోవడమే అవుతుంది. కనుక స్థూల ఆర్థిక అంశాల కంటే మీ పెట్టుబడుల కాలవ్యవధికి అనుగుణమైన సాధనాలపై దృష్టి సారించడమే మంచిది. మూడు నాలుగేళ్ల కోసం ఇన్వెస్ట్ చేసుకునేట్టు అయితే అప్పుడు బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే మెరుగైన సాధనానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అదే సమయంలో పెట్టుబడికి రక్షణ ఉండాలి. అటువంటప్పుడు షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ అనుకూలం. ఈ పథకం కాల వ్యవధి, మీ పెట్టుబడుల కాల వ్యవధికి ఒకే రకంగా ఉంటుంది. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సెక్యూరిటీల్లో (డెట్ సాధనాలు) పెట్టుబడులు పెట్టడం వెనుక ఉద్దేశ్యం స్థిరమైన రాబడులు ఆశించడమే. ఈక్విటీల్లో మాదిరి అస్థిరతలు లేకుండా, పెట్టుబడికి రక్షణ కల్పించుకోవడం. లాంగ్ టర్మ్ బాండ్ ఫండ్స్ చూడ్డానికి ఆకర్షణీయంగా అనిపించొచ్చు. కానీ అవి ఎంతో అస్థిరతలతో ఉంటాయి. దీర్ఘకాలంలో షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌లో మాదిరే రాబడులను ఇస్తాయి. డెట్ ఫండ్స్ ఎంపిక చేసుకునేప్పుడు అనుసరించాల్సిన సూత్రం మీ పెట్టుబడుల కాల వ్యవధి, ఎంపిక చేసుకునే సాధనం పెట్టుబడుల కాలవ్యవధి ఒకే విధంగా ఉండాలి. ఇక మీ పెట్టుబడుల కాలవ్యవధి మూడు నాలుగేళ్లు కనుక ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌ను కూడా చూడొచ్చు. ఈక్విటీలతో వచ్చే రిస్క్ కొంత ఇందులో ఉంటుంది. ఇవి ఈక్విటీలు, డెట్, ఆర్బిట్రేజ్ సాధనాల్లో ఇన్వెస్ట్ చే స్తాయి. లాంగ్ డ్యురేషన్ ఫండ్స్ కంటే ఎక్కువ రాబడులు ఇస్తాయి. అచ్చమైన ఈక్విటీలతో పోలిస్తే తక్కువ అస్థిరతలతో మెరుగైన రాబడులు ఇస్తాయి.

శామ్కో యాక్టివ్ మూమెంటమ్ ఫండ్



న్యూఢిల్లీ: దేశంలో మొదటి యాక్టివ్ మూమెంటమ్ ఫండ్‌ను శామ్కో అస్సెట్ మేనేజ్‌మెంట్ ప్రారంభించింది. రిస్క్ సర్దుబాటుతో కూడిన రాబడులు అందించడం ఈ పథకం విధానంలో భాగంగా ఉంటుందని తెలిపింది. భారీ వృద్ధితో కూడిన మూమెంటమ్ పెట్టుబడి అవకాశాలపై పథకం దృష్టి పెడుతుందని పేర్కొంది. స్టాక్ ధరల్లో బ్రేకవుట్, ధరల్లో ఆధిపత్యం తదితర మూమెంటమ్ అవకాశాలను గుర్తించి ఈ పథకం పెట్టుబడి పెడుతుంది. ఇందుకు అల్గోరిథమ్ సేవలను కూడా ఉపయోగించుకుంటుంది. పరాస్ మటాలియా ఫండ్ మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. ఈ నూతన పథకం ఈ నెల 15 నుంచి 29 వరకు చందాలను స్వీకరించనుంది.

రోజూ 35 లక్షల మందికి 'ఉపాధి'

వ్యవసాయ పనులు లేనప్పుడూ కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

గ్రామీణ పేదలకు ఈ వేసవిలో 70 రోజుల్లోనే రూ.2,952.66 కోట్లు	37.59 లక్షల కుటుంబాలకు ప్రయోజనం.. అందులో మూడోవంతు ఎస్సీ, ఎస్టీలే	ఈ వేసవిలో పేదలకు పనుల కల్పనలో దేశంలోనే మన రాష్ట్రమే టాప్



సాక్షి, అమరావతి: వ్యవసాయపనులు ఉండని ఈ వేసవి రోజుల్లోను గ్రామీణ ప్రాంతాల్లో పేదలు పనుల కోసం పట్టణాలకో, నగరాలకో వలస పోవాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా సొంత ఊళ్లలోనే పనులు కల్పిస్తోంది. ఇప్పుడు రోజూ 30 లక్షల నుంచి 35 లక్షల మంది ఈ పనులకు హాజరవుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటోతేదీ నుంచి జూన్ పదోతేదీ వరకు గత 70 రోజుల్లో రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 37.59 లక్షల పేద కుటుంబాలు ఈ పనులు చేసుకుని రూ.2,952.66 కోట్ల మేర లబ్ధిపొందినట్లు రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు వెల్లడించారు. శనివారం (ఈ నెల పదోతేదీ) కూడా 35.70 లక్షల మంది సొంత ఊళ్లలోనే ఈ పనులు చేసుకుని లబ్ధి పొందారు. మరోవైపు ఈ పనులకు హాజరయ్యే వారికి ఒక్కొక్కరికి రోజుకు సరాసరిన రూ.245 చొప్పున గిట్టుబాటు అవుతోందని, పనులకు హాజరయ్యేవారిలో 60 శాతం వరకు మహిళలే ఉంటున్నారని అధికారులు తెలిపారు. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఉపాధి పనులకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య విరామం కల్పించింది. ఎండతీవ్రత తక్కువగా ఉండే ఉదయం, సాయంత్రం వేళల్లోనే ఈ పనులు చేయిస్తోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ అన్ని జిల్లాల డ్వామాల పీడీలతో ప్రతి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ఈ వేసవిలో పేదలకు పనుల కల్పన కార్యక్రమాన్ని సమీక్షిస్తున్నారు.

11.62 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు లబ్ధి

ఈ వేసవిలో ఇప్పటివరకు రాష్ట్రంలో మొత్తం 37.59 లక్షల గ్రామీణ ప్రాంత కుటుంబాలు ఉపాధిహామీ పథకం పనులు చేసుకుని లబ్ధిపొందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో 8,36,826 ఎస్సీ కుటుంబాలు, 3,25,204 ఎస్టీ కుటుంబాలు (మొత్తం 11,62,030 ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు) ప్రయోజనం పొందినట్లు చెప్పారు.

12.06 కోట్ల పని దినాలు

గత నాలుగు సంవత్సరాల మాదిరే.. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ఉండని వేసవి కాలంలోను ఉపాధిహామీ పథకం ద్వారా పేదలకు పనుల కల్పనలో ఈ ఏడాది కూడ మన రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కలిపి ఈ వేసవిలో ఇప్పటివరకు 73.52 కోట్ల పనిదినాల పాటు పేదలకు పనులు కల్పించారు. అందులో ఆరోవంతు (16 శాతానికి పైగా) మేర 12.06 కోట్ల పనిదినాల పాటు పేదలకు పనులు కల్పించిన మన రాష్ట్రం ఈ పథకం కింద పనుల కల్పనలో దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. రెండోస్థానంలో ఉన్న తమిళనాడు 8.37 కోట్ల పనిదినాల పాటు పేదలకు పనులు కల్పించింది.

ఇక రామాయపట్నం ఎయిర్‌పోర్టుపై దృష్టి

సాక్షి, అమరావతి: భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం మరో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులపై దృష్టిసారించింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గంలోని రామాయపట్నం పోర్టుకు సమీపంలో తెట్టు వద్ద పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో దీన్ని నిర్మించడానికి వేగంగా అడుగులు వేస్తోంది. ఇందుకోసం రామాయపట్నం పోర్టుకు సమీపంలో గుడ్లూరు మండలంలోని మోచెర్ల, చేవూరు, పొట్లూరు గ్రామాల్లో విస్తరించి ఉన్న 2,064.44 ఎకరాల అటవీ భూమిని ఎంపిక చేశారు. ఈ భూమికి సంబంధించి సర్వే దాదాపుగా పూర్తయిందని, త్వరలోనే ఈ భూములను తీసుకుని ప్రత్యామ్నాయంగా నెల్లూరు, ఒంగోలు వద్ద ప్రభుత్వం భూమిని అటవీశాఖకు బదలాయిస్తామని రాష్ట్ర ఏవియేషన్ సలహాదారు, ఏపీఏడీసీఎల్ ఎండీ భరత్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. త్వరలోనే కేంద్ర అటవీశాఖకు ఈ ప్రతిపాదనలను పంపనున్నామని, అక్కడ నుంచి ఆమోదం రాగానే టెండర్ల ప్రక్రియకు శ్రీకారం చుడతామని చెప్పారు. రామాయపట్నం వద్ద పోర్టుకు తోడు పోర్టు ఆధారిత పారిశ్రామిక పార్కుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా గతంలో ప్రతిపాదించిన దగదర్తి స్థానంలో.. పోర్టు, పారిశ్రామిక పార్కుకు దగ్గరగా ఉండేలా కార్గో ఆధారిత విమానాశ్రయాన్ని రామాయపట్నం వద్ద అభివృద్ధి చేయనున్నారు. దగదర్తి కంటే రామాయపట్నం ఎయిర్‌పోర్టు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు అనువుగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. జాతీయ రహదారి (ఎన్‌హెచ్)- 16కి తూర్పువైపు పోర్టు ఉంటే, పడమర వైపు ఎయిర్‌పోర్టు ఉంటుంది. రామాయపట్నం పోర్టుకు ఈ ఏడాది చివరికి ఈ తొలి నౌకను తీసుకొచ్చే విధంగా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పోర్టుకు ఆనుకుని షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ భారీ సోలార్ విద్యుత్ ఉపకరణాల తయారీ యూనిట్ నెలకొల్పుతోంది. ఇక్కడ వాణిజ్య కార్యకలాపాలు పూర్తిస్థాయిలో మొదలయ్యేలోగా ఎయిర్‌పోర్టును కూడా సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు భరత్‌రెడ్డి చెప్పారు.

● తెలంగాణ

కళ్లల్లో పొడిచి.. కత్తితో కోసి..

- నర్సింగ్ విద్యార్థిని దారుణ హత్య
- బావ అనిల్, తండ్రి, తమ్ముడిని విచారిస్తున్న పోలీసులు

పరిగి: నర్సింగ్ విద్యార్థిని దారుణ హత్యకు గురైన సంఘటన తెలంగాణలోని వికారాబాద్ జిల్లా పరిగి మండలం కాళ్లాపూర్ గ్రామంలో ఆదివారం వెలుగుచూసింది. బలమైన ఆయుధంతో దాడి చేసి చంపినట్లు స్పష్టంగా తెలుస్తోంది. హంతకులు రెండు కళ్లను పొడవడంతో పాటు కత్తితో గొంతు కోశారు. ఆమె బావను ప్రశ్నిస్తున్నారు.

చిన్నక్క అన్నం వండలేదు..

పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. జుట్టు యాదమ్మ, జంగయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కూతురు శ్రీలత వివాహం కాగా మిగిలిన ముగ్గురూ చదువుకుంటున్నారు. మూడో సంతానం శిరీష (19) బీఎస్సీ నర్సింగ్ చదువుతూ వికారాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. యాదమ్మకు ఇటీవల గుండె ఆపరేషన్ కావడంతో నిమ్స్‌లో చికిత్స పొందుతోంది. శనివారం రాత్రి శిరీష తమ్ముడు శ్రీను.. అక్క భర్త అయిన అనిల్‌కు ఫోన్ చేసి చిన్నక్క అన్నం వండలేదని చెప్పాడు. దీంతో తన స్వగ్రామమైన పరిగి నుంచి కాళ్లాపూర్ వచ్చిన అనిల్ మరదలు శిరీషను మందలించాడు. ఈ దీంతో ఇద్దరి మధ్య గొడవ జరగ్గా.. శిరీషను అనిల్ కొట్టాడు. మనస్తాపానికి గురైన యువతి రాత్రి 10:30 గంటల సమయంలో ఇంటినుంచి బయటకు వెళ్లిపోయింది. ఆదివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలో ఉన్న కుంటలో శిరీష మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి అన్న శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన శిరీషను అనిల్ బైక్‌పై తీసుకెళ్తుండగా తాము చూశామని పలువురు స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అనిల్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతన్ని విచారిస్తున్నారు. శిరీష తండ్రి, తమ్ముడిని కూడా వేర్వేరుగా విచారిస్తున్నారు. కాగా శిరీష ఇంట్లో లేదని తెలిసిన తర్వాతే తాను కాళ్లాపూర్ వచ్చానని అనిల్ చెప్పినట్లు సమాచారం. కానీ అనిల్ కొట్టడంతోనే ఆమె ఇంటి నుంచి బయటకెళ్లిందని కుటుంబసభ్యులంటున్నారు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు.

పట్టాలు తప్పిన రైలు

- చెన్నై–అరక్కోణం మార్గంలో ఘటన

సాక్షి, చెన్నై: చెన్నై–అరక్కోణం మార్గంలో రైలు పట్టాలు తప్పింది. ఆదివారం ఉదయం చెన్నై నుంచి అరక్కోణం వైపు బయలుదేరిన ఎలక్ట్రికల్ రైలు వ్యాసార్పాడి, జీవా రైల్వేస్టేషన్‌ల మధ్య పట్టాలు తప్పింది. పన్నెండు బోగీలతో బయలుదేరిన రైలులో చివర ఉన్న ఇంజిన్‌తో కూడిన బోగి పట్టాలు తప్పడంతో వెనక ఉన్న ఇంజిన్ డ్రైవర్ అప్రమత్తమయ్యారు. ఆయన ఇచ్చిన సమాచారంతో ముందున్న ఇంజిన్ డ్రైవర్ రైలును ఆపేశారు. రైలు బోగి పట్టాలు తప్పగానే పెద్ద శబ్దం రావడంతో ఆ బోగిలో ఉన్న ప్రయాణికులు భయంతో కిందకు దూకేశారు. ఏం జరిగిందో అర్థంకాక మిగిలిన బోగీల్లోని ప్రయాణికులు బయటకు దూకే ప్రయత్నం చేశారు. కిందకు దూకేసిన ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. రైల్వే అధికారులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన పట్టాలు తప్పిన బోగీని పట్టాలపైకి ఎక్కించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.